ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం 05.06.2025 | సంపుటి : 11 సంచిక : 317 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV

తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



ఇథనాల్ కంపెనీ ప్రైవేటు సైన్యం దాడి చేయడంతో గాయపడ్డ మహిళ

# భగ్గుమన్న పెద్దధన్వాడ

పూర్తి వివరాలు 12లో

## ఇథనాల్ ఫ్యాక్టరీ పనులపై పెల్లుబికిన ప్రజాగ్రహం

## సుమారు 2వేల మంది తరలిరావడంతో తీవ్ర ఉద్రిక్తత

- మహిళలపై ఫ్యాక్టరీ ప్రైవేటు సైన్యం దాడితో ఒక్కసారిగా అదుపుతప్పిన పరిస్థితి
- ఓ కంటైనర్, కారు, హిటాచీ వాహనం, గుడిసెలకు నిప్పు
- ముప్పై మందికిపైగా అరెస్ట్.. పోలీస్ స్టేషన్‌లో నిర్బంధం
- గామాల నుంచి ప్రజలు తరలిరాకుండా ఉదయం నుంచే అడ్డుకున్న పోలీసులు
- అరెస్ట్ చేసినవారిని విడుదల చేయకపోతే పోలీస్‌స్టేషన్‌లను ముట్టడిస్తామని గ్రామస్తుల హెచ్చరిక

పెద్దధన్వాడలో ప్రజాగ్రహం కట్టలు తెంచుకుంది. ఇచ్చిన మాటకు కట్టుబడలేదని నిలదీసేందుకు వస్తున్న ప్రజలపై ఫ్యాక్టరీ ప్రైవేటు సైన్యం దాడి చేయడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. ఈ క్రమంలో ఓ మహిళ తలకు తీవ్రంగా గాయం కావడంతో ఆగ్రహంతో రగిలిపోయిన ఆయా గ్రామాల ప్రజలు ఫ్యాక్టరీ నిర్మాణ స్థలంలో పెద్దఎత్తున మోహరించారు. అక్కడ ఏర్పాటు చేసిన కంటైనర్‌కు నిప్పపెట్టారు. హిటాచీ, కారును ధ్వంసం చేశారు. పోలీసులు చెదరగొట్టే ప్రయత్నం చేసినా అప్పటికే దాదాపు 2వేల మంది చేరుకోవడంతో ఫ్యాక్టరీ వ్యతిరేక నినాదాలతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. ప్రజాప్రతినిధులు, పోలీసులు, అధికారులు హామీలిచ్చి మాట తప్పారని భగ్గుమన్నారు. అయితే బుధవారం ఉదయం నుంచే పలు గ్రామాల్లో మోహరించిన పోలీసులు పరిశ్రమ నిర్మాణ స్థలానికి రాకుండా అడ్డుకున్నారు. కొందరు గ్రామ నాయకులను నిర్బంధించారు.





ఆందోళనలో చిందర వందరగా పడ్డ సామాగ్రి

దాడిలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందతున్న మహిళకు నాయకుల పరామర్శ

## విజయోత్సవంలో..

# విషాదం..

**11 మంది మృతి**

- ఆర్‌సీబీ విజయోత్సవ సభలో అపశృతి
- చిన్నస్వామి స్టేడియం వద్ద తొక్కిసలాట
- ఘటనలో 50మందికిపైగా గాయాలు

భారీగా అభిమానుల రాకతో స్టేడియం వద్ద దుర్ఘటన

అదుపు చేయలేక చేతులెత్తేసిన బెంగళూరు పోలీసులు







ఘటనలో గాయపడిన బాలుడిని ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసు..

ఘటనలో ఒకరినొకరు తొక్కుకుంటూ ముందుకెళ్తున్న దృశ్యం..

**బెంగళూరు(జనంసాక్షి):** బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం దగ్గర అపశ్రుతి చోటు చేసుకుంది. ఆర్‌సిబి విజయోత్సాహంలో విషాదం చోటుచేసుకుంది. క్రికెటర్ల విజయోత్సవాతన్ని కళ్లారాచూడాలని తరలివచ్చిన అభిమానుల తోపులాట తొక్కిసలాటకు దారి తీసింది. ఈ క్రమంలో పదిమంది మృత్యువాతపడ్డారు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు 18 ఏళ్ల నిరీక్షణ తర్వాత కప్పు సాధించిన ఆనందంలో అభిమానులు భారీగా చిన్నస్వామి స్టేడియం వద్దకు చేరుకున్నారు. దీంతో అక్కడ భారీగా తొక్కిసలాట జరిగింది. చిన్నస్వామి స్టేడియం లోపలికి అభిమానులు తోసుకెళ్లేందుకు ప్రయత్నించారు. బారికేడ్లు దూకి స్టేడియంలోకి వెళ్లేందుకు అభిమానులు ప్రయత్నించారు. భారీ సంఖ్యలో వచ్చిన అభిమానులను పోలీసులు నియంత్రించలేకపోయారు. దీంతో అక్కడ తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో పది మంది మృతి చెందారు. మరో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. దాదాపు 50 మంది గాయాల పాలయ్యారు.వారిని వివిధ అస్పత్రులకు తరలించారు. అభిమానులను నియంత్రించేందుకు చిన్నస్వామి

మిగతా 2లో..

పాక్‌కు గూఢచర్యం..

## మరో యూట్యూబర్ జస్బీర్ సింగ్ అరెస్టు



**ఛండీగఢ్(జనంసాక్షి):** పహల్గాంలో ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ తర్వాత పాకిస్థాన్‌తో సంబంధం ఉన్న గూఢచర్య నెట్‌వర్క్‌పై అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా పాక్‌కు గూఢచర్యం చేస్తున్న ఆరోపణలతో మరో యూట్యూబర్‌ను పంజాబ్ పోలీసులు అరెస్టు చేశారు అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. రూపనగర్ జిల్లాలోని మహలాన్

మిగతా 2లో..

## 'ఎర్రగడ్డ' ఘటనపై మంత్రి దామోదర ఆరా

ఫుడ్ పాయిజనింగ్‌పై విచారణకు ఆదేశం

ఆర్ఎంవో డాక్టర్ పద్మజ సస్పెన్షన్

ఆహార పదార్థాల సరఫరా కాంట్రాక్టర్ తొలగింపు



**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ అవతరణ దినోత్సవం రోజు ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రిలో చోటు–చేసుకున్న ఫుడ్ పాయిజన్ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. జూన్ 2న జరిగిన ఈ ఘటనపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ

మిగతా 2లో..

ఈసారి రెండు దఫాల్లో

## ఒకేసారి కుల,జనగణన

2027లో నిర్వహిస్తామని ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం



మహిళలు, పురుషుల లెక్కింపుతో పాటు కులం, ఉపకులాలను లెక్కించి జాబితా రూపకల్పన

హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కశ్మీర్, ఉత్తరఖండ్, లద్దాఖ్‌లతో పాటు కేంద్ర పాలిత ప్రాంతాల్లో 2026 అక్టోబర్ లోనే లెక్కింపు మొదలు..


**న్యూఢిల్లీ(జనంసాక్షి):** దేశవ్యాప్త జనగణన ఎప్పుడు నిర్వహిస్తారోనన్న ఎదురుచూపులకు తెర పడే సమయం ఆసన్నమైంది. జనగణనకు కేంద్రం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. 2027 మార్చి 1 నుంచి జనాభా లెక్కింపు జరగనుందని కేంద్ర అధికార వర్గాలు వెల్లడించాయి. దీంతో పాటు కుల గణన కూడా నిర్వహించనున్నట్లు తెలిపాయి. హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కశ్మీర్, ఉత్తరఖండ్, లద్దాఖ్‌లతో పాటు కేంద్ర పాలిత ప్రాంతాల్లో మాత్రం 2026 అక్టోబర్ ప్రారంభంలోనే లెక్కింపు మొదలుపెట్టే అవకాశం ఉందని పేర్కొన్నాయి. ఈ జనాభా గణన రెండు దశల్లో నిర్వహించనున్నారు. మహిళలు, పురుషుల లెక్కింపుతో పాటు కులం, ఉపకులాలను లెక్కించి జాబితా రూపొందించనున్నారు. కేంద్ర హెూంశాఖ ఆధ్వర్యంలోని 'రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సస్ కమిషనర్ ఆఫ్ ఇండియా' పర్యవేక్షణలో జనాభా లెక్కలు నిర్వహిస్తారు .సాధారణంగా పదేళ్లకోసారి జనాభా లెక్కలు నిర్వహిస్తారు. చివరి సారి 2011లో దీన్ని నిర్వహించారు. 2021 జనాభా లెక్కలకు సంబంధించి 2020లోనే ఈ ప్రక్రియ చేపట్టాల్సింది. కానీ.. కొవిడ్ కారణంగా వాయిదా పడింది. ఎప్పుడు నిర్వహిస్తారనేదాని పైనా స్పష్టత లేకుండా పోయింది. సరైన సమయంలో నిర్వహిస్తామని

మిగతా 2లో..

## జూన్ 18 నుంచి టెట్

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. జూన్ 18 నుంచి 30వ తేదీ వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. నోటిఫికేషన్‌లో జూన్ 15 నుంచి ప్రారంభమవుతాయని పేర్కొన్నప్పటికీ 18వ తేదీ నుంచి నిర్వహిస్తుండటం

మిగతా 2లో..



కేసీఆర్‌కు కాళేశ్వరం కమిషన్ నోటీసులు

## రాజకీయ దురుద్దేశంతోనే..

ఇందిరా పార్క్ వద్ద ధర్నాలో ఎమ్మెల్సీ కవిత



**హైదరాబాద్(జనంసాక్షి):** రాజకీయ దురుద్దేశంతోనే మాజీ సీఎం కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారని భారాస ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. నోటీసులను నిరసిస్తూ ఇందిరా పార్క్ వద్ద తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ కేసీఆర్ ఏం తప్పు చేశారని నోటీసులు ఇచ్చారని ప్రశ్నించారు. ఆయనకు ఇచ్చారంటే

మిగతా 2లో..



## జులై 21 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు: కిరణ్ రిజిజు

2వ

## ఆ రోజు రాత్రంతా మోదీ మెలకువతోనే ఉన్నారు

ప్రతి నిమిషం దాడులపై ఆరా తీసారు

ఆపరేషన్ సిందూర్‌పై మీడియాకు వివరించిన మంత్రి జితేంద్రసింగ్



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టిన సందర్భంలో ఆ రోజు రాత్రి ప్రధాని మోడీ నిముషనిముషానికి వివరాలు తెలుసుకుంటూ గడిపారని కేంద్రమంత్రి జితేంద్రసింగ్ వెల్లడించారు. అర్థరాత్రి సమయంలో చేపట్టిన ఈ ఆపరేషన్‌ను ప్రధాని మోదీ ఎలా పర్యవేక్షించారనే విషయాన్ని కేంద్ర మంత్రి జితేంద్ర

మిగతా 9లో..

## పాక్‌కు ఆసియా అభివృద్ధి బ్యాంక్ రుణసాయం



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** పాకిస్థాన్‌కు ఆసియా అభివృద్ధి బ్యాంక్ 800 మిలియన్ డాలర్ల రుణం మంజూరు చేయడాన్ని భారత్ తీవ్రంగా ఖండించింది. పాక్ సైనిక వ్యయం కోసం నిధులు దుర్వినియోగం చేసే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తంచేసింది. జూన్ 3న ఈ ప్యాకేజీకి ఆమోదం లభించింది. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకార చర్యగా భారత్ 'ఆపరేషన్ సిందూర్'తో గట్టిగా బదులు తీర్చుకుంది. ఆ నేపథ్యంలో

### తీవ్రంగా ఖండించిన భారత్

రెండుదేశాల మధ్య యుద్ధవా తావ రణం నెలకొన్న సంగతి తెలిసిందే. తరుణంలో పాకిస్థాన్‌కు రుణం ఇవ్వకూడదని భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ అంతర్జాతీయ ద్రవ్య నిధి నుంచి 1 బిలియన్ డాలర్ల నిధులు (దాదాపు రూ.8,540 కోట్లు) మంజూరయ్యాయి. ఎక్స్‌టెండెడ్ ఫండ్ ఫెసిలిటీ కింద ఈ మొత్తాన్ని ఇవ్వడానికి ఐఎంఎఫ్ ఆమోదం

మిగతా 2లో..

## పాక్‌కు వరుసగా ఎదురుదెబ్బలే..

తమ పరాభవాలు ఒప్పుకున్న బిలావల్ భుట్టో

వార్త 2లో



జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిని మర్యాదపూర్వకంగా కలిసిన తెలంగాణ కేడర్ కు చెందిన 2024 బ్యాచ్ ట్రైనీ ఐఏఎస్‌లు

## పాక్‌కు గూఢచర్యం మరో యూట్యూబర్ జస్బీర్ సింగ్ అరెస్టు..

గ్రామానికి చెందిన జస్బీర్ సింగ్ 'జాన్ మహల్' అనే పేరుతో ఓ యూట్యూబ్ ఛానెల్ నిర్వహిస్తున్నాడు. ఇతడి ఛానెల్‌కు 1.1 మిలియన్ల మంది సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. నిందితుడికి పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ అధికారి, ఐఎస్‌ఐకు పనిచేస్తున్నాడనే ఆరోపణలు ఎదుర్కొంటున్న షకీర్ అలియాస్ జుట్ రాంధావాతో సంబంధాలు కొనసాగిస్తున్నాడు. పాక్ రాయబార కార్యాలయ అధికారి ఎహసాన్ ఉర్ రహీం అలియాస్ డానిష్‌తో కూడా టచ్‌లో ఉన్నాడు. ఇటీవల గూఢచర్యం కేసులో అరెస్టయిన హరియాణా యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా తో ఇతడికి దగ్గరి సంబంధాలు ఉన్నట్లు తేలింది.డానిష్ ఆహ్వానం మేరకు దిల్లీలోని పాక్ రాయబార కార్యాలయంలో జరిగిన జాతీయ దినోత్సవానికి కూడా సింగ్ హాజరయినట్లు గుర్తించాం. 2020, 21, 24లలో శత్రుదేశంలో ఇతడు పర్యటించాడు. నిందితుడికి సంబంధించిన ఎలక్ట్రానిక్ పరికరాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు తరలించగా.. దాయాది దేశానికి చెందిన అనేకమంది నంబర్లు బయటపడ్డాయి. జ్యోతి అరెస్టు నేపథ్యంలో వాటిని తొలగించేందుకు ప్రయత్నించాడనే ఆరోపణలు ఉన్నాయి. దీనిపై కేసు నమోదు చేసుకొని పూర్తిస్థాయి దర్యాప్తు చేస్తున్నాం. కాగా.. పాక్‌కు గూఢచర్యం కేసులో పంజాబ్‌లో ఇప్పటివరకు ఏడుగురు అరెస్టు అయ్యారు.పాకిస్థాన్ నిఘా సంస్థలకు భారత్‌కు చెందిన సున్నితమైన సమాచారాన్ని చేరవేస్తున్నారన్న ఆరోపణలపై యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా ఇటీవల అరెస్టయిన సంగతి తెలిసిందే. 2023లో పాక్‌కు వెళ్లిన సమయంలో ఆమెకు డానిష్‌తో పరిచయమైంది. అనంతరం ఆమె ఆ దేశ గూఢచర్య సంస్థ ప్రతినిధులతో టచ్‌లోకి వెళ్లినట్లు తెలిసింది. దీంతో పోలీసులు ఆమెను అరెస్టు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణలో జ్యోతి మల్హోత్రాకు ఉగ్రవాదులతో సంబంధం ఉన్నట్లు, ఉగ్ర కార్యకలాపాల్లో పాలుపంచుకున్నట్లు ఇప్పటివరకు ఎలాంటి ఆధారాలు లేవని పోలీసులు పేర్కొన్నారు. అయితే, ఆమె పూర్తి స్పృహతోనే పాకిస్థానీ ఇంటెలిజెన్స్ అధికారులతో సంప్రదింపులు కొనసాగించిందని అన్నారు.

## పాక్‌కు ఎప్పుడూ ఎదురుదెబ్బలే

**తమ పరాభవాలు ఒప్పుకున్న బిలావల్ భుట్టో**

**ఇస్లామాబాద్(జనంసాక్షి):** అంతర్జాతీయ వేదికలపై తమ దేశానికి తగిలిన ఎదురుదెబ్బల గురించి స్వయంగా పాక్ నేత బిలావల్ భుట్టో వెల్లడించారు.కశ్మీర్ అంశాన్ని ఐరాసలో లేవనెత్తేందుకు చేసిన ప్రయత్నాలకు ఫలితం దక్కలేదని వాపోయారు. ఆపరేషన్ సిందూర్‌పై ఏర్పాటైన భారత అఖిలపక్షం తరహాలో పాక్ కూడా తన విదేశాంగశాఖ మాజీ మంత్రి బిలావల్ భుట్టో ఆధ్వర్యంలో ఓ ఎంపీల బృందాన్ని ఏర్పాటుచేసింది. వీరిని అమెరికా పంపగా, ఆ పర్యటనలో భాగంగా న్యూయార్క్‌లోని ఐరాస కేంద్ర కార్యాలయంలో భుట్టో మాట్లాడారు. "కశ్మీర్ అంశానికి సంబంధించినంతవరకు మనం ఎదుర్కొంటున్న అడ్డంకులు ఇప్పటికీ ఉన్నాయి. దీంతోపాటు ఇతర వేదికలపై ఎదురుదెబ్బలు తగిలాయి" అని వ్యాఖ్యానించారు. "రెండు అణ్వస్త్ర దేశాల మధ్య వివాదాల పరిష్కార వ్యవస్థను తీసుకురావడం అసాధ్యం. మా రెండు దేశాలకు చెందిన నిఘాసంస్థలు ఐఎస్ఐ, రా.. కలిసి కూర్చొని, ఈ ఉగ్రవాద శక్తులపై పోరాటం కోసం కలిసి పనిచేస్తే, ఉగ్రవాద కార్యకలాపాలు తగ్గిపోతాయని నేను భావిస్తున్నాను" అని మాట్లాడారు. రెండు దేశాల మధ్య నిరంతర ఘర్షణ విద్రోహశక్తులను బలోపేతం చేస్తుందని ఆందోళన వ్యక్తంచేయడం గమనార్హం. నిత్యం ఉగ్రవాదాన్ని ఎగదోసే ఆ దేశం నీతులు చెప్పడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.గతంలోనూ తన దేశం గురించి ఆయన వాస్తవాలు బయటపెట్టారు. ఉగ్రవాద సంస్థలతో పాకిస్థాన్‌కు సంబంధాలు నిజమేనంటూ ఇటీవల వెల్లడించారు. "పాకిస్థాన్‌కు గతం ఉందనేది రహస్యం కాదని నేను భావిస్తున్నా. ఫలితంగా మనం బాధపడ్డాం. పాకిస్థాన్ నష్టపోయింది. ఆ పరిణామాల నుంచి పాఠాలు నేర్చుకున్నాం. ఈ సమస్య పరిష్కారానికి అంతర్గత సంస్కరణలు చేపట్టాం. పాకిస్థాన్ తీవ్రవాద చరిత్ర తిరస్కరించలేనిది. అయితే, అది ముగిసిన అధ్యాయం. అది మన చరిత్రలో ఒక దురదృష్ట భాగం" అని స్థానిక మీడియాతో భుట్టో వెల్లడించారు.

## పాక్‌కు ఆసియా అభివృద్ధి బ్యాంక్ రుణసాయం..

తెలిపింది. పాక్‌కు నిధులు మంజూరు చేస్తే పరోక్షంగా ఉగ్రవాదాన్ని ప్రోత్సహించినట్లే అవుతుందని.. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ఐఎంఎఫ్ పాక్‌కు నిధులు సమకూర్చడంపై పునరాలోచించాలని భారత ప్రభుత్వం కోరిన సంగతి తెలిసిందే.

## రెండు దఫాల్లో ఒకేసారి కులగణన..

2024లో ఓ సందర్భంలో కేంద్ర మంత్రి అమిత్ షా తెలిపారు. 16 ఏళ్ల తర్వాత తొలిసారి జనాభా గణన నిర్వహించనున్నారు. ఇప్పటికే జనాభా లెక్కల వివరాల నమోదుకు సంబంధించి 30కిపైగా ప్రశ్నలను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.

## మనీశ్ సిసోదియా, సత్యేంద్ర జైన్‌లకు సమన్లు

**రూ.2 వేల కోట్ల స్కామ్‌లో నోటీసులు**



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** దిల్లీలోని పాఠశాల భవనాలు, తరగతి గదుల నిర్మాణాల్లో అవినీతికి పాల్పడ్డారంటూ ఇటీవల ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు మనీశ్ సిసోదియా సత్యేందర్ జైన్‌లపై కేసు నమోదైన సంగతి తెలిసిందే.తాజాగా ఈ కేసులో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) వీరికి సమన్లు జారీ చేసింది. ఈనెల 6న సత్యేందర్, 9న సిసోదియా దిల్లీలోని బ్యూరో కార్యాలయానికి రావాలని అందులో పేర్కొంది.అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆప్ ప్రభుత్వ హయాంలో సిసోదియా విద్యాశాఖ మంత్రిగా, సత్యేందర్ జైన్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (పీడబ్ల్యూడీ) మంత్రిగా ఉన్నారు. వారి నేతృత్వంలో దిల్లీలో 12,748 పాఠశాల భవనాలు, తరగతి గదుల నిర్మాణం తలపెట్టారు. ఈ నిర్మాణంలో రూ.2వేల కోట్ల అక్రమాలు జరిగాయనే ఆరోపణలు వచ్చాయి. 34 మందికి దీని కాంట్రాక్టులు దక్కగా.. వారిలో చాలామందికి ఆప్‌తో దగ్గర సంబంధాలు ఉన్నట్లు తేలింది. నిర్ణీత గడువులోగా నిర్మాణాలు పూర్తికాకపోగా, భారీగా ఖర్చు చేశారు. తరగతి గదులను 30 సంవత్సరాలు ఉండేలా కడితే.. వాటికి అయిన ఖర్చు మాత్రం చాలా ఎక్కువగా ఉంది.గడువు ప్రక్రియను పాటించకుండా కన్సల్టెంట్లు, ఆర్కిటెక్ట్‌లను నియమించుకోవడంతో వ్యయం దాదాపు ఐదు రెట్లు పెరిగిపోయింది. ఇటీవల సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) ఇచ్చిన నివేదికలో తరగతి గదుల నిర్మాణ ప్రాజెక్టులో అవకతవకలు జరిగాయని పేర్కొంది. కొత్త టెండర్లు తీసుకోకపోవడంతో ఈ ప్రాజెక్టు వ్యయం రూ.326 కోట్లు పెరిగిందని రిపోర్టులో తెలిపింది. సిసోదియా, జైన్‌లను విచారించేందుకు మార్చిలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలపడంతో ఏప్రిల్‌లో వీరిపై కేసు నమోదైంది.



బెంగుళూరులో చిన్నస్వామి స్టేడియం వద్ద ఆర్‌సీబీ విజయోత్సవ పరేడ్‌కు ఊహించని రీతిలో లక్షలాదిగా తరలివచ్చిన అభిమానులు..

# విజయోత్సవంలో విషాదం

స్టేడియం దగ్గర పోలీసులు లాఠీఛార్జ్ ప్రారంభించారు. స్టేడియం ఖాళీ చేయాలని అభిమానులకు పోలీసులు విజ్ఞప్తి చేశారు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు విజయోత్సవ కార్యక్రమం సందర్భంగా పెను విషాదం చోటు చేసుకుంది. 18 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ ఆర్సీబీ.. ఐపీఎల్ లో తొలి టైటిల్ సాధించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో ఆర్సీబీ జట్టుకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో స్టేడియం వద్దకు వేలాదిగా అభిమానులు తరలివచ్చారు. స్టేడియం గేట్లు, సమీపంలోని గోడలు, చెట్లు ఎక్కారు. గేట్-2 నుంచి స్టేడియం లోకి వెళ్లేందుకు ఒక్కసారిగా దూసుకెళ్లారు. అభిమానులను అదుపు చేసేందుకు పోలీసులు లాఠీఛార్జి చేయాల్సి వచ్చింది. దీంతో ఒక్కసారిగా తోపులాట జరిగింది. ఈ ఘటనలో 10 మంది మృతి చెందగా, 50 మందికి పైగా గాయపడ్డారు. క్షతగాత్రులను సమీపంలోని వివిధ ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుల్లో ఆరుగురు పురుషులు, నలుగురు మహిళలు ఉన్నారు. ఎన్నో పరాభవాల తర్వాత ఆర్సీబీ కల నెరవెరడంతో దేశవ్యాప్తంగా బెంగళూరు టీమ్ అభిమానులు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకుంటు-న్నారు. ఆర్సీబీ టీమ్ ట్రోఫీతో తొలిసారి బెంగళూరుకు రాగా.. ఫ్యాన్స్ ఘన స్వాగ తం పలికారు. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ విమా నాశ్రయానికి వెళ్లి ఆర్సీబీ జట్టుకు స్వాగతం పలికారు. విరాట్ కో హ్లీ, కృనాల్ పాండ్య, టిమ్ డేవిడ్, దినేశ్ కార్తిక్‌లకు ఆయన పుష్ప గుచ్ఛం అందించి స్వాగతం చెప్పారు. అనంతరం బెంగళూరు జట్టు ప్రత్యేక బస్సులో విధాన సౌధకు చేరుకుంది. వేలాది అభిమానులు ఆర్సీబీ జెండాలు చేతబూని విధాన సౌధ వద్దకు చేరుకున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా 'ఎర్రసముద్రాన్ని' తలపించింది. ఆర్సీబీ ఆటగాళ్లు బస్సులో వస్తున్న మార్గంలోనూ అభిమానులు సందడి చేశారు.








## అంతమంది వస్తారని ఊహించలేదు

**సీఎం సిద్ధరామయ్య తీవ్ర విచారం**

**బెంగళూరు(జనంసాక్షి):** ఆర్సీబీ విజయోత్సవాల నేపథ్యంలో బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో జరిగిన తొక్కిసలాట ఘటనలో 11మంది మృతి చెందిన ఘటనపై సీఎం సిద్ధరామయ్య తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తొక్కిసలాట ఘటన దురదృష్టకరమన్న ఆయన.. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ ఘటనపై న్యాయ విచారణకు ఆదేశిస్తున్నట్లు చెప్పిన సీఎం.. విచారణ కమిషన్‌కు 15 రోజులు గడువు ఇస్తున్నట్లు చెప్పారు. విజయోత్సవాలకు ఇంత పెద్ద సంఖ్యలో అభిమానులు వస్తారని తాము ఊహించలేదన్నారు. స్టేడియంలో కూర్చొనేంత మంది లేదా ఇంకాస్త ఎక్కువ మంది మాత్రమే వస్తారని అనుకున్నామని తెలిపారు. కానీ, భారీ సంఖ్యలో తరలివచ్చారన్నారు. స్టేడియం సామర్థ్యం 35వేలు అయితే.. 2లక్షల మందికి పైనే అభిమానులు తరలివచ్చారని తెలిపారు. ఈ ఘటనలో మృతి చెందినవారి కుటుంబాలకు రూ.10లక్షల పరిహారం ప్రకటించారు. గాయపడిన వారికి ఉచిత వైద్యం అందిస్తామన్నారు. మృతుల్లో ఎక్కువగా యువతే ఉన్నారని చెప్పారు.

## జులై 21 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** జులై 21 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు బుధవారం ప్రకటించారు.ఆ రోజు ఉదయం 11లకు రాజ్యసభ, లోక్‌సభ సమావేశమవుతాయని వెల్లడించారు. ఈ సమావేశ తేదీలను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలోని పార్లమెంట్ వ్యవహారాలపై క్యాబినెట్ కమిటీ నిర్ణయించినట్లు తెలిపారు.ఓ పక్క విపక్షాలు ఆపరేషన్ సిందూర్, పహల్గాం ఉగ్రదాడిపై పార్లమెంట్‌ను ప్రత్యేకంగా సమావేశ పర్చాలని డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రిజిజు స్పందిస్తూ.. వర్షాకాల సమావేశాల్లో అన్ని అంశాలను పార్లమెంట్ నిబంధనల ప్రకారం చర్చిస్తామని చెప్పారు.ఇక ఆపరేషన్ సిందూర్ తదితర అంశాలపై చర్చించేందుకు పార్లమెంటు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని మంగళవారం ఇండియా కూటమికి చెందిన 16 ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశాయి. దీనిపై దిల్లీలో జరిగిన కూటమి సమావేశంలో కాంగ్రెస్ నేతలు జైరాం రమేశ్, దీపేందర్ హుడా, తృణమూల్ కాంగ్రెస్ నేత డెరెక్ ఓబ్రియెన్, రాష్ట్రీయ జనతాదళ్ నేత మనోజ్ ఝా, సమాజ్‌వాదీ పార్టీకి చెందిన రామ్‌గోపాల్ యాదవ్, శివసేన (యూబీటీ) నాయకుడు సంజయ్ రౌత్ సహా పలు పార్టీల నేతలు పాల్గొన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ ఈ సమావేశంలో పాల్గొనకపోయినా ప్రత్యేక సమావేశం కోసం ప్రధానికి విడిగా లేఖ రాయనున్నట్లు వెల్లడించింది. బడ్జెట్ సమావేశాలు ఈ ఏడాది జనవరి 31న మొదలై.. ఏప్రిల్ 4న ముగిసిన విషయం తెలిసిందే.

## పాలన చేతకాకపోతే తప్పుకోండి

**ఎర్రగడ్డ ఆస్పత్రిలో ఫుడ్ పాయిజనింగ్ దారుణం**
**మాజీమంత్రి హరీశ్‌రావు విమర్శలు**

**సిద్దిపేట(జనంసాక్షి):** కాంగ్రెస్ పార్టీకి పాలన చేతగావడం లేదని ఎమ్మెల్యే హరీష్ రావు తీవ్రంగా విమర్శించారు. వేములవాడలో కోడెల మృతి, ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రిలో జరిగిన ఫుడ్ పాయిజన్ ఘటనలపై మాజీ మంత్రి హరీష్ రావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి పరిపాలన చేయడం చేతకావడం లేదని వ్యాఖ్యానించారు. ఎర్రగడ్డ మానసిక రోగులకు తగిన ఆహారం కూడా అందడం లేదని 70 మంది అస్వస్థతకు గురయ్యారని, ఈ విషయంపై ఇప్పటివరకు సీఎం నుంచి ఎలాంటి స్పందన కనిపించలేదని మండిపడ్డారు. వేములవాడలో కోడెల మరణం కొనసాగుతుండగా ప్రభుత్వం స్తంభించినట్లే ఉంది అని వ్యాఖ్యలు చేశారు. అనేక కోడెలు గడ్డి లేక చనిపోతున్నా, ప్రభుత్వం పట్టింపు తీసుకోవడంలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మాకు బాధ్యత అప్పగిస్తే కోడెలను కాపాడుతాం అని స్పష్టత ఇచ్చారు. ఈ మధ్యే మాపై కేసులు పెట్టడం, కమిషన్లు ఏర్పాటు- చేయడం తప్ప అసలు సమస్యలపై ప్రభుత్వాన్ని పట్టించుకోడం లేదని, నిజమైన ప్రజా సమస్యలను వదిలి మిగతా విషయాల్లో బిజీ అయ్యారని తెలిపారు. ఇక రేపటి కేబినెట్ సమావేశంలో రైతు బంధు డబ్బులను వెంటనే విడుదల చేయాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని తీవ్రంగా పిలుపునిచ్చారు.

# ఉక్కుపై టారిఫ్ డబుల్

- **25% నుంచి 50%కు పెంపు..**
- **ఉత్తర్వులపై ట్రంప్ సంతకం**



**న్యూయార్క్(జనంసాక్షి):** భారీ టారిఫ్‌లతో ప్రపంచ దేశాలను వణికిస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి వాణిజ్య యుద్ధానికి తెరలేపారు. అగ్రరాజ్యంలోకి దిగుమతి అయ్యే ఉక్కు, అల్యూమినియంపై గతంలో విధించిన 25% టారిఫ్‌ను రెట్టింపు చేసి 50 శాతానికి పెంచారు. ఈ పెంపు జూన్ 4 నుంచే అమల్లోకి వచ్చేలా ఉత్తర్వులపై సంతకాలు చేశారు. అమెరికా దేశ భద్రత, పరిశ్రమల రంగాన్ని రక్షించేందుకు ఈ చర్య అత్యంత కీలకమని ట్రంప్ ఈసందర్భంగా పేర్కొన్నారు. కాగా.. యూకేతో వాణిజ్య ఒప్పందం అమలులో ఉన్న నేపథ్యంలో ఆ దేశానికి మాత్రం 25 శాతం టారిఫ్ కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.2016-2020 మధ్య ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలోనూ స్టీల్, అల్యూమినియం దిగుమతులపై 25శాతం సుంకాలు విధించారు. అయితే, ఆ తర్వాత కెనడా, మెక్సికో, బ్రెజిల్ లాంటి వాణిజ్య భాగస్వాములకు వీటినుంచి మినహాయింపునిస్తూ టారిఫ్ రహిత కోటాలను కల్పించారు. అనంతరం అధికారంలోకి వచ్చిన బైడెన్ సర్కారు.. బ్రిటన్, జపాన్, ఐరోపా సమాఖ్యకు ఈ కోటాలను విస్తరించారు.ఈ నేపథ్యంలోనే ఈ ఏడాది ఆరంభంలో రెండోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన ట్రంప్.. ఉక్కు, అల్యూమినియంపై మళ్లీ టారిఫ్ బాంబు పేల్చారు. ఏ దేశానికీ మినహాయింపు ఇవ్వకుండా 25శాతం సుంకాలు విధిస్తూ ఏప్రిల్ 2న నిర్ణయం తీసుకున్నారు. తాజాగా దీన్ని రెట్టింపు చేశారు. దీంతో అమెరికాలో ఇళ్ల నిర్మాణం, వాహనాలు, ఇతర వస్తువులను తయారు చేయడానికి దిగుమతి చేసుకుంటున్న లోహాల ధరలు పెరగనున్నాయి.
అధికారిక గణాంకాల ప్రకారం, ప్రస్తుతం అమెరికా దిగుమతి చేసుకుంటున్న స్టీల్ ఉత్పత్తుల్లో అధిక శాతం కెనడా, బ్రెజిల్, మెక్సికో నుంచి వస్తున్నవే. దక్షిణ కొరియా, వియత్నాం కూడా ఈ జాబితాలో ఉన్నాయి. ఇక, అమెరికాకు అతిపెద్ద అల్యూమినియం సరఫరా దారుగా కెనడా నిలిచింది. 2024లో అగ్రరాజ్యం దిగుమతి చేసుకున్న మొత్తం అల్యూమినియంలో దాదాపు 79శాతం కెనడా నుంచి వచ్చిందే.ఇక, ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై అమెరికా 50% టారిఫ్ విధిస్తే, భారత ఎగుమతిదార్లపైనా ప్రభావం పడుతుందని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్ (జీటీఆర్ఐ) అంచనా వేసింది. 2024-25లో మన దేశం నుంచి 4.56 బిలియన్ డాలర్ల (రూ.38,000 కోట్ల) ఇనుము, ఉక్కు, అల్యూమినియం ఉత్పత్తులు అమెరికాకు ఎగుమతి అయ్యాయి.

**వాణిజ్యసమస్యలను పరిష్కరించాలి:పీయూష్ గోయల్**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** సుంకాలతో సంబంధం లేకుండా ఎదురవుతున్న వాణిజ్యపరమైన అడ్డంకులను తొలగించాలని ప్రపంచ వాణిజ్యసంస్థకు కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ పిలుపునిచ్చారు.అసమాన వాణిజ్య విధానాలను సరిదిద్దాలని, బలమైన వివాద పరిష్కార వ్యవస్థను పునరుద్ధరించాలన్నారు. తక్కువ అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న దేశాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. గత మంత్రివర్గ సమావేశాల్లో ముగింపు దశకు వచ్చిన అంశాలపై డబ్ల్యూటీఓ దృష్టిసారించాలని సూచించారు. భార్య వైపు చూస్తూ కూర్చోవడం గురించి మాట్లాడలేదు : నవ్వులు పూయించిన హర్ష్ గోయెంకా వాణిజ్యేతర అడ్డంకులను అరికట్టడం, వివాదాలకు కచ్చితమైన పరిష్కారం కోసం డబ్ల్యూటీఓలో బలమైన వ్యవస్థను ఏర్పాటుచేయాల్సిన అవసరం ఉందని గోయల్ అన్నారు. ఆస్ట్రేలియా, సింగపూర్, ఫ్రాన్స్, నైజీరియాతో పాటు 25 దేశాల మంత్రులతో జరిగిన సమావేశంలో పాల్గొన్న గోయల్ ఈ వ్యాఖ్యలు చేశారు. డబ్ల్యూటీఓ డైరెక్టర్ జనరల్ న్గోజీ ఒకోంజో-ఇవిమా కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. వ్యవసాయ సమస్యలు, మత్స్య సంపద క్షీణత ఇలా అనేక విషయాల్ని ఈ సమావేశంలో చర్చించారు.

## 'ఎర్రగడ్డ' ఘటనపై మంత్రి దామోదర ఆరా

మంత్రి దామోదర రాజ నరసింహ స్పందించారు. మొత్తం 92 మంది రోగులు అస్వస్థతకు గురవగా, వారిలో 18 మందిని తీవ్రంగా ఉండటంతో ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మిగిలిన వారిని గాంధీ ఆసుపత్రి, ఉస్మానియా సహా ఇతర ఆసుపత్రుల్లో ఏర్పాటు- చేసిన ఆరు వైద్య బృందాలు పర్యవేక్షిస్తున్నాయి. ఈ ఘటనపై మంత్రి దామోదర రాజ నరసింహ మాట్లాడుతూ, ఫుడ్ పాయిజన్ కు కారణంగా ఆసుపత్రిలో అందించిన ఆహారమే అని ప్రాథమికంగా నిర్ధారణ అయినట్లు- వెల్లడించారు. అదనంగా అందించిన స్వీట్ కూడా అనారోగ్యానికి కారణమైనట్లు- అనుమానం వ్యక్తం చేశారు. ప్రస్తుతం బాధితుల ఆరోగ్యం మెరుగవుతోందనీ, ప్రాణాలకు ఎటువంటి ప్రమాదం లేదని వైద్యులు తెలిపారు. వారు రెండు రోజుల్లో పూర్తిగా కోలుకుంటారని చెప్పారు. ఈ ఘటనకు కారణమైన డైయట్‌ను పర్యవేక్షించే కాంట్రాక్టర్ పనితీరు సంతృప్తికరంగా లేనందున అతని కాంట్రాక్టును రద్దు చేసినట్టు- మంత్రి తెలిపారు. ఇదే సమయంలో ఘటనపై సమగ్ర విచారణ కోసం ఒక ప్రత్యేక కమిటీని నియమిం చామని, కమిటీ నివేదిక వచ్చిన వెంటనే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇప్పటికే ఈ ఘటనపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయింది. ఇక ఫుడ్ పాయిజన్ కారణంగా మరణించిన వ్యక్తి కరణ్‌కు సంబంధించి పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉన్నట్లు- మంత్రి పేర్కొన్నారు. కరోనా వ్యాప్తి కోణంలో ఈ ఘటనపై ఆందోళన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రిలో కలుషితాహారం ఘటనలో మంగళవారం ఒక రోగి మృతి చెందడంతో పాటు- 70 మంది అస్వస్థతకు గురయ్యారు. బుధవారం కూడా పలువురు రోగులు డయేరియా లక్షణాలతో బాధపడుతున్నారు. వీరిలో 18 మందిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కలుషితాహార ఘటనపై ఎర్రగడ్డ ఆసుపత్రిలో డీఎంఈ, డీఎంహెచ్‌వో, వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు విచారణ చేస్తున్నారు. తాగునీరు కలుషితమైందా? అనే కోణంలోనూ పరిశీలిస్తున్నారు. ఈ సంఘటనకు కారణాలు తెలుసుకునేందుకు నమూనాలను పరీక్షలకు పంపారు.

ఎర్రగడ్డలోని మానసిక ఆరోగ్య కేంద్రంలో కలుషితాహారం ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్ అయింది. ఆసుపత్రిలో ఆహార పదార్థాల సరఫరా కాంట్రాక్టర్ జైపాల్‌రెడ్డిని తొలగిస్తూ ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆదేశాలు జారీ చేశారు.ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రభుత్వం ఆర్ఎంవో డాక్టర్ పద్మజను సస్పెండ్ చేసింది. కలుషిత ఆహారం ఘటనలో ఒక రోగి మృతి చెందగా, 92 మంది అస్వస్థతకు గురయ్యారు. వారిలో 18 మందిని మెరుగైన వైద్యం కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.డిశ్చార్జి కమిటీ (డీసీ) వార్డులో ఉంటున్న భూపాలపల్లికి చెందిన కరణ్ (30) అనే వ్యక్తి తీవ్ర అస్వస్థతతో మంగళవారం ఉదయం చనిపోవడంతో ఈ సంఘటన వెలుగులోకి వచ్చింది. ఉస్మానియా నుంచి ప్రత్యేక బృందాన్ని రప్పించి పర్యవేక్షిస్తున్నారు. మిగిలిన బాధితుల పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. సోమవారం రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆసుపత్రిలో ప్రత్యేకంగా చక్కెర పరమా న్నం చేశారు. దీంతోపాటు అన్నం, కూర, అరటి పండ్లు, గుడ్లను రోగులకు వడ్డించారు. సాయంత్రం డీసీ వార్డు, కోర్టు వార్డుల్లో మొత్తం 71 మంది రోగులకు వాంతులు, విరేచనాలు కావడంతో వైద్యాధికారులు వారికి చికిత్స అందించారు. డీసీ వార్డులో ఉన్న కరణ్ జ్వరం, ఇతర సమస్యలతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. ఎర్రగడ్డ ఆసుపత్రిలో నల్లా నీటిని ఆర్వో ప్లాంట్లకు పంపి.. వాటి ద్వారా రోగులకు సరఫరా చేస్తున్నారు. స్టీలు బిందెల్లో పట్టిన ఆ నీటిని రోగులు గ్లాసులతో ముంచుకుని తాగుతుంటారని అధికారులు తెలిపారు. ఇలా తాగునీరు కలుషితమైందా అనే కోణంలోనూ పరిశీలిస్తున్నారు. ఈ సంఘటనకు కారణాలు తెలుసుకునేందుకు నమూనాలను పరీక్షలకు పంపామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిత చెప్పారు.

## జూన్ 18 నుంచి టెట్

గమనార్హం.ఈ మేరకు తాజాగా పరీక్షల నిర్వహణ తేదీలు, సెషన్లు, సబ్జెక్టులు, జిల్లాల వివరాలతో పాఠశాల విద్యాశాఖ అధికారులు పూర్తి షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఏప్రిల్ 15 నుంచి 30వ తేదీ వరకు టెట్ దరఖాస్తులు స్వీకరించిన విషయం తెలిసిందే. జూన్ 9నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్‌కు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. తెలంగాణలో ఏడాదిలో రెండుసార్లు టెట్ పరీక్ష నిర్వహించాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని గతేడాది జులైలో ప్రకటించింది. ఇందులో భాగంగా గతేడాది డిసెంబర్‌లో టెట్ నోటిఫికేషన్ ఇచ్చిన ప్రభుత్వం.. ఈ ఏడాది జనవరిలో పరీక్షలు నిర్వహించింది.

**కేసీఆర్‌కు కాళేశ్వరం కమిషన్ నోటీసులు**

## రాజకీయ దురుద్దేశంతోనే

మొత్తం తెలంగాణకు ఇచ్చినట్లే అని పేర్కొన్నారు. తెలంగాణ భూములకు నీళ్లు ఇవ్వడమే కేసీఆర్ చేసిన తప్పా అని నిలదీశారు." అది కాళేశ్వరం కమిషన్ కాదు.. అది కాంగ్రెస్ కమిషన్, రాజకీయ కమిషన్. కాళేశ్వరం పూర్తయితే 35 శాతం తెలంగాణ భూభాగానికి నీళ్లు అందిస్తుంది. కేసీఆర్‌ది గట్టి గుండె కాబట్టి అంత పెద్ద ప్రాజెక్టు నిర్మించారు. దీనిపై కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోంది. కేసీఆర్‌ను బద్నాం చేసేందుకే కాళేశ్వరం కమిషన్ వేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేడిగడ్డకు చిన్న చిన్న మరమ్మతులు కూడా చేయట్లేదు.

# బెంగళూరు ఘటన దురదృష్టకరం

- క్షతగాత్రులకు సిఎం సిద్దరమాయ్య పరామర్శ
- తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన డిప్యూటి సిఎం

**బెంగళూరు, జూన్ 4 (జనంసాక్షి) :** ఆర్సీబీ విజయోత్సవాల్లో విషాద ఘటనపై కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతులకు తన ప్రగాఢ సంతాపం ప్రకటించారు. ఈ ఘటనపై ఆయన మీడియాతో మాట్లాడారు. నగర పోలీస్ కమిషనర్‌తో మాట్లాడానని, ఈ ఘటనలో ఎంతమంది చనిపోయారో ఇప్పుడే చెప్పలేం అన్నారు. అయితే ఇప్పటికే 11మంది చనిపోయారని తెలుస్తోంది . ప్రజలంతా సంయమనంతో ఉండాలి. ఆర్సీబీ విజయోత్సవ కార్యక్రమాన్ని పది నిమిషాల్లోనే ముగించాం. లక్షలాది మంది అభిమానులు వచ్చారు. పరిస్థితిని సాధారణ స్థితికి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని అన్నారు. మరోవైపు, చిన్నస్వామి స్టేడియం వద్ద తొక్కిసలాటలో 11మంది మృతిచెందగా.. దాదాపు 50 మంది గాయాలపాలైన విషయం తెలిసిందే. మరోవైపు.. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడి బౌరింగ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను కర్ణాటక సీఎం సిద్దరామయ్య పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిపై ఆసుపత్రి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఇక ఈ ఘటనపై డిప్యూటీ సీఎం, పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ స్పందించారు. ఈ ఘటనపై ఆయన ప్రజలను క్షమాపణలు కోరారు. అయితే ఈ విజయోత్సవ ర్యాలీకి భారీగా ప్రజలు హాజరయ్యారన్నారు. వారిపై పోలీసులు ఎటువంటి లాఠీ ఛార్జీ చేయలేదని స్పష్టం చేశారు. ఇక ఈ ఘటనలో మృతి చెందిన వారి సంఖ్య ఇంత అని ఆయన చెప్పలేనన్నారు. ఎందుకంటే.. క్షతగాత్రులను వైద్యులు చికిత్స అందిస్తున్నారని.. ఈ నేపథ్యంలో వారిని ప్రశ్నలతో వేధించలేనని ఆయన స్పష్టం చేశారు. ఈ విజయోత్సవ ర్యాలీకి భారీగా పోలీసులను మోహరించామని చెప్పారు. కానీ ఈ తరహా ఘటన చోటు చేసుకోవడం పట్ల ఆయన విచారం వ్యక్తం చేశారు. ఇక మంగళవారం జరిగిన ర్యాలీ మాత్రం సజావుగానే సాగిందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమం కేవలం 10 నిమిషాల్లోనే ముగిసిపోయేదన్నారు. కానీ లక్షలాది మంది ఈ ర్యాలీకి విచ్చేశారన్నారు. మరోవైపు ఈ తొక్కిసలాట ఘటనపై ప్రతిపక్ష బీజేపీ.. సిద్దరామయ్య ప్రభుత్వంపై విమర్శలు గుప్పించింది. ఈ ర్యాలీకి భారీగా ప్రజలు తరలి వస్తారని తెలిసినా.. అందుకు తగ్గ ఏర్పాట్లు- చేయక పోవడం వల్లే ఈ ఘటన చోటు-చేసుకుందని బీజేపీ నేతలు ఆరోపించారు.



### స్టేడియం తొక్కిసలాటపై బిజెపి దిగ్భ్రాంతి

బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద ఆర్సీబీ విజయోత్సవాల్లో జరిగిన తొక్కిసలాట ఘటనపై యావత్ దేశం యావత్తూ దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తోంది. ఈ క్రమంలోనే రాష్ట్ర ప్రభుత్వంపై ప్రతిపక్షాల నుంచి తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఘటనకు రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం అంటూ భాజపా ఆరోపించింది. ప్రభుత్వం ప్రజలకు భద్రత కల్పించడంలో పూర్తిగా విఫలమైంది. సరైన ప్రణాళిక లేకుండా ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. అందుకే ఈ ఘోరం జరిగింది. దీనికి కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆరోపించింది. కాగా.. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు విజయోత్సవ కార్యక్రమం సందర్భంగా అధిక సంఖ్యలో అభిమానులు చిన్నస్వామి స్టేడియం వద్దకు చేరుకున్నారు. ఈ క్రమంలోనే స్టేడియంలోకి వెళ్లేందుకు ఒక్కసారిగా గేటు--2 నుంచి దూసుకెళ్లారు. అభిమానులను అదుపు చేసేందుకు పోలీసులు లాఠీచార్జి చేయాల్సి వచ్చింది. అదే సమయంలో ఒక్కసారిగా తోపులాట జరగడంతో పెను ప్రమాదం చోటు- చేసుకుంది. ఈ తొక్కిసలాటలో 10 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 50 మందికిపైగా గాయపడ్డారు. ఈ ఘటనపై పలువురు

### తొక్కిసలాట ఘటనపై సిఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద ఆర్సీబీ విజయోత్సవాల్లో జరిగిన తొక్కిసలాట ఘటనపై ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ- సీఎం పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా పోస్టులు పెట్టారు. ఈ ఘటన దురదృష్టకరం, హృదయ విదారకమని పేర్కొన్నారు. బెంగళూరులో జరిగిన తొక్కిసలాటలో పలువురు ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరం. చాలా బాధకలిగించింది. మృతుల కుటు-ంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నానని సీఎం చంద్రబాబు తెలిపారు. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో చాలా మంది ప్రాణాలు కోల్పోయిన ఘటన తనను బాధించిందని చంద్రబాబు నాయుడు తెలిపారు. చనిపోయిన వారి కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతా వేదికగా సీఎం చంద్రబాబు నాయుడు స్పందించారు. ఈ తొక్కిసలాట ఘటనపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. ఆర్సీబీ విజయోత్సవాల్లో జరిగిన విషాదం దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. మృతుల్లో చిన్నారులు సైతం ఉండడం మరింత బాధకరమని చెప్పారు. వేడుకల్లో ఇంత విషాదం జరగడం చాలా దురదృష్టకరమని తెలిపారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నానన్నారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నానని తెలిపారు.

### కాంగ్రెస్ చేతకానితనమే కారణం: కిషన్ రెడ్డి

బెంగళూరు చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాట ఘటన చాలా దురదృష్టకరమని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఈ ఘటనకు పూర్తిగా కర్ణాటక ప్రభుత్వం, పోలీసుల వైఫల్యమే కారణమని మండిపడ్డారు. ఆర్సిబి విక్టరీ పరేడ్ సందర్భంగా బెంగళూరు చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో 11 మంది అభిమానులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై స్పందించిన కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. కర్నాటక కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. స్టేడియం వద్దకు భారీ సంఖ్యలో అభిమానులు వస్తారని తెలిసి కూడా తగిన ఏర్పాట్లు- చేయకపోవడం దారుణమన్నారు. అభిమానులను నియంత్రించలేక పోయామని ఆ రాష్ట్ర సిఎం, డిప్యూటీ- సిఎం ప్రకటించడం వారి చేతకాని తనానికి నిదర్శనమని ఆయన విమర్శలు చేశారు. తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మ శాంతించాలని కోరుకుంటున్నానని.. ఘటనలో గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని కిషన్ రెడ్డి అన్నారు.



## ముఖ్యమంత్రిని కలిసిన ట్రెయినీ ఐఏఎస్‌లు

**హైదరాబాద్, జూన్ 5 (జనంసాక్షి) :** జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని తెలంగాణ కేడర్‌కు చెందిన 2024 బ్యాచ్ ట్రైనీ ఐఏఎస్‌లు మర్యాదపూర్వకంగా కలిసారు. సిఎంను కలిసిన వారిలో డాక్టర్ ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీలో శిక్షణ పొందుతున్న ఐఏఎస్ లు సౌరభ్ శర్మ, సలోని ఛబ్రా, హర్ష చౌదరి, కరోలిన్ చింగ్తియన్మయి, కొయ్యడ ప్రణయ్ కుమార్ ఉన్నారు. డాక్టర్ ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీ వైస్-ఛైర్‌పర్సన్ శాంతి కుమారి, కోర్సు డైరెక్టర్ ఉషారాణి ఆధ్వర్యంలో సీఎంను మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ట్రైనీ ఐఏఎస్ లను అభినందించి, బాధ్యతల నిర్వహణపై సీఎం వారికి దిశానిర్దేశం చేశారు.

## జూలై21 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

**న్యూఢిల్లీ, జూన్4 (జనంసాక్షి) :** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జులై 21 నుంచి ఆగస్టు 12వ తేదీ వరకూ జరుగుతాయి. ఈ విషయాన్ని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజూ బుధవారం విలేకరులకు తెలిపారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన పార్లమెంటరీ వ్యవహారాల కేబినెట్ కమిటీ- ఈ తేదీలను సిఫార్సు చేసిందని,ఈ మేరకు సమావేశాలను ఖరారు చేశామని ఆయన వివరించారు. ఆపరేషన్ సిందూర్ ఇతర వీషయాలను చర్చించేందుకు వెంటనే పార్లమెంట్ ప్రత్యేక సెషన్ ఏర్పాటు- జరగాలని ప్రతిపక్షాలు, ప్రత్యేకించి కాంగ్రెస్ పట్టుబడుతోంది. ఈ దశలోనే విపక్షాల డిమాండ్ గురించి ఏమి చెప్పకుండా ప్రభుత్వం పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తేదీలను వెల్లడించింది. మరి ప్రతిపక్షాల డిమాండ్ గురించి ఏం చెపుతారు? అని విలేకరులు ప్రశ్నించగా , అన్ని విషయాలను పార్లమెంటరీ నిబంధనల మేరకు వర్షాకాల సమావేశాల్లోనే చర్చించవచ్చునని మంత్రి జవాబు ఇచ్చారు.

## మేడారం అడవుల్లో కొనసాగుతున్న ప్లాస్టిక్ నిర్మూలన

**ఏటూరునాగారం, జూన్ 04(జనంసాక్షి) :** ప్రపంచ పర్యావరణ దినోత్సవం జూన్ 5 సందర్భంగా, ఏటూరునాగారం రేంజ్ అధికారి అబ్దుల్ రెహమాన్ మేడారం అడవుల్లో ప్లాస్టిక్ నివారణ చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా రేంజ్ అధికారి మాట్లాడుతూ, అడవుల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను విసిరి వేయవద్దని సూచించారు. బుధవారం



టన్నుల కొద్ది ప్లాస్టిక్ చెత్త నివారణ చర్యలను కొనసాగిస్తూ ఆటవీ శాఖ 80 మంది సిబ్బంది గురువారం జరగబోయే ప్రపంచ పర్యావరణ దినోత్సవానికి, స్వచ్ఛదనం - ఆటవీ పచ్చదనం అనేలా చర్యలు తీసుకుంటామని, ప్లాస్టిక్ నిషేధించెందుకు కఠిన నిబంధనలు అమలు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లు, బెస్ క్యాంప్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీకి అలహాబాద్ హైకోర్టు మందలింపు

**అలహాబాద్, జూన్ 4 (జనంసాక్షి) :** భారత్ జోడో యాత్ర సందర్భంగా భారతీయ సైనికులను కించపరచే విధంగా వ్యాఖ్యలు చేసినందుకు కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీని అలహాబాద్ హైకోర్టు బుధవారం నాడు మెత్తగా మందలించింది. 2022లో భారత్ జోడో యాత్ర సందర్భంగా భారత సైన్యం పరువునకు భంగం కలిగించే విధంగా చేసిన వ్యాఖ్యలకు సంబంధించి లక్నో కోర్టు జారీ చేసిన సమన్లను సవాల్ చేస్తూ రాహుల్ గాంధీ దాఖలు చేసిన పిటిషన్ ను తిరస్కరిస్తూ, అలహాబాద్ హైకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. భారత రాజ్యాంగం ఆర్టికల్ 19కింద వాక్ స్వాతంత్రం, భావ ప్రకటనా స్వేచ్ఛకు హామీ ఇస్తుంది.అయితే ఆ స్వేచ్ఛకూ కాస్త పరిమితి ఉంటు-ంది. భారత సైన్యానికి పరువు నష్టం కలిగించే ప్రకటనలు చేసే స్వేచ్ఛ అందులో లేదని కోర్టు స్పష్టం చేసింది.2022లో రాజస్థాన్ లో మీడియా సమావేశంలో రాహుల్ ప్రసంగిస్తూ, అరుణాచల్ ప్రదేశ్ లో భారత సైనికులను చైనా దళాలు దెబ్బ తీస్తున్నా యని వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపైనే ఆయనపై పరువునష్టం దావా వేశారు. భారత్ జోడో యాత్ర గురించి ప్రజలు అడుగుతారని, కాంగ్రెస్ పార్టీలో లుకలుకలు, గ్లెహోల్, సచిన్ పైలెట్ గురించి, అడుగుతారని, చైనా 2వేల చదరపు కిలోమీటర్ల భారత భూభాగాన్ని ఆక్రమించిందని, 20 మంది భారత సైనికులను చంపిందని, అరుణాచల్ ప్రదేశ్‌లో చైనా సైనికులు భారత సైనికుల ను దెబ్బతీశారని ఈ విషయాలపై ఒక ప్రశ్నకూడా అడగరని, భారతీయ పత్రికలు దీనిని ప్రశ్నించవని రాహుల్ గాంధీ అప్పట్లో మీడియా సమావేశంలో వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై ఉత్తరప్రదేశ్ లో రాహుల్ పై పరువునష్టం కేసు దాఖలైంది. కింది కోర్టు ఆయనకు సమన్లు జారీ చేసింది. దీంతో రాహుల్ అలహాబాద్ హైకోర్టు ను ఆశ్రయించి, విచారణను, సమన్లను రద్దుచేయాలని కోరారు. బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ మాజీ డైరెక్టర్ ఉదయ్ శంకర్ శ్రీవాస్తవ ఈ పరువునష్టం కేసు దాఖలు చేశారు. అరుణాచల్ ప్రదేశ్ లై చైనా సైన్యం మన సైనికులను దెబ్బతీస్తోందని రాహుల్ గాంధీ పదేపదే చాలా అవమానకరమైన రీతిలో పేర్కొన్నారని ఆయన తెలిపారు. రాహుల్ తన పిటిషన్ లో ఫిర్యాదు చేసినవ్యక్తి భారత సైన్యానికి చెందిన అధికారి కాదని, అందువల్ల బాధితుడు కాదని వాదించారు. అయితే ఆ వాదనను కోర్టు తోసిపుచ్చింది. అతడు కల్నల్ హోదాతో సమానమైన బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ రిటైర్డ్ డైరెక్టర్ కాబట్టి, అతడు ఈ నేరం వల్ల బాధపడిన వ్యక్తి అని కోర్టు అభిప్రాయపడింది.

## కవిత లేఖ వెనక కెసిఆర్ వ్యూహం



- అటెన్షన్ డైవర్ట్ చేయడానికే అన్న కొండా

**హైదరాబాద్, జూన్ 4 (జనంసాక్షి) :** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేసిన లేఖ రాజకీయ డ్రామా మాత్రమేనని, దీని వెనుక అసలు స్కెచ్‌ను మాజీ సీఎం కేసీఆరే తయారుచేశారని బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. ఈ డ్రామా ద్వారా కవిత మీడియా దృష్టిని ఆకర్షించగలిగిందని, హెడ్‌లైన్లలో నిలవడమే లక్ష్యంగా ఇది సాగించబడిందని వ్యాఖ్యానించారు. కవిత తన ఉద్దేశాన్ని సాధించగలిగింది. బీఆర్ఎస్ ప్రజాదరణ కోల్పోతుండటంతో దృష్టి మళ్లించేందుకు ఇది వ్యూహాత్మకంగా తయారుచేసిన స్క్రిప్టు అని అన్నారు. ఇది పూర్తిగా ట్రాష్ డ్రామా. కేసీఆర్ ఫామ్ హౌస్ నుంచే ఈ స్కెచ్‌లన్నీ జరుగుతున్నాయని కొండా తీవ్రంగా విమర్శించారు. కేసీఆర్ కుటుంబం రాజకీయాల్లో ప్రొఫెషనల్. అవసరమైతే కాళ్లు పట్టుకుంటారు, లేకపోతే జుట్టు పట్టి తన్నేస్తారు. ఇదే వారి రాజకీయం, అని ఘాటుగా వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్-బీజేపీ కలయికపై వస్తున్న ఊహాగానాలను కొండా ఖండించారు. 'కేసీఆర్ కుటుంబ సభ్యులు బీజేపీ వద్దకు వస్తే గేట్ వద్దే తన్ని తరిమేస్తాం,' అని మండిపడ్డారు. రాజకీయాల్లో సమీకరణాలు మారినా కొన్ని విలువలు మారవని స్పష్టం చేశారు. కేసీఆర్‌పై తీవ్రస్థాయిలో సె-టైర్లు వేసిన కొండా.. 'కేసీఆర్‌కు కుటుంబమే ప్రథమం, పార్టీ రెండవది, తెలంగాణ చివరిది,' అని అన్నారు. మునుగోడు ఉపఎన్నికల సందర్భాన్ని గుర్తు చేస్తూ, కాంగ్రెస్‌తో బీఆర్ఎస్ అప్పుడే పొత్తు పెట్టు-కుందని ఆరోపించారు. మేమైతే కవితను అరెస్ట్ చేశాం. మరి కాంగ్రెస్ ప్రభుత్వాలు కేసీఆర్, కేటీఆర్‌ను ఎవరినైనా అరెస్ట్ చేశాయా అని సూటిగా ప్రశ్నించారు.

## విద్యుత్ శాఖ అధికారి అమానవీయ ప్రవర్తన

- గుల్జార్ హౌజ్ మృతుల కుటుంబం పట్ల దురుసుతనం
- చర్యలు తీసుకోవాలంటూ సిఎంకు రాజాసింగ్ లేఖ

**హైదరాబాద్, జూన్4 (జనంసాక్షి) :** గుల్జార్ హౌస్ అగ్ని ప్రమాద బాధితుల పట్ల విద్యుత్ శాఖ అధికారి అమానవీయ ప్రవర్తనపై చర్యలు తీసుకోవాలని బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ డిమాండ్ చేశారు. సంబంధిత అధికారిని వెంటనే సస్పెండ్ చేయాలని అభ్యర్థిస్తూ సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. చార్మినార్‌లోని గుల్జార్ హౌస్‌లో జరిగిన వినాశకరమైన అగ్నిప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన 17 మంది మరణించిన విషయం తెలిసిందే. ఈ సంఘటన మన నగరాన్ని కలచివేసింది. మృతుల కుటుంబానికి ఊహించలేని దుఃఖాన్ని కలిగించింది. బాధితులకు పరిపాలన సాధ్యమైనంత మద్దతు అందించాల్సిన సమయంలో విద్యుత్ శాఖకు చెందిన ఓ



అధికారి వారిపట్ల అసభ్యకరంగా, అనైతికంగా వ్యవహరించాడు. ఇప్పటికే పుట్టెడు దుఃఖంలో ఉన్న కుటుంబం నుంచి ...2.5 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశాడు. అంతే కాకుండా.. ఇంట్లోని ఓ మహిళా సభ్యురాలి పట్ల అభ్యంతరకరమైన భాషను కూడా ఉపయోగించారు. ఆ అధికారి ఆమె ఫోన్‌ను లాక్కొని బెదిరింపులకు దిగాడు. ఇప్పటికే బాధలో ఉన్న కుటుంబాన్ని మరింత ఇబ్బంది పెట్టడం దారుణం.. ఇటువంటి ప్రవర్తన ఆమోదయోగ్యం కాదు. ఇది ప్రజా సేవా నైతికతను ఉల్లంఘించడం. ఇలాంటి ఘటనలు ప్రభుత్వ యంత్రాంగానికి చెడ్డపేరు తెస్తాయి. ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తాయి. ఈ నేపథ్యంలో పూర్తి దర్యాప్తు జరిగే వరకు సంబంధిత అధికారిని వెంటనే సస్పెండ్ చేయండి..సంఘటనపై ఉన్నత స్థాయి విచారణను ప్రారంభించండి. అధికారిపై చట్టపరమైన, క్రమశిక్షణా చర్యలు తీసుకునేలా చూసుకోండి. బాధిత కుటు-ంబానికి అవసరమైన రక్షణ, మద్దతు అందించాలని రాజాసింగ్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రాసిన లేఖలో పేర్కొన్నారు.

## ఇంటర్ విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

- జూన్ రెండో వారానికి పంపిణీ పూర్తి
- ఇంటర్ బోర్డు ప్రకటన

**హైదరాబాద్, జూన్4 (జనంసాక్షి) :** విద్యార్థులకు పుస్తకాల పంపిణీపై ఇంటర్ బోర్డు కీలక ప్రకటన చేసింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో చదువుతున్న విద్యార్థులకు 2025-26 విద్యా సంవత్సరానికి పాఠ్య పుస్తకాల ముద్రణ, పంపిణీ కార్యక్రమం ప్రారంభం అయిందని తెలిపింది. మొదటి సంవత్సర విద్యార్థులకు తెలుగు అకాడమీ ద్వారా పాఠ్య పుస్తకాల ముద్రణ పూర్తయిందని వెల్లడించింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు పుస్తకాల పంపిణీ ఇప్పటికే ప్రారంభం కాగా, జూన్ మొదటి వారంలో పంపిణీ పూర్తి అవుతుందని స్పష్టం చేసింది. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పుస్తకాల ముద్రణ తుది దశలో ఉందని పేర్కొంది. జూన్ మొదటి వారంలోపుగా ముద్రణ పూర్తవుతుందని.. 2024-25 సంవత్సరానికి వినియో గించగా మిగిలిన పుస్తకాలను అవసరమైన చోట్ల పంపిణీ చేస్తున్నామని తెలిపింది. జూన్ మధ్య నాటికి 100 శాతం పుస్తకాల పంపిణీ పూర్తి చేస్తామని.. విద్యార్థులకు సకాలంలో పుస్తకాలు అందుబాటులోకి వస్తాయని స్పష్టం చేసింది. కాగా.. రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్మీడియట్ కాలేజీలు సోమవారం తెరుచుకోనున్నాయి. ఈ ఏడాది నుంచి విద్యా సంవత్సరం సమయాల్లో ఇంటర్ బోర్డు మార్పులు తీసుకొచ్చింది. ప్రతి సంవత్సరం జూన్ 1 నుంచి విద్యా సంవత్సరం ప్రారంభమవుతుండగా ఈ ఏడాది ఏప్రిల్ 1నే ప్రారంభించారు. ఏప్రిల్ 1 నుంచి 23 వరకు తరగతులు నిర్వహించి, ఆపై వేసవి సెలవులు ఇచ్చారు. తిరిగి 2025-26 విద్యా సంవత్సరం పునఃప్రారంభం కానుంది. ఈ సంవత్సరం నుంచే కొత్తగా ఎంబైపీసీ చదివే అవకాశం విద్యార్థులకు కల్పించారు.

## మాజీ ఎమ్మెల్సీ రంగారెడ్డి మృతి

**హైదరాబాద్, జూన్4 (జనంసాక్షి) :** మాజీ ఎమ్మెల్సీ మాగం రంగారెడ్డి కన్నుమూశారు. గుండెపోటుతో బుధవారం తుదిశ్వాస విడిచినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. గురువారం శామీర్‌పేటలో రంగారెడ్డి అంత్యక్రియ నిర్వహించనున్నారు. మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డికి ఆయన సన్నిహితులుగా ఉండేవారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఒక సారి ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. రంగారెడ్డి మృతిపట్ల వివిధ పార్టీల నేతలు సంతాపం తెలిపారు.

## ట్రావెల్స్ బ్యాగులో మహిళ మృతదేహం

- హత్యచేసి పడేసినట్లు పోలీసుల గుర్తింపు

**మేడ్చల్, జూన్ 4 (జనంసాక్షి) :** మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా బాచుపల్లి పియస్ పరిధిలో దారుణం చోటు- చేసుకుంది. విజయదుర్గ ఓనర్స్ అసోసియేషన్ కాలనీ నిర్మానుష్య ప్రాంతంలో బ్యాగులో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది.. బ్యాగ్ నుంచి దుర్వాసన వస్తుందని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతురాలు వయసు 25 నుంచి 35 సంవత్సరాలు ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. మెరూన్ కలర్ పంజాబీ డ్రెస్ తో ఉన్నట్లుగా పోలీసులు తెలిపారు. మృత దేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. బాలానగర్ జోన్ డీసీపీ సురేష్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక టీంలు రంగంలోకి దిగాయి. మృతురాలి ఆచూకీ, హత్య చేసిన వారి వివరాల కోసం దర్యాప్తు చేపడుతున్నారు.

## రాహుల్‌ను విమర్శిస్తే ఊరుకునేది లేదు

- మాజీ ఎంపి విహెచ్ హెచ్చరిక



**హైదరాబాద్, జూన్4 (జనంసాక్షి) :** ఆపరేషన్ సిందూర్‌పై దేశంయావత్తూ మోడీకి అండగా నిలిచినా,ట్రంప్ ఫోన్‌తో మోడీ లొంగిపోవడం దారుణమని మాజీ ఎంపి వి. హనుమంతరావు అన్నారు. ఇదే విషయాన్ని రాహుల్ చెప్పారని, ఆపరేషన్ సిందూర్‌ను ఎక్కడా విమర్శించలేదన్నారు. పెహాల్గాంలో 27 మంది భారతీయులను చంపిన దుర్మార్గం చర్యపై ప్రతి భారతీయుడు చాలా సీరియస్ గా ఉన్నారని కాంగ్రెస్ సీనియర్ నేత వీ.హనుమంతరావు అన్నారు. దేశంలో ఉన్న అన్ని పార్టీలు, ప్రధాని మోడీకి ఫ్రీ హ్యాండ్ ఇచ్చారని.. ఆ తర్వాత 9 ఉగ్రవాద స్థావరాల మీద ఆపరేషన్ సిందూర్ చేయడం జరిగిందన్నారు. అమెరికా ప్రెసిడెంట్ మోడీని లొంగిపో అన్నారని.. అమెరికా ఒత్తిడికి లొంగి ఆపరేషన్ సింధూర్ ఆపేశారని ఆరోపించారు. భారత దేశానికి చెందిన ఏ విషయంలో అయినా క్రెడిట్ మన దేశానికే రావాలని.. అమెరికా కి కాదన్నారు. తమకు భారత రక్షణ దళాల మీద అత్యంత గౌరవం ఉందని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ కేవలం మోడీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఒత్తిడికి లొంగి యుద్ధాన్ని ఆపేశారని అన్నట్లు హనుమంతరావు వెల్లడించారు. ఆయన ఎక్కడ కూడా ఆపరేషన్ సిందూర్ ని వ్యతిరేకించలేదని తెలిపారు. ఆర్మీకి వ్యతిరేకంగా మాట్లాడలేదని చెప్పారు. అన్ని పార్టీలు మద్దతు ఇచ్చినపుడు ఏం చేయలేకపోయారన్నారు. ఇపుడు మీ తప్పుకి రాహుల్ గాంధీని ఏజెంట్ అనడం మీ వైఫల్యమని మండిపడ్డారు. అసలు ఈ దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిందే గాంధీ ఫ్యామిలీ... ఆ కుటుంబం దేశం కోసం త్యాగాలు చేసిందన్నారు. రాహుల్ గాంధీని అవమానిస్తే ఊరుకోమని హెచ్చరించారు.

## ప్రజా పాలన దరఖాస్తుల్లో అర్హులను గుర్తించండి

- రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహ
- ప్రజా సంక్షేమ పథకాల అమలుపై స్పష్టమైన ఆదేశాలు



**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 04 (జనం సాక్షి) :** రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ బుధవారం సంగారెడ్డి జిల్లా పరిషత్ కార్యాలయంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సమీక్ష సమావేశం సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజా పాలన కార్యక్రమాల్లో ప్రజల నుంచి వచ్చిన ధరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి, అర్హులైన వారికి ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలను వేగంగా, న్యాయంగా అందజేయాలని స్పష్టం చేశారు. ప్రతి ధరఖాస్తును నిర్లక్ష్యం చేయకుండా, అర్హతను పక్కాగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతం చేయాలి...ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై ప్రత్యేకంగా చర్చించామని మంత్రి తెలిపారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణాల్లో అనవసరమైన జాప్యం జరుగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా స్టీల్, సిమెంట్ వంటి నిర్మాణానికి అవసరమైన పరికరాలను నిర్ణీత ధరలకు లభించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఇసుక రీచ్‌లను మండల స్థాయిలో ఏర్పాటు చేయడం ద్వారా స్టీల్, సిమెంట్, సామగ్రి అందుబాటులో ఉండేలా చేయాలని అధికారులను ఆదేశించారు. ఇంటి నిర్మాణానికి భూమి లేని వారు ఉండటాన్ని దృష్టిలో పెట్టుకుని, వారికి సర్దుబాటు చేయదగిన ప్రభుత్వ భూమిని గుర్తించాలి అని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అవసరమైన నిధుల విషయానికొస్తే, మహిళా సంఘాల ద్వారానే రుణాలను అందించాలన్న సూచన చేశారాయన. స్వయం సహాయక మహిళా సంఘాలు ఈ విషయంలో కీలకపాత్ర పోషించాలన్నారు. దీనివల్ల మహిళల ఆర్థిక స్వావలంబన పెరగడంతోపాటు, నిర్మాణం వేగవంతం అవుతుందని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం ప్రజలకు హామీగా ఇచ్చిన ఆరు గ్యారంటీలను నిష్పక్షపాతంగా, అర్హులైన వారికి పూర్తిస్థాయిలో అమలు చేయాలని మంత్రి అన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
5 జూన్ 2025
తెలంగాణ



తెలంగాణలో పాఠశాల ఫీజుల నియంత్రణ: సవాళ్ల మధ్య సమతుల్యత అవసరం

# ఫీజుల నియంత్రణ ఏది?

**తెలంగాణలో పాఠశాల ఫీజుల నియంత్రణ విషయం తల్లిదండ్రులకు ఆర్థిక భారాన్ని తగ్గించడం, విద్యా సంస్థలకు నాణ్యమైన విద్యకు అవసరమైన నిధులను సమకూర్చడం మధ్య సమతుల్యత సాధించాల్సిన సంక్లిష్ట అంశం. ప్రభుత్వ పాఠశాలలు ఆర్‌టిఈ చట్టం 2009 ప్రకారం ఉచిత విద్యను అందిస్తున్నాయి, కానీ మౌలిక సదుపాయాలు, ఉపాధ్యాయుల కొరత సమస్యలు నాణ్యతను ప్రభావితం చేస్తున్నాయి. ప్రైవేటు పాఠశాలల్లో 2017 ఫీజు నియంత్రణ నిబంధనలు ఉన్నప్పటికీ, ఏకపక్ష ఫీజు పెంపు, పారదర్శకత లోపం వంటి సమస్యలు తల్లిదండ్రులను కలవరపరుస్తున్నాయి. ఆర్‌టిఈ కింద 25% ఉచిత సీట్ల కేటాయింపు సమర్థవంతంగా అమలుకాకపోవడం మరో సవాలు. బలమైన పర్యవేక్షణ, పారదర్శక విధానాలు, ప్రభుత్వ పాఠశాలల నాణ్యత మెరుగుదల ద్వారా మాత్రమే ఈ సమస్యకు పరిష్కారం సాధ్యమవుతుంది.**

తెలంగాణ రాష్ట్రంలో పాఠశాల ఫీజుల నియంత్రణ ఒక సంక్లిష్టమైన, సున్నితమైన అంశం, ఇది విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థిక భారాన్ని తగ్గించడం మరియు విద్యా సంస్థలకు నాణ్యమైన విద్యను అందించ డానికి అవసరమైన నిధులను సమకూర్చడం మధ్య సమతుల్యతను కాపాడాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ, ఎయిడెడ్, మరియు ప్రైవేటు పాఠశాలల్లో ఫీజు నియంత్రణ విధానాలు భిన్నంగా ఉంటాయి. తెలంగాణ ప్రభుత్వం ఈ విషయంలో కొన్ని చట్టాలు, మార్గదర్శకాలను రూపొందించినప్పటికీ, వాటి అమలు మరియు పర్యవేక్షణలో అనేక సవాళ్లు ఎదురవుతున్నాయి, ఇవి తరచూ వివాదాలకు దారితీస్తున్నాయి. ఈ సమస్యలను పరిష్కరించడానికి సమగ్రమైన విధానం అవసరం.

### ప్రభుత్వ పాఠశాలల్లో ఫీజు విధానం

తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలలు, జిల్లా పరిషత్ పాఠశాలలు, గురుకుల విద్యాలయాలు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీ) ప్రధానంగా ప్రభుత్వ నిధుల ద్వారా నడుస్తాయి. రాష్ట్ర విద్యా హక్కు చట్టం (ఆర్‌టిఈ) 2009 ప్రకారం, 6 నుంచి 14 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఉచిత, నిర్బంధ విద్య అందించబడుతుంది. ఈ పాఠశాలల్లో ఫీజులు లేకపోవడం లేదా నామమాత్రపు ఫీజులతో విద్య అందించబడుతుంది, ఇది ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ఊరటనిస్తుంది. కేజీబీవీలు, మోడల్ స్కూల్స్ వంటి సంస్థలు విద్యార్థులకు ఉచిత బోధన, వసతి, ఇతర సౌకర్యాలను అందిస్తాయి, దీని వల్ల తల్లిదండ్రులపై ఆర్థిక ఒత్తిడి గణనీయంగా తగ్గుతుంది. అయితే, ఈ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, ఉపాధ్యాయుల నాణ్యత మెరుగుపరచడం కోసం మరింత దృష్టి అవసరం.

### ప్రైవేటు పాఠశాలల ఫీజు నియంత్రణ

ప్రైవేటు పాఠశాలల ఫీజు నియంత్రణ తెలంగాణలో ఒక సవాలుతో కూడిన అంశం. 2017లో తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ (ప్రైవేటు విద్యా సంస్థల ఫీజు నియంత్రణ) రూల్స్ను జారీ చేసింది, ఇవి ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్ యాక్ట్ 1983 మరియు RTE చట్టం 2009 ఆధారంగా రూపొందాయి. ఈ నిబంధనల ప్రకారం, ప్రైవే టు పాఠశాలలు ఫీజులను నిర్ణయించే ముందు రాష్ట్ర స్థాయి ఫీజు నియంత్రణ కమిటీ (State Level Fee Regulation Commi ttee) అనుమతి తీసుకోవాలి. ఈ కమిటీ పాఠశాలల మౌలిక సదుపాయాలు, ఉపాధ్యాయుల జీతాలు, ఇతర ఖర్చులను పరిశీలిం చి ఫీజు పరిమితిని నిర్ణయిస్తుంది.

అయితే, ఈ నిబంధనలు అమలులో అనేక లోపాలు కనిపిస్తున్నా యి. కొన్ని ప్రైవేటు పాఠశాలలు నిర్ణీత మార్గదర్శకాలను పాటించ కుండా, ఏకపక్షంగా ఫీజులను పెంచుతున్నాయని తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. అదనంగా, ఆర్‌టిఈ చట్టం ప్రకారం, 25% సీట్లను ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఉచితంగా కేటాయించాల్సి ఉన్నప్పటికీ, కొన్ని పాఠశాలలు ఈ నిబంధనను సమర్థవంతంగా అమలు చేయడం లేదు. ఫీజు నియంత్రణ కమిటీ పర్యవేక్షణ సరిగా లేకపోవడం, పారదర్శకత లోపించడం వంటి సమస్యలు తల్లిదండ్రులకు అసంతృప్తిని కలిగిస్తున్నాయి.

### సవాళ్లు మరియు వివాదాలు

ప్రైవేటు పాఠశాలల ఫీజు నియంత్రణలో పారదర్శకత లేకపోవడం ఒక ప్రధాన సమస్య. కొన్ని సంస్థలు అధిక ఫీజులను వసూలు చేస్తూ, వాటిని "అదనపు సౌకర్యాలు" లేదా "విశేష కార్యక్రమాలు" అనే పేరుతో సమర్థించుకుంటున్నాయి. ఇది మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి కుటుంబాలపై తీవ్ర ఆర్థిక ఒత్తిడిని కలిగిస్తోంది. ఫీజు నియంత్రణ కమిటీకి వచ్చే ఫిర్యాదులను వేగంగా పరిష్కరించడానికి సరిపడా సిబ్బంది లేకపోవడం మరో సమస్య. అదనంగా, కొన్ని పాఠశాలలు ఫీజులను బహిరంగంగా ప్రకటించకుండా, దాచి ఉంచ డం వల్ల తల్లిదండ్రులకు సమాచారం అందుబాటులో ఉండటం లేదు. ప్రభుత్వ పాఠశాలల విషయంలో, ఉచిత విద్య అందించడం సానుకూలమైనప్పటికీ, మౌలిక సదుపాయాల లోపం, ఉపాధ్యాయు ల కొరత వంటి సమస్యలు నాణ్యతపై ప్రభావం చూపుతున్నాయి. ఇది తల్లిదండ్రులను ప్రైవేటు పాఠశాలల వైపు మళ్లిస్తోంది, ఇక్కడ ఫీజు నియంత్రణ సమస్యలు మరింత ఉద్భవిస్తున్నాయి.

తెలంగాణలో ఫీజు నియంత్రణ విషయంలో సమతుల్య విధానం అవసరం. ప్రభుత్వ పాఠశాలలు ఉచిత విద్యను అందిస్తున్నప్పటికీ, నాణ్యత మెరుగుదల అవసరం. ప్రైవేటు పాఠశాలల ఫీజు నియంత్రణ లో పారదర్శకత, కఠిన పర్యవేక్షణ అవసరం. తల్లిదండ్రుల ఆర్థిక భారా న్ని తగ్గించడం, అదే సమయంలో నాణ్యమైన విద్యను అందించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి. సమగ్రమైన విధానం, కఠిన అమలు ద్వారా మాత్రమే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం సాధ్యమవుతుంది.

**కలం : తన్వీ**
హైదరాబాద్, 7093938342

### పరిష్కార మార్గాలు

ఫీజు నియంత్రణను సమర్థవంతంగా అమలు చేయడానికి కొన్ని చర్యలు అవసరం:

**బలమైన పర్యవేక్షణ వ్యవస్థ:** రాష్ట్ర స్థాయి ఫీజు నియంత్రణ కమిటీని మరింత బలోపేతం చేయాలి. జిల్లా స్థాయిలో స్థానిక కమిటీలను ఏర్పాటు చేసి, ఫీజు నియంత్రణపై నిశితంగా పర్యవేక్షించాలి.

**పారదర్శకత:** ప్రైవేటు పాఠశాలలు తమ ఫీజు నిర్మాణాన్ని బహిరంగంగా ప్రకటించాలి. ఈ సమాచారాన్ని వెబ్‌సైట్లలో, నోటీసు బోర్డులలో అందుబాటులో ఉంచాలి.

**ఫిర్యాదుల పరిష్కార వేదిక:** తల్లిదండ్రుల ఫిర్యాదులను వేగంగా పరిష్కరించడానికి ఆన్‌లైన్ వేదికను ఏర్పాటు చేయాలి. ఈ వేదిక ఫీజు సంబంధిత సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి.

**ప్రభుత్వ పాఠశాలల మెరుగుదల:** ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, ఉపాధ్యాయుల నియామకాలను పెంచడం ద్వారా నాణ్యమైన విద్యను అందించాలి, ఇది ప్రైవేటు పాఠశాలలపై ఆధారపడటాన్ని తగ్గిస్తుంది.

**ఆర్‌టిఈ అమలు:** ఆర్‌టిఈ చట్టం ప్రకారం 25% ఉచిత సీట్ల కేటాయింపును ప్రైవేటు పాఠశాలలు కచ్చితంగా పాటించేలా కఠిన చర్యలు తీసుకోవాలి.

**సమగ్ర ఫీజు విధానం:** ప్రభుత్వం, ప్రైవేటు సంస్థలు, తల్లిదండ్రుల సంఘాలతో కలిసి సమగ్ర ఫీజు విధానాన్ని రూపొందించాలి, ఇది అందరి ప్రయోజనాలను కాపాడుతుంది.

# నక్సలైట్లు దేశభక్తులా?



నక్సలైట్ ఉద్యమం భారతదేశంలో దశాబ్దాలుగా కొనసాగుతున్న ఒక సంక్లిష్టమైన, వివాదాస్పద అంశం. కొందరు నక్సలైట్లను దేశభక్తులుగా కీర్తిస్తే, మరికొందరు వారిని దేశ వ్యతిరేక శక్తులుగా భావిస్తారు. ఈ ఉద్యమం యొక్క మూలాలు, లక్ష్యాలు, మరియు దాని ప్రభావం భారత సమాజంపై లోతైన చర్చను రేకెత్తిస్తాయి. నక్సలైట్లను దేశభక్తులుగా లేదా తీవ్రవాదులుగా లేబుల్ చేయడం కంటే, వారి ఉద్యమం యొక్క సామాజిక, ఆర్థిక, రాజకీయ నేపథ్యాన్ని విశ్లేషించడం ద్వారా సమస్యను సమగ్రంగా అర్థం చేసుకోవడం అవసరం.

### నక్సలైట్ ఉద్యమం యొక్క మూలాలు

నక్సలైట్ ఉద్యమం 1967లో పశ్చిమ బెంగాల్‌లోని నక్సల్‌బరీ గ్రామంలో ప్రారంభమైంది, ఇక్కడ రైతులు భూస్వాముల అణచివేతకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారు. కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్-లెనినిస్ట్) నాయకత్వంలో ఈ ఉద్యమం భూమి సంస్కరణలు, సామాజిక సమానత్వం, మరియు పీడిత వర్గాల హక్కుల కోసం పోరాటంగా ఆవిర్భవించింది. ఈ ఉద్యమం గిరిజన ప్రాంతాలు, ఆర్థికంగా వెనుకబడిన ప్రాంతాలలో బలంగా వ్యాపించింది, ఇక్కడ ప్రభుత్వ నిర్లక్ష్యం, దోపిడీ, మరియు అసమానతలు ప్రజలను అసంతృప్తికి గురిచేశాయి.

నక్సలైట్లు తమను దేశంలోని అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడే వారిగా భావిస్తారు. వారి దృష్టిలో, భారత ప్రభుత్వ వ్యవస్థ కొందరు ధనికులు, ఉన్నత వర్గాల ప్రయోజనాలను మాత్రమే కాపాడుతుందని, దీనిని సాయుధ పోరాటం ద్వారా మార్చాలని వారు వాదిస్తారు. ఈ దృక్కోణంలో, వారు తమను తాము దేశభక్తులుగా చూసుకుంటారు, ఎందుకంటే వారు దేశంలోని అధిక జనాభా అయిన పేదలు, గిరిజనులు, మరియు అణగారిన వర్గాల కోసం పోరాడుతున్నారని భావిస్తారు.

### దేశభక్తి లేదా తీవ్రవాదం?

నక్సలైట్లను దేశభక్తులుగా పరిగణించే వాదన వారి లక్ష్యాలలోని సామాజిక న్యాయ స్ఫూర్తిపై ఆధారపడి ఉంటుంది. వారు భూమి లేని రైతులకు భూమి, గిరిజనులకు హక్కులు, మరియు పేదలకు సమాన అవకాశాల కోసం పోరాడుతున్నారు. భారతదేశంలో ఆర్థిక అసమానతలు, కుల వివక్ష, మరియు ప్రభుత్వ వైఫల్యాలు వారి ఉద్యమానికి బలాన్ని ఇచ్చాయి. ఉదాహరణకు, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, జారండ్ వంటి రాష్ట్రాలలో గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి ప్రాజెక్టుల పేరుతో భూమి స్వాధీనం, అటవీ హక్కుల ఉల్లంఘనలు నక్సలైట్ ఉద్యమానికి ఆజ్యం పోసాయి. వీటిని వ్యతిరేకిస్తూ, నక్సలైట్లు తమను స్థానిక ప్రజల రక్షకులుగా చిత్రీకరిస్తారు.

అయితే, నక్సలైట్ల పద్ధతులు వారి దేశభక్తి వాదనను ప్రశ్నార్థకం చేస్తాయి. సాయుధ పోరాటం, ప్రభుత్వ సంస్థలపై దాడులు, పౌరులు, పోలీసుల మరణాలు వారిని తీవ్రవాదులుగా చిత్రీకరించేలా చేస్తాయి. ఉదాహరణకు, ఛత్తీస్‌గఢ్‌లో 2010లో జరిగిన దంతెవాడ దాడిలో 76 మంది సీఆర్పీఎఫ్ జవాన్లు మరణించారు, ఇలాంటి ఘటనలు నక్సలైట్లను హింసాత్మక శక్తులుగా చూపిస్తాయి. పాఠశాలలు, రైల్వే ట్రాక్‌లు, ఆస్పత్రులు వంటి ప్రజా సంస్థలపై దాడులు స్థానిక ప్రజలకు హాని కలిగిస్తాయి, ఇది వారి సామాజిక న్యాయ లక్ష్యాలకు విరుద్ధంగా కనిపిస్తుంది.

### సామాజిక, ఆర్థిక నేపథ్యం

నక్సలైట్ ఉద్యమం భారతదేశంలో ఆర్థిక అసమానతలు, ప్రభుత్వ నిర్లక్ష్యం, మరియు అభివృద్ధి విధానాల లోపాల నుంచి ఉద్భవించింది. గిరిజన ప్రాంతాల్లో విద్య, ఆరోగ్యం, రోడ్లు, ఉపాధి వంటి మౌలిక సదుపాయాలు లేకపోవడం వారి అసంతృప్తిని పెంచింది. ఖనిజ వనరుల స్వాధీనం, భూమి సంస్కరణలు అమలు కాకపోవడం, మరియు అవినీతి వంటి సమస్యలు నక్సలైట్లకు స్థానిక మద్దతును సమకూర్చాయి. ఈ నేపథ్యంలో, నక్సలైట్లు తమ ఉద్యమాన్ని దేశంలోని అణగారిన వర్గాల కోసం న్యాయమైన పోరాటంగా చూపించడానికి ప్రయత్నిస్తారు.

అయితే, ప్రభుత్వం కూడా ఈ సమస్యను పరిష్కరించడానికి ప్రయత్నాలు చేస్తోంది. గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలు, భూమి హక్కుల చట్టం (Forest Rights Act, 2006), మరియు భద్రతా బలగాల ద్వారా నక్సలిజాన్ని అణచివేయడం వంటి చర్యలు తీసుకుంటోంది. అయినప్పటికీ, ఈ చర్యలు తరచూ స్థానిక ప్రజలను మరింత అన్యాయానికి గురిచేస్తున్నాయని నక్సలైట్లు వాదిస్తారు. నక్సలైట్ సమస్యను పరిష్కరించడానికి హింసాత్మక పద్ధతుల కంటే సామాజిక, ఆర్థిక సంస్కరణలపై దృష్టి పెట్టలి

**అభివృద్ధి కార్యక్రమాలు:** గిరిజన ప్రాంతాల్లో విద్య, ఆరోగ్యం, ఉపాధి అవకాశాలను పెంచడం ద్వారా అసంతృప్తిని తగ్గించవచ్చు.

**భూమి సంస్కరణలు:** భూమి లేని రైతులకు భూమి, గిరిజనులకు అటవీ హక్కులను పూర్తిగా అమలు చేయాలి.సంభాషణలు: నక్సలైట్ నాయకులతో చర్చల ద్వారా శాంతియుత పరిష్కారాలను కనుగొనడం.

**పారదర్శక పాలన:** అవినీతిని తగ్గించడం, ప్రభుత్వ విధానాలలో పారదర్శకతను పెంచడం.

**సామాజిక సమానత్వం:** కుల, ఆర్థిక అసమానతలను తగ్గించడానికి చర్యలు తీసుకోవడం.

నక్సలైట్లను దేశభక్తులుగా లేదా తీవ్రవాదులుగా లేబుల్ చేయడం సమస్యను సరళీకరించడమే. వారి ఉద్యమం ఆర్థిక అసమానతలు, సామాజిక అన్యాయాల నుంచి ఉద్భవించినప్పటికీ, వారి హింసాత్మక పద్ధతులు ప్రజలకు, ప్రభుత్వానికి హాని కలిగిస్తున్నాయి. దేశభక్తి అనేది దేశంలోని అన్ని వర్గాల శ్రేయస్సు కోసం పనిచేయడం, మరియు ఈ దిశగా నక్సలైట్లు, ప్రభుత్వం రెండూ కలిసి శాంతియుత మార్గాలను అన్వేషించాలి. సామాజిక న్యాయం, ఆర్థిక సమానత్వం, మరియు అభివృద్ధి ద్వారా మాత్రమే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం సాధ్యమవుతుంది.

**కృష్ణస్వామి**
ఉస్మానియా విద్యార్థి

## చెడు ప్రేమ

చందమామను చూపే అమ్మ
ప్రేమని మరిచినావా
అడగకుండా అన్ని ఇచ్చే
నాన్న ప్రేమను మరిచినావా
వాడి ఆశల కోసం చూపే
ప్రేమ మార్గం పట్టినావా
నీతో తోడు పుట్టి మార్గం
చూపే అన్నాయ బంధం
విడిచిట్టివాజి
మార్గం లేని బంధం వైపు వెళ్తివా
ఆశలు కోరికలు తీసుకునే
వారి ప్రేమ వైపు వెళ్తివా
అవసరానికి సహాయం
చేసే స్నేహం బంధం
విడిచిట్టివా
వాడి ఆశల కోసం నీ
అందాన్ని పొగిడే వాడి
ప్రేమ పట్టితివా
అవసరం కోసం వాడుకునే
బంధం పట్టితివా
తల్లిదండ్రుల ప్రేమని వెతుకు
నిజ ప్రేమ మార్గాన్ని పట్టు
చెడు ప్రేమని కాదు

**ఆర్. బాలా**
హైదరాబాద్
(9391897896)

## రైతు..!!

వాలిన పొద్దు వాలినట్టే వుంది
కమ్మిన చీకటి కమ్మినట్టే వుంది
వసంతం అలా అలా వచ్చి
చుట్టపు చూపుగా వచ్చెళ్ళిపోతోంది
వాన చుక్క బాకులా దిగిపోయి
చిత్తడి మాత్రమే మిగిలించి వెళ్ళింది

మరణించిన గింజకు
దినాలు చేసుకోవాల్సి వుంది
చెదిరిపోయిన కుప్పను
వెతుక్కోవాల్సిన పని మిగిలింది
రైతులున్నారా అంటూ
ఆకలి పేగు అన్వేషణలో పడింది
రేటు పలకని ధాన్యపు గింజ
కంటికి ఎంగిలి పెట్టి రోదిస్తోంది

గూడొదిలిన వలస పక్షి
గడపను మరిచి దిక్కుల్ని చుదుతోంది
అరువు భారం మోయలేక
కరువు బండను నెత్తిన ఎత్తుకుంది
విత్తు విత్తడం పెద్ద ఎత్తుగా తోచింది
పాలిపోయిన ఆకు మీద
పాచిపోయిన అన్నం పెట్టుకుని
దిక్కులు చూడ్డమే పనైపోయింది

ఉరుముల కింద భూమి
పిడుగుల కింద కర్షకుడు
బ్రతుకు వాయుగుండమైంది
కష్టాల సుడిగుండంలో మునకలేస్తూ
తుపాను కెరటాల అలజడి లేచింది
రైతులున్నారా అనే సందేహం
దేహం మొత్తం పాకిపోయింది
ఉదరంలో ఉప్పెన పుట్టించి
ఉప్పు నీటితో కళ్ళను కాలువ చేసింది

**నరెద్దుల రాజారెడ్డి**
సెల్ : 9666016636

## ఈ కథ విన్నారా!

రాజాజ్ఞ శిలాశాసనం
ధిక్కరిస్తే శిరచ్ఛేదనం
రాజు భౌతికాయుధం!
రాజగురువు శాపాలు
నరకానికి త్రోపులు!
గురువు ఆధ్యాత్మికాయుధం!
ప్రజలకు ఇహ పర
సౌఖ్యాలుకాదు-దరిద్రాలు!
ఇది 'ఆ కాలం' చరిత్ర!
ప్రజలు పన్నులు చెల్లింపు
రామనామం వల్లింపు!
ఆధ్యాత్మికానికిమళ్లింపు!
చదవకూడదు వినకూడదు
నాలుకకోత సీసంపోత
దుర్భరదారిద్ర్యపురోత!
ముస్లింలు తెల్లోళ్ల
దండయాత్రలతో
చరిత్ర కొత్త మలుపు!
విద్య, సంస్కరణలు
స్వాతంత్ర్యం, రాజ్యాంగం
ప్రజాస్వామ్యం ఎన్నికలు!
రాజుల భౌతికయుధాలే
నాయకుల దోపిడీ చట్టాలు
ప్రభువుల తీరే అంత!
మనువాదం మతవాదం
స్వామీజీ బాబాజీలు
గుత్తకు తీసుకున్నారు!
చట్టము, స్వార్థము
ఇద్దరూ కవలపిల్లలై
సాగుతున్న దోపిడీ!
జనాన్ని గుప్పెట్లో పెట్టి
ఓట్లయించుకోవాలి!
అన్నీ అల్పచర్యలే!
కులమతవివక్షలు
అసమానత అస్పృశ్యతలు
ఆత్మ పరమాత్మలు!
దరిద్రం నిరుద్యోగం
వ్యాధులు యుద్ధాలు -వీళ్ళ
చట్ట,సాంస్కృతికాయుధాలు!
ఓటు కొనటంతో
ప్రజాస్వామ్యం అపహాస్యం
వీళ్ళు అందులో ఘనాపాటీలు!
అన్నిపార్టీల్లో వీళ్ళే
క్రోనీ క్యాపిటలిస్టులు
నటనాగ్రగణ్యులు!
మేధావులకు'చరమ
గీతం'పాడాలన్న
మో,షా ల మోసాలు!
వీళ్ళు- అకృత్యాలతో
నీచనికృష్టాలతోజి
మరీ రెచ్చిపోయారు!
మణిపూర్ కాశ్మీర్
కర్రె గుట్టల్లో వీళ్ళు
కదం తొక్కుతున్నారు!
ఇదితరతరాల మోసం
దేశద్రోహులంతా
దేశభక్తి నటిస్తారు !
ఇది వేల సంవత్సరాల
చట్ట,సాంస్కృతిక గాధ!
మోసం దగా దోపిడీ!

**-తమ్మినేని అక్కిరాజు**
హైదరాబాద్

## పిట్ట గూడు: ప్రకృతి నుంచి నీతి

ప్రకృతి ఒక గొప్ప గురువు. ఒక చిన్న పిట్ట గూడు, గాలివానలో చెదిరినా, తన పిల్లలను కాపాడుకునేందుకు రెక్కల క్రింద హత్తుకుని, రాత్రులు ఆకుల చాటున, రాళ్ల మాటున తల దాచుకుని, తెల్లవారగానే పుల్లలను ఏరి మళ్లీ గూడు నిర్మించడం ఒక సామాన్య సంఘటన కాదు. ఈ చిన్న కథలో జీవన సత్యాలు, పట్టుదల, బాధ్యత, మరియు ప్రకృతితో సామరస్యం గురించి లోతైన సందేశం దాగి ఉంది. ఈ కథ మానవ జీవనంలోని సవాళ్లను, పరిష్కార మార్గాలను ప్రతిబింబిస్తుంది.

పిట్ట గూడు చెదిరినప్పుడు, అది నిరాశలో కూరుకుపోలేదు. బదులుగా, తన పిల్లల రక్షణ కోసం తక్షణం చర్యలు తీసుకుంది. రాత్రి సమయంలో ఆకులు, రాళ్లను ఆశ్రయించి, తెల్లవారగానే కొత్త గూడు నిర్మించడం ప్రారంభించింది. ఇది మానవ జీవనంలో కష్టాలను ఎదుర్కొనే విధానానికి ప్రతీక. జీవితంలో సవాళ్లు, విపత్తులు తప్పవు. అయినప్పటికీ, వాటిని ఎదుర్కొని, పట్టుదలతో మళ్లీ నిర్మించుకోవడం మానవుని బలం. ఈ చిన్న పిట్ట ద్వారా మనం నేర్చుకోవాల్సిన పాఠం ఏమిటంటే, వైఫల్యం శాశ్వతం కాదుబీ ప్రయత్నం, ఆశావాదంతో దాన్ని అధిగమించవచ్చు.

పిట్ట తన పిల్లలను రెక్కల క్రింద హత్తుకుని రక్షించడం తల్లిదండ్రుల బాధ్యతను సూచిస్తుంది. గాలివానలో తన సౌలభ్యాన్ని పక్కనపెట్టి, పిల్లల భద్రతను మాత్రమే ప్రాధాన్యతగా భావించింది. ఇది మానవ సమాజంలో తల్లిదండ్రులు, నాయకులు, సమాజ సేవకులు చూపించే త్యాగాన్ని ప్రతిబింబిస్తుంది. కుటుంబం, సమాజం కోసం వ్యక్తిగత సౌకర్యాలను వదులుకోవడం, బాధ్యతాయుతం గా వ్యవహరించడం ఒక గొప్ప లక్షణం. పిట్ట ఆకులు, రాళ్లను ఆశ్రయించడం, పుల్లలను ఏరి గూడు నిర్మించడం ప్రకృతితో సామరస్యాన్ని చూపిస్తుంది. మానవులు తమ సౌలభ్యం కోసం ప్రకృతిని దోపిడీ చేస్తున్న నేటి రోజుల్లో, పిట్ట సామరస్య జీవనానికి ఒక ఆదర్శం. ప్రకృతి వనరులను గౌరవించడం, వాటిని సమర్థవంతంగా ఉపయోగించడం ద్వారా స్థిరమైన జీవనాన్ని సాధించవచ్చు.

# సమగ్ర 'శిక్ష'సమ్మె హామీలు ఇప్పటికీ సందిగ్ధంలోనే




"చాయ్ తాగినంత సేపట్లో మిమ్మల్ని రెగ్యులరైజ్ చేస్తా" హనుమకొండ ఏకశిలా పార్క్ వద్ద సమగ్ర శిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ) ఉద్యోగుల సమ్మె దీక్ష సందర్భంగా అప్పటి విపక్ష నాయకుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి గారు చేసిన ఈ వాగ్దానం ఇప్పటికీ నీరుగారిపోయింది. గత 15-20 సంవత్సరాలుగా తెలంగాణలో దాదాపు 19,325 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు సమగ్ర శిక్ష అభియాన్‌లో వివిధ హోదాల్లో సేవలందిస్తున్నారు. వీరిలో మండల వనరుల కేంద్రాల్లో సీసీఓలు, ఎమ్ఐఎస్ కోఆర్డినేటర్లు, మెసెంజర్లుబీ భవిత కేంద్రాల్లో ఐఈఆర్పీలుబీ స్కూల్ కాంప్లెక్స్‌లలో సీఆర్పీలుబీ పాఠశాల స్థాయిలో పీటీఐలు, కేజీబీవీల లో స్పెషల్ ఆఫీసర్లు, పీజీసీఆర్టీలు, సీఆర్టీలు, పీఈటీలు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఏఎన్ఎంలు, వర్కర్లుబీ డీపీఓ కార్యాలయా ల్లో ఏపీఓలు, సిస్టమ్ అనలిస్టులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, అటెండర్లు ఉన్నారు.

### విద్యా రంగంలో అగ్రస్థానం

సమగ్ర శిక్ష అభియాన్‌లో భాగమైన కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీ) విద్యా ఫలితాల్లో అద్వితీయ ప్రదర్శన కనబరుస్తున్నాయి. పదవ తరగతిలో 94.42% ఉత్తీర్ణత, ఇంటర్మీడియట్‌లో 73% ఉత్తీర్ణతతో ఇతర ప్రభుత్వ, జిల్లా పరిషత్, ప్రైవేటు పాఠశాలలను మించి నిలిచాయి. ప్రవేశ పరీక్షల ద్వారా ఎంపికైన విద్యార్థులతో నడిచే గురుకులాలకు సమానంగా, కేజీబీవీలు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి పూర్తి కరికులం అందిస్తున్నాయి. మహిళా సాధికారత కోసం ప్రభుత్వం తీసుకున్న చర్యలకు ఇవి బలమైన స్తంభాలుగా నిలుస్తున్నాయి. సమగ్ర శిక్ష ఉద్యోగులు మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు విద్యా వ్యవస్థకు వెన్నెముకగా సేవలందిస్తున్నారు.

### దీర్ఘకాల న్యాయ పోరాటం

సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు తమ సర్వీస్ రెగ్యులరైజేషన్, పే స్కేల్ అమలు కోసం దీర్ఘకాలంగా పోరాడుతున్నారు. గత శాసనసభ ఎన్నికల ముందు హనుమకొండ ఏకశిలా పార్క్ వద్ద 22 రోజుల సమ్మె చేశారు. ఆ సమయంలో అప్పటి విపక్ష నాయకుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి, "చాయ్ తాగినంత సేపట్లో మీ సర్వీస్‌ను రెగ్యులరైజ్ చేస్తాం," అని హామీ ఇచ్చారు. అయితే, సమ్మె ఫలితాలు లేకుండానే



విరమించాల్సి వచ్చింది. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఏడాది కాలం వేచి చూసిన ఉద్యోగులు, ప్రభుత్వం స్పందించకపోవడంతో, గత డిసెంబర్‌లో 28 రోజుల సమ్మె చేశారు. విద్యార్థుల పరీక్షలు, ప్రభుత్వ హామీలను దృష్టిలో ఉంచుకుని సమ్మె విరమించారు.

### నెరవేరని హామీలు

- సమ్మె విరమణ సమయంలో ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ నెరవేరలేదు:
- ఆర్థిక సంబంధిత అంశాలను మూడు నెలల్లో క్యాబినెట్ సబ్-కమిటీ ద్వారా పరిష్కరిస్తామన్న హామీపై ఆరు నెలలైనా స్పందన లేదు.
- టర్మినేషన్ విధానాన్ని రద్దు చేస్తామని చెప్పినా, ఏప్రిల్‌లో టర్మినేషన్ ప్రక్రియ కొనసాగింది.
- 28 రోజుల సమ్మె కాలపు పూర్తి వేతనం చెల్లిస్తామన్న హామీ అమలుకాలేదు.
- పార్ట్-టైమ్ ఇన్‌స్ట్రక్టర్లకు 12 నెలల వేతనం చెల్లిస్తామన్న హామీ నెరవేరలేదు.
- ప్రతి సంవత్సరం 20% జీతం పెంచుతామన్న హామీపై ఎటువంటి ప్రకటన లేదు.
- ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పురుషులకు 22 సీఎల్‌లు, మహిళలకు 27 సీఎల్‌లు ఇవ్వాలన్న డిమాండ్‌పై మహిళలకు మాత్రం 15 నుంచి 20 సీఎల్‌లకు పెంచారు. సీసీఎల్‌లు, ఆప్షనల్ హాలిడేస్, అనారోగ్య సెలవులు, చైల్డ్ కేర్ లీవ్స్ వంటి ఆర్థికేతర డిమాండ్లు నెరవేరలేదు.
- సీఆర్పీలకు మొబైల్ బిల్స్, ట్రావెలింగ్ అలవెన్స్‌లపై ఎటువంటి నిర్ణయం లేదు.
- డేటా ఎంట్రీ ఆపరేటర్లకు మొబైల్ బిల్స్, ట్రావెలింగ్ అలవెన్స్‌లపై కూడా స్పందన లేదు.
- రెసిడెన్షియల్ పాఠశాలల సంఖ్య పెరిగిన నేపథ్యంలో కాంప్లెక్స్‌ల సంఖ్య పెంచాలన్న డిమాండ్ కాగితాలకే పరిమితమైంది.
- రెగ్యులర్ పోస్టుల భర్తీలో కాంట్రాక్ట్ ఉద్యోగులకు వెయిటేజ్ ఇస్తామన్న హామీపై స్పష్టత లేదు.
- ఉద్యోగుల హోదా సూచించే పేర్ల మార్పుపై ఆర్థిక భారం లేని డిమాండ్ కూడా నెరవేరలేదు.

### సాంకేతిక అడ్డంకులు లేవు

కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌లో సాధారణంగా సాంకేతిక, న్యాయపరమైన అడ్డంకులు ఉండవచ్చు. కానీ, ఎస్ఎస్ఏలో రెగ్యుల ర్ ఉద్యోగులు లేరుబీ అందరూ కాంట్రాక్ట్ ఉద్యోగులే. వీరు రాత పరీక్ష, మెరిట్, రోస్టర్ ప్రకారం ఎంపికయ్యారు. కాబట్టి, వారి సర్వీస్ రెగ్యులరైజేషన్‌లో ఎటువంటి సాంకేతిక ఇబ్బందులూ ఉండవు. కనీసం పే స్కేల్ అమలు చేసినా, ఈ ఉద్యోగుల కుటుంబాలకు న్యాయం జరుగుతుంది.

### టీజీఈ జేఏసీలో భాగస్వామ్యం

తెలంగాణలో 206 ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంఘాలతో ఏర్పడిన టీజీఈ జేఏసీలో సమగ్ర శిక్ష ఉద్యోగులు భాగస్వాములుగా ఉన్నారు. 33 జిల్లా కమిటీలలో పాల్గొంటూ నిరసన కార్యక్రమాల్లో చురుకుగా ఉన్నారు. జేఏసీ 57 డిమాండ్లలో ఎస్ఎస్ఏ ఉద్యోగుల డిమాండ్లు కూడా ఉన్నాయి. ముగ్గురు సీనియర్ ఐఏఎస్ అధికారులతో ఏర్పాటైన కమిటీ ఈ డిమాండ్లను చర్చిస్తోంది. ఈ సందర్భంగా, రాష్ట్ర ప్రభుత్వం మానవతా దృక్పథంతో సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్లను పరిశీలించి, న్యాయం చేయాలని కోరుతున్నాము.

**జుర్రు నారాయణ యాదవ్**
టీజీఈ జేఏసీ జిల్లా కో-కన్వీనర్,
తెలంగాణ టీచర్స్ యూనియన్ జిల్లా
అధ్యక్షులు, మహబూబ్‌నగర్
సంప్రదింపు: 9494019270

# విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో ప్రాణాలు పోతే సహించేది లేదు

- శ్రేయాన్స్ మరణం నన్ను తీవ్రంగా కలచివేసింది
- ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలి
- వాన కాలంలో ప్రమాదాలు జరగడానికి ఆస్కారం ఉన్న ప్రాంతాలు గుర్తించాలి
- అవసరమైతే అదనపు నిధులు తీసుకొచ్చి రక్షణ చర్యలు చేపట్టాలి
- ప్రమాదాలు జరగడానికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి
- ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి స్పష్టీకరణ



**జడ్చర్ల, జూన్ 4 (జనం సాక్షి) :** విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రాణాలు పోయే పరిస్థితులు ఏర్పడితే సహించేది లేదని, అందుకు కారకులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి హెచ్చరించారు. జడ్చర్ల పట్టణంలోని 3వ వార్డులో బుధవారం విద్యుత్ షాక్ తో శ్రేయాన్స్ అనే పదేళ్ల బాలుడు మృతి చెందడం పట్ల ఆయన తీవ్ర ఆవేదనను వ్యక్తం చేశారు. జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో రక్షణ లేని ట్రాన్స్ఫార్మర్లు ఉన్నాయని వాటి కారణంగా ప్రజల ప్రాణాలకు ఆపద వాటిల్లకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత విద్యుత్ శాఖ అధికారులదేనని స్పష్టం చేశారు. ప్రత్యేకించి వానా కాలంలో విద్యుత్ ప్రమాదాలు అధికంగా జరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు అన్ని ప్రాంతాల్లోనూ రక్షణ కోసం తీసుకోవాల్సిన చర్యలను గురించి సమీక్షించి తగిన చర్యలు తీసుకోవాలని బుధవారం మీడియాకు విడుదల చేసిన ఒక ప్రకటనలో అనిరుధ్ రెడ్డి కోరారు. రక్షణ లేని ట్రాన్సఫర్మర్ల వద్ద ప్రమాదాలు జరగడంతో పాటుగా గాలి వానలకు విద్యుత్ వైర్లు తెగిపడటం వల్ల కూడా ప్రాణాలు పోయే ప్రమాదాలు సంభవిస్తాయని ఆందోళన వ్యక్తం చేసారు. అందుకే అధికారులు ప్రమాదాలు జరగడానికి అవకాశం ఉన్న ప్రాతంతాలను గుర్తించి, వాటిని నివారించడానికి అవసరమైన చర్యలను చేపట్టాలని సూచించారు. దీని కోసం అవసరమైతే అదనపు నిధులను ప్రభుత్వం నుంచి తీసుకురావడానికి తాను కృషి చేస్తానన్నారు. అయితే ఇటీవల జడ్చర్లలో జరిగిన విద్యుత్ ప్రమాదాల్లో అధికార సిబ్బంది నిర్లక్ష్యం ఉందనే ఆరోపణలు వస్తున్న విషయాన్ని ఆయన ప్రస్తావిస్తూ అధికారుల తప్పిదాలు, నిర్లక్ష్యం కారణంగా ప్రజల ప్రాణాలు పోయే పరిస్థితులు ఏర్పడితే తాను సహించేది లేదని, అందుకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అనిరుధ్ రెడ్డి హెచ్చరించారు.

### హృదయం ద్రవించిపోయింది

బుధవారం జడ్చర్లలోని 3వ వార్డులో విద్యుత్ షాక్ తో మరణించిన శ్రేయాన్స్ ను చూసి తన హృదయం ద్రవించి పోయిందని, జరిగిన సంఘటన తనను కలచివేసిందని అనిరుధ్ రెడ్డి అన్నారు. శ్రేయాన్స్ తండ్రి స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకుడు బొక్కా రాఘవేందర్ ను ఎమ్మెల్యే ఫోన్ లో పరామర్శించారు. బంగారు భవిష్యత్తు కలిగిన బాలుడి జీవితం ఇలా అర్ధాంతరంగా ముగిసిపోవడం ఎంతో బాధాకరమని చెప్పారు. ఆ చిన్నారి మృతితో ఆ కుటుంబానికి ఏర్పడిన లోటు ఎవరూ పూడ్చలేనిదన్నారు. అయినా ఈ ఆపద సమయంలో ఆ కుటుంబానికి తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఇకపై ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కాగా ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మాతృమూర్తి శశికళారెడ్డి శ్రేయాన్స్ భౌతిక కాయానికి పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. బొక్కా రాఘవేందర్ కుటుంబ సభ్యులను ఓదార్చారు. అలాగే మాజీ మంత్రి లక్ష్మారెడ్డి శ్రేయాన్స్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ షోరూంను ప్రారంభించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**కాప్రా, జూన్ 4 (జనం సాక్షి) :** బంగారు ఆభరణాలలో నూతన డిజైన్లతో వినియోగదాల మన్ననలను పొంది వ్యాపారం అభివృద్ధి చెందుతుందని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం ఏఎస్ రావు నగర్ లో మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూమ్ ను స్థానిక కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి, మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ ప్రతినిధులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గంలోని ఏఎస్ రావు నగర్ లో మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ షోరూమ్ ను ఏర్పాటు చేయడం అభినందనీయమని, మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ వారికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ ప్రతినిధులు మాట్లాడుతూ షోరూం ఓపెనింగ్ సందర్భంగా బంగారు ఆభరణాలపై జరుగులో 25% తగ్గింపు పొందచ్చని తెలిపారు. మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ 19 93లో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 13 దేశాలలో 390 కంటే ఎక్కువ షోరూంలను ఏర్పాటు చేశామన్నారు. ప్రపంచవ్యాప్తంగా 15 మిలియన్ కస్టమర్లను బెస్ట్ సేవలందిస్తున్నామని వారు తెలిపారు. మన బార్ గోల్డ్ అండ్ డైమండ్లు 22,000 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ సిబ్బంది, బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

**మల్దకల్, జూన్ 4 (జనంసాక్షి) :** మండల కేంద్రంలోని రైతువేదికలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నూతన విత్తన చట్టం - 2025 ముసాయిదా తయారీకై చేసిన కమిటీ సభ్యులతో బుధవారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా విత్తనోత్పత్తి చేస్తున్న రైతులకు తగిన గిట్టుబాటు ధర చెల్లిస్తే ఈ నాణ్యత ప్రమాణాలు పాటించవచ్చును.ఆర్గనైజర్లు వ్యవస్థను చట్ట బద్ధం చెయ్యాలి,రైతులతో పండిస్తున్న వారికి కనీస విద్యార్హతలను పెట్టాలి వారికి లైసెన్స్ ప్రభుత్వం ఇవ్వాలి మొదలగు అంశాలపై కమిటీ సభ్యుడు అయిన తెలంగాణ రాష్ట్ర విత్తనాభ్రువృద్ధి సంస్థ చార్మన్ అన్వేష్ రెడ్డి,కమిటీ సభ్యుడు డి.నర్సింహారెడ్డి రైతులతో చర్చించారు. అదేవిధంగా ఇంకేమైనా సలహాలు సూచనాలు ఉన్న మండలవ్యవసాయ కార్యాలయంలో తెలియజెయ్యాలని,మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎం.అధినారాయణ రెడ్డి,డిఏం, వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.నరసింహులు,పద్మ, మండల వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులు పాల్గొన్నారు.



## అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే
- మంచాల మండలానికి 93 కల్యాణలక్ష్మి చెక్కులు మంజూరు



**ఇబ్రహీంపట్నం, జూన్ 4 (జనం సాక్షి) :** ప్రజా ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. బుధవారం రోజున ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంచాల మండలానికి చెందిన 93 మంది లబ్దిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత రాజకీయాలకు అతీతంగా ప్రతి నిరుపేద కుటుంబానికి న్యాయం జరిగే విధంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి, గుండెమోని జయమ్మ, బైరిక రమాకాంత్ రెడ్డి, ప్రేమాకర్ రెడ్డి, చీమల జంగయ్య యాదవ్, ఎడమ నరేందర్ రెడ్డి, జెనిగే వెంకటేష్, కావలి శ్రీనివాస్, మిద్దె శ్రీనివాస్ గౌడ్, కారింగుజంగయ్యగౌడ్, ముచ్చర్ల వెంకటేష్ ,మహేందర్, పెర్క మూర్తి, పల్లాటి జయానందం, ఎర్పుల రాజు, బాలు నాయక్, మార సురేష్, కంబాలపల్లి బుగ్గరాములు, దాసరమోని అశోక్, పూజారి ప్రభాకర్, నవీన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## 20 క్వింటాళ్ల పీడీఎస్ రైస్ పట్టివేత



**మక్తల్, జూన్ 4 (జనంసాక్షి) :** 20 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్న సంఘటన నర్వ మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ కురుమయ్య తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం రాత్రి సమయంలో నర్వ పోలీసులు నమ్మదగిన సమాచారం మేరకు పెద్దకడుమూరు గ్రామంలో ఎరుకలి నరసింహ ఇంట్లో తనిఖీ చేయగా ప్రభుత్వం పేదలకు సరఫరా చేసే రేషన్ బియ్యం లబ్ధిదారుల నుంచి సేకరించి 20 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యంను అక్రమంగా తన ఇంట్లో నిల్వ ఉంచుకోవడం జరిగిందని తెలిపారు. డిటి పంచనామా నిర్వహించి బియ్యం ను సీజ్ చేసి నరసింహపై కేసు నమోదు చేసి విచారణ జరుగుతుందని ఎస్సై తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం పేదలకు సరఫరా చేసి రేషన్ బియ్యం ను లబ్ధిదారుల నుంచి సేకరించిన, రవాణా చేసిన కేసులు నమోదు జరుగుతాయని యస్ తెలిపారు.

## పోటా పోటీగా జన్మదిన వేడుకలు

- ఒకే రోజు ఇద్దరు నేతల పుట్టినరోజుతో కార్యకర్తల్లో జోష్
- ఎన్నికల ప్రచారాన్ని తలపించిన వేడుకలు
- వికారాబాద్ పట్టణంలో భారీ ర్యాలీలు





**వికారాబాద్ జిల్లా బ్యూరో, జూన్ 4 (జనం సాక్షి) :** ఇద్దరు నేతలు ఒకే నియోజకవర్గం నుంచి ఎన్నికల్లో పోటీ పడతారు.. ఆ నేతలిద్దరూ ఒకే నెలలో ఒకటే తారీఖున జన్మించారు. వారి జన్మదిన ఆ పార్టీల కార్యకర్తలు ఎన్నికల ప్రచారం అంత స్థాయిలో నిర్వహిస్తారు. ఇది ప్రతి ఏడాది ఆనవాయితీగా వస్తుంది. వివరాల్లోకి వెళితే... తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్( కాంగ్రెస్) మాజీ ఎమ్మెల్యే బి.ఆర్.ఎస్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ జన్మదిన వేడుకలు వికారాబాద్ పట్టణంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ . మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ ను ఆయా పార్టీల కార్యకర్తలు నాయకులు టాపులేని జీపుపై పట్టణంలో ఊరేగిస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. వికారాబాద్ నియోజకవర్గంలోని కాంగ్రెస్. బి.ఆర్.ఎస్ పార్టీల కార్యకర్తలు భారీగా తరలివచ్చి వారి జననేతలకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. గజ మాలలు వేసి శాలువలతో సత్కరించి మిఠాయిలు మంచి పెట్టారు. ఇద్దరు నేతల జన్మదిన వేడుకలు బల నిరూపణ తరహాలో జరిగాయి. భారీగా కార్యకర్తలు తరలివచ్చి వారి నాయకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. త్వరలోనే మున్సిపల్ స్థానిక సంస్థల ఎన్నికల వస్తున్న నేపథ్యంలో ఈ ఇద్దరు నేతల పుట్టినరోజు వేడుకలకు ప్రాధాన్యత సంతరించుకుంది. గ్రామాల వారీగా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్న నాయకులంతా తమ మంద బలంతో జననేతలకు స్వాగతం పలుకుతూ సత్కరించారు. ఇద్దరు నేతలు చేతుల్లో దాలు కత్తులు పట్టి కార్యకర్తలను ఉత్తేజపరిచారు. పుట్టినరోజు వేడుకల సందర్భంగా ఇద్దరు నేతలు ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యాంప్ ఆఫీస్ పార్టీ కార్యాలయంలో అందుబాటులో ఉండి అందరిని కలిసి కార్యకర్తల నుంచి పుట్టినరోజు ఆశీస్సులు పొందారు. పట్టణంలో భారీగా ఫ్లెక్సీలు కటౌట్లు బ్యానర్లు కట్టి తమ నేతలపై నాయకులు భక్తిని చాటుకున్నారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అర్థ సుధాకర్ రెడ్డి. మర్పల్లి మండల బి.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఆయా పార్టీల నేతలు ఇద్దరికీ భారీ ఎత్తున స్వాగత తోరణాలను ఏర్పాటు చేసి పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలతో ఆయా పార్టీల కార్యకర్తల్లో జోష్ పెరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌కు వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి క్యాంప్ ఆఫీసులో కలిసి పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్



**బొంరాస్‌పేట, జూన్ 4 (జనం సాక్షి) :** మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి గ్రామానికి పైలట్ ప్రాజెక్టులో భాగంగా 97 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కావడం జరిగింది.అందులో 27 ఇండ్లు నిర్మాణ దశలో ఉన్నాయి.బుధవారం వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్,అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్‌తో కలిసి ఇళ్ల నిర్మాణ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు.అనంతరం లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు అందేలా చర్యలు తీసుకోవాలని హౌసింగ్ శాఖ అధికారులను ఆదేశించారు.ఆయన వెంట హౌసింగ్ ఏఈ వరుణ్,సూపరింటెండెంట్ వెంకన్ గౌడ్, మండల పంచాయతీ అధికారి రవి నాయక్,గ్రామ పంచాయతీ కార్యదర్శి బసంత్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## వరి ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్



**బొంరాస్‌పేట, జూన్ 4 (జనం సాక్షి) :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు రేషన్ కార్డు కలిగివున్న వారికి మూడు నెలల రేషన్ బియ్యం పంపిణీ కార్యక్రమంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రేషన్ బియ్యం పంపిణీ సజావుగా సాగేలా అధికారులు చొరవ చూపాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్ అన్నారు.బుధవారం అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, జిల్లా సివిల్ సప్లై అధికారి మోహన్ బాబుతో కలిసి రేషన్ షాపును తనిఖీ చేశారు.అనంతరం ఐకెపి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు.వరి ధాన్యం కొనుగోలు వేగవంతం చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఆయన వెంట సూపరింటెండెంట్ వెంకన్ గౌడ్,మండల పంచాయతీ అధికారి రవి నాయక్, పంచాయతీ కార్యదర్శి వెంకటయ్య,కొనుగోలు కేంద్రం నిర్వాహకులు ఉన్నారు.

## అల్లాదుర్గం ఎస్సైగా శంకర్ బాధ్యతల స్వీకరణ



**అల్లాదుర్గం, జూన్ 4 (జనంసాక్షి) :** అల్లాదుర్గం పోలీస్ స్టేషన్ ఎస్సైగా డి.శంకర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషిచేస్తామన్నారు. అసాంఘిక కార్యక్రమాలు, జూదం, అక్రమ మద్యం ,తదితర వాటిపై దృష్టిసారిస్తామన్నారు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, వాహనానికి సంబందించిన అన్ని పత్రాలను కలిగి ఉండి ద్విచక్ర వాహన దారులు హెల్మెట్ దరించాలని సూచించారు. పోలీస్ సిబ్బంది నూతన ఎస్సైకి శుభాకాంక్షలు తెలిపారు. ఇప్పటి వరకు అల్లాదుర్గం ఎస్సైగా విధులు నిర్వహించిన ప్రవీణ్ రెడ్డి బదిలీపై పెద్దశంకరంపేట పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు.

# చెరువుల అభివృద్ధిలో వేగం పెరగాలి

- మొదటి విడత 6 చెరువులూ అందుబాటులోకి రావాలి
- వరదలను నిలువరించేలా విస్తరించాన్న హైడ్రా కమిషనర్



**హైదరాబాద్, జూన్ 4 (జనంసాక్షి) :** చెరువుల అభివృద్ధి పనుల్లో వేగాన్ని పెంచాలని హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారు ఆదేశించారు. ఈ వర్షాకాలం చెరువులన్నీ స్వచ్ఛమైన నీటితో కళకళలాడాలని సూచించారు. నగరంలో మొదటి విడతగా చేపట్టిన 6 చెరువుల అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా చూడాలన్నారు. ఈ క్రమంలో మంగళవారం బతుకమ్మకుంట, భమృక్‌నుద్దౌలా చెరువులను పరిశీలించిన హైడ్రా కమిషనర్. తమ్మిడికుంట, సున్నం చెరువులను బుధవారం సందర్శించారు. అక్కడి పనుల పురోగతిని పరిశీలించారు. 14ఎకరాల విస్తీర్ణంలో ఉన్న తమ్మిడికుంటను 26 ఎకరాల మేర నీరు నిలిచేలా.. మరో 4 ఎకరాల్లో పర్యావరణానికి పెద్ద పీట వేయాలని సూచించారు. చెరువు బండ్ బలంగా ఉండేలా జాగ్రత్త పడాలని సూచించారు. చెరువు కింద లోతట్టు ప్రాంతంతో పాటు.. భవనాలు ఉన్న దృష్ట్యా బండ్‌కు వెలుపల భాగంలో కాంక్రీట్ గోడ నిర్మించాలన్నారు. పనులకు ఆటంకం కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సున్నం చెరువును కమిషనర్ సందర్శించారు. సున్నం చెరువు మొత్తం 32.20 ఎకరాలు కాగా.. ఇప్పుడు కేవలం 14.18 ఎకరాల్లోనే నీరు నిలుస్తోంది. దీనిని పూర్తి స్థాయికి విస్తరించాలని అన్నారు. అలాగే చెరువు లోతును కూడా పెంచాలని సూచించారు. ఈ మేరకు చెరువులో మురుగును బయటకు పంపి.. దుర్గంధభరిత మట్టిని కూడా హైడ్రా తొలగించింది. ఈ వర్షాకాలంలో స్వచ్ఛమైన నీరు నిలిచేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

# గంజాయి విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు

- ఇంచార్జ్ ఎక్సైజ్ సిఐ కే.శ్రీనివాస్



**తాండూరు, జూన్ 4 (జనంసాక్షి) :** ప్రభుత్వ నిషేధిత గంజాయి విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఇంచార్జ్ ఎక్సైజ్ సిఐ కే.శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం సమయంలో పెద్దేముల్ మండలం తట్టేపల్లి గ్రామంలోని మహ్మద్ మియా తండ్రి అబ్దుల్ రహమాన్,(:52) సంవత్సరాలు, ఇతను గంజాయి కొనుగోలు చేసి సేవిస్తున్నాడని సమాచారం మేరకు వికారాబాద్,తాండూరు ఎక్సైజ్ పోలీసులు ఆయన నివాసంలో మరియు ఇంటి పరిసర ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. సుమారు 125 గ్రాముల ఎండు గంజాయి లభించింది. ఈ సందర్భంగా ఇంచార్జ్ ఎక్సైజ్ సిఐ కే.శ్రీనివాస్ మాట్లాడుతూ నార్కోటిక్ డ్రగ్స్ మరియు సైకో ట్రోపిక్ సబ్ స్టాన్సిస్(ఎడిపిఎస్) చట్టం ప్రకారం గంజాయిని కలిగియుండుటం, సేవించుట, ఇతరులకు విక్రయించటం చట్టవిరుద్ధమన్నారు. మహమ్మద్ మియా పైన నార్కోటిక్ డ్రగ్స్ మరియు సైకో ట్రోపిక్ సబ్ స్టాన్సిస్(ఎడిపిఎస్) చట్టం ప్రకారం కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించడం జరిగిందని తెలిపారు. మత్తు పదార్థాలు విక్రయానికి పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడులలో ఎక్సైజ్ ఎస్ఐలు ఆదిశేషరెడ్డి, నిజాముద్దీన్, మరియు సిబ్బంది భీమయ్య, రవి కిషోర్, రవి కిరణ్, కుమార్, విష్ణు, శివ ప్రసాద్, హనుమంతు, ఆసిఫా బేగం, రాధిక,మహేందర్, సతీష్ లు ఉన్నారు.

# ప్రజలు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

**నారాయణపేట జిల్లా ప్రతినిధి, జూన్ 4 (జనం సాక్షి) :** వాహనదారులు రోడ్డు నియమాలు పాటించాలనీ ట్రాఫిక్ పోలీసులు అవగాహన కల్పిస్తు కోరారు. జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు బుధవారం సాయంత్రం నారాయణపేట జిల్లా కేంద్రంలోని వీర్ సావర్క ర్ చౌరస్తా రహదారి పై ట్రాఫిక్ పోలీసులు ప్రజలకు, వాహన దారులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ బాల్ రాజు మాట్లాడుతూ ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సైబర్ నేరగాళ్లు చూపే మోసపూరిత ఆశలకు గురికారాదు అని, సైబర్ నేరాలకు గురైతే 1930 టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మార్కెట్‌కి వచ్చి పోయేటప్పుడు ఏమరపాటుగా ఉంటే మనకు తెలియకుండానే దొంగతనాలు చేస్తున్నారని, అలాంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు.వాహనదారులు మద్యపానం సేవించి వాహనాలు



నడపరాదని ప్రతి ఇంట్లో పెద్ద పెద్దవాళ్లకు పిల్లలకు చెప్పాలని, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదానికి గురై అవకాశం ఉంటుందని, జాగ్రత్తగా వచ్చే వారి వాహనాలకు కూడా రోడ్డు ప్రమాదాలు జరిగా అవకాశం ఉంటుంది అని డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో దొరికితే జరిమానాతో పాటు జైలుకు పంపించడం జరుగుతుంది అని తెలిపారు. మద్యపానం సేవించడం వల్ల ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయే అవకాశం ఏకువ ఉంది కాబట్టి వాహనదారులు కచ్చితంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అన్నారు. మీ ఇంట్లో చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపరాదు.వాహనాలు నడిపేవారు విధిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించవలెను. వాహనదారులు మెయిన్ రోడ్డుపై వాహనాలను పార్కు చేయరాదు. టూ వీలర్స్‌పై ఇద్దరకు మించి ప్రయాణించరాదు. ఆటోలలో ఎక్కువ మంది పిల్లలను మరియు కూలీలను ఎక్కించుకోరాదు. ఆటోలో సీట్ పర్మిట్ ఉన్నంతవరకే ప్యాసింజర్ ఎక్కించుకోవాలి. డ్రైవింగ్ చేస్తూ సెల్ఫోన్ మాట్లాడరాదు.రాష్ డ్రైవింగ్ చేయరాదు.పరిమిత వేగంలో వాహనాలు నడపాలి. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ రూల్స్ పాటించి పోలీస్ వారికి సహకరించాలని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు ఇమాన్యులు, మోహన్ లాల్, వాహనదారులు తదితరులు పాల్గొన్నారు.

# చదువుకుంటేనే భవిష్యత్తు

**నారాయణపేట జిల్లా ప్రతినిధి, జూన్ 4 (జనం సాక్షి) :** చదువు కుంటేనే వ్యక్తికి భవిష్యత్తు ఉందని పేద విద్యార్థులకు చేయూత నిద్దామని ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి శంకరోళ్ల రవికుమార్ అన్నారు. ఉట్కూరు మండలంలోని ఎడివెల్లి గ్రామంలో వార్డు మెంబర్ వెంకటప్ప, తాయప్ప, బూరెల్లి రవి, రమేష్ ఆధ్వర్యంలో బుధవారం ఎస్ఎస్‌సి, ఇంటర్ ఉత్తమ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందించారు. ఈ కార్యక్రమా నికి ముఖ్యఅతిథిగా హాజరైన బిజెపి రాష్ట్ర ఓబిసి మోర్చా అధికార ప్రతినిధి శంకరొళ్ల రవికుమార్ మాట్లాడుతు ఎవరికైనా చదువుకుంటేనే భవిష్యత్తు ఉందని అన్నారు. నైపుణ్యం ఉన్నా చదువుకునే స్తోమతలేని పేద విద్యార్థులకు తమ వంతుగా చేయూత నివ్వాలని కోరారు. విద్యార్థులు చిన్నతనం



నుంచే చదువులో రాణించాలని అన్నారు. మంచి చదువుతూనే బంగారు భవిష్యత్తు ముడిపడి ఉందని అన్నారు. అంతేకాకుండా అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. చదువులో ఇలాగే ప్రతిభ చూపి తల్లిదండ్రులకు గ్రామానికి సమాజానికీ మంచి పేరు తీసుకురావాలని అన్నారు.ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యకు సంబంధించిన నూతన భవన నమూనా సిద్ధం చేయండి

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి బ్యూరో, జూన్ 4 (జనంసాక్షి) :** వనపర్తి పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాల, జూనియర్ కళాశాల నూతన భవన నమూనా సిద్ధం చేసి నిర్మాణ పనులను కార్యాచరణ మొదలు పెట్టాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఇంజనీరింగ్ అధికారిని ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో టి.డబ్ల్యూ.ఐ.డి.సి ఇంజనీరు, కళాశాల ప్రిన్సిపాల్, ప్రధానోపాధ్యాయుడు, ఇంటర్మీడియట్ నోడల్ ఆఫీసర్‌తో భవన నమూనా, అవసరమైన తరగతి గదులు, ఇతర సదుపాయాల పై చర్చించారు.వనపర్తి పట్టణంలో జడ్పీ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల నూతన భవన నిర్మాణానికి రాష్ట్ర ముఖ్యమంత్రి శంఖుస్థాపన చేసి రూ. 47.5 కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. పాఠశాల, కళాశాల కు వెరసి మూడంతస్తుల భవన నిర్మాణానికి ప్రణాళికలు చేయాలని, అందులో అవసరమైన తరగతి గదులు, ల్యాబ్, ఆడిటోరియం, మరుగుదొడ్లు తదితర అన్ని వసతులతో నూతన భవన నిర్మాణానికి నమూనా సిద్ధం చేయాలని ఆదేశించారు. టి. డబ్ల్యూ.ఐ.డి.సి కార్యనిర్వహక ఇంజనీరు రాంచందర్, డి. ఈ, ఇంటర్మీడియట్ నోడల్ అధికారి అంజయ్య, కళాశాల ప్రిన్సిపాల్, ప్రధానోపాధ్యాయుడు, విద్యా శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**మక్తల్, జూన్ 4 (జనంసాక్షి) :** సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని షీ టీం పోలీసులు అన్నారు. మక్తల్ బస్టాండ్ వద్ద షి టీమ్ పోలీసుల ఆధ్వర్యంలో ప్రజలకు సైబర్ నేరాలు, బస్సులలో ప్రయాణించేటప్పుడు దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వాహనాలు నడిపే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సీసీ కెమెరాల ఉపయోగం, రోడ్డు భద్రత నియమాలు తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షి టీమ్ పోలీసులు చెన్నయ్య మాట్లాడుతూ ప్రజలు సైబర్ నేరగాళ్లు చూపే మోసపూరిత ఆశలకు గురికారాదని లాటరీ తగిలిందని, తక్కువడ్డికి లోన్ ఇస్తామని, గిఫ్ట్ ప్యాక్ లు వచ్చుయి అని, తక్కువ రేట్ కి వాహనాలు దొరుకుతాయని, ఎవరైనా పై అధికారి వాట్సాప్ డీపీ పెట్టుకుని వాట్సాప్ లో మెసేజ్ చేసి డబ్బులు పంపమని అడిగితే పంపరాదని సూచించారు. మొబైల్ ఫోన్లో బ్లూ లింక్స్ ఓపెన్ చేయరాదని, ఎవరైనా ఓటీపీలు అడిగితే చెప్పరాదని మొదలగు మోసపూరిత ఆశలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అనుకోకుండా సైబర్ నేరానికి గురైతే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. అలాగే




బస్సులలో ప్రయాణం చేసేటప్పుడు ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, లగేజ్ బ్యాగులు విలువైన వస్తువులు, డబ్బులు, కిటికీల దగ్గరకు కూర్చున్నప్పుడు బంగారు గొలుసులు జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో షి టీమ్ పోలీసులు జ్యోతి, కవిత, ప్రజలు, ప్రయాణికులు తదితరులు పాల్గొన్నారు.

# గురుపీఠంలో కొనసాగుతున్న ప్రతిష్ట వేడుకలు

- హాజరైన మాజీ మంత్రి హరీష్ రావు , హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి

**శివ్వంపేట, జూన్ 4 (జనంసాక్షి) :** మండల పరిధిలోని గూడూరు గ్రామ శివారులో శ్రీ గురు పీఠంలో దత్తాత్రేయ మహాస్వామి, షిరిడి సాయిబాబా విగ్రహల ప్రతిష్ట పూజోత్సవాలు బుధవారం కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాలకు మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా రెడ్డి, ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, సాయి ఉపాసకులు మైనంపాటి ప్రసాద్, షిరిడి ధర్మాధికారి లు దత్తాత్రేయ మహాస్వామి పంచాయతనం, సాయినాథుని మందిరంలో దేవతామూర్తులు దర్శించుకొని, యాగశాల వద్ద ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ప్రముఖ వేద పండితులు వామన శర్మ, గణపతి శర్మల సమక్షంలో శ్రీ గురుఫిఠం చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ చైర్మన్ పెద్దగోని శివకుమార్ గౌడ్ రమాదేవి దంపతుల ఆధ్వర్యంలో వారిని ఘనంగా సన్మానించారు. ఈ ప్రతిష్ట పూజల కార్యక్రమానికి పలు జిల్లాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో గురు పీఠానికి తరలివచ్చి జలాధివాసం, ధాన్యాదివాసంలో పాల్గొనీ ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులకు శ్రీ గురుపీఠం ట్రస్ట్ తరఫున అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అటవీ కార్పొరేషన్ మాజీ



చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఉమ్మన్నగారి దేవేందర్ రెడ్డి, డిసిసిబి డైరెక్టర్ మాధవ రెడ్డి గారి దేవేందర్ రెడ్డి, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు రాజా రమణా గౌడ్, మాజీ జడ్పిటిసి పబ్బ మహేష్ గుప్తా, మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, నాయకులు మన్సూర్, చంద్రగౌడ్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్, గురు పీఠం ట్రస్ట్ సభ్యులు శ్రీనివాస్ గౌడ్, రమణ గౌడ్, మహేష్ గుప్తా, నోముల హనుమంత్, రాజ్యం బిక్షపతి యాదవ్, మారెళ్ళ మోహన్ రావు, శాస్త్రుల వామన శర్మ, లతోపాటు యజమాన్య కుటుంబ సభ్యులు జిన్నారం మానస శివకృష్ణ, జిన్నారం మాధురి అభినవ్ భాస్కర్, విశ్వ శ్రీ లాచాంబర్స్ సిబ్బందితోపాటు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఉన్నారు.

# ఫారెస్ట్ సిబ్బందిపై గొడ్డలితో దాడికి యత్నం

- ఫిర్యాదు చేశామన్న ఎఫ్ఎస్ఓ
- దరఖాస్తు రాలేదన్న ఎస్ఐ

**శివ్వంపేట, జూన్ 4 (జనంసాక్షి) :** కొందరు ఫారెస్ట్ భూమిని ఆక్రమించడంతో ఆ ఫారెస్ట్ భూమిని స్వాధీనం చేసుకోవడానికి వెళ్ళిన ఫారెస్ట్ సిబ్బందిపై గొడ్డలితో దాడికి యత్నించిన సంఘటన శివ్వంపేట మండలం భోజ్యతండా గ్రామ పంచాయతీ పరిధిలోని జెగ్యా తండాలో చోటు చేసుకుంది. ఫారెస్ట్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం శివ్వంపేట ఫారెస్ట్ సెక్షన్ పరిధి దొంతి కంపార్ట్మెంట్ 348 లో అడవి శాఖ భూమిని తాండాకు చెందిన వారు కబ్జా చేసి దున్నారన్నా విషయం తెలుసుకున్న అటవీ సిబ్బంది తాండకు వెళ్లి కబ్జాకు పాల్పడిన అటవీ భూమిని స్వాధీనం చేసుకున్నారు. జేసీబీ తో కందకం తవ్వకం పనులు చేస్తున్న క్రమంలో అటవీ శాఖ సిబ్బందిపై తండాకు చెందిన కోల



చిట్టి గొడ్డలితో దాడి చేసేందుకు యత్నించిందని, చిట్టి భర్త రాజు అడవి సిబ్బందిపై గొడవకు దిగాడని శివ్వంపేట అటవి సెక్షన్ అధికారి శ్రీధర్ కుమార్ తెలిపారు. ఈ విషయంపై శివ్వంపేట ఎస్ఐ కి ఫిర్యాదు ఇచ్చామని సెక్షన్ అధికారి శ్రీధర్ కుమార్ తెలిపారు. గొడవ జరిగిన ఘటనపై స్థానిక ఎస్ఐ మధుకర్ రెడ్డిని సంప్రదించగా గొడవకు సంబంధించిన వివరాలు తెలియదని ఫిర్యాదు రాలేదని ఎస్ఐ తెలిపారు.

# ఉద్యోగ ఉపాధ్యాయ ఆర్థిక సమస్యలు వెంటనే పరిష్కరించాలి

- ఎస్.టి.యు.టి.ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తాహేర్ డిమాండ్

**జడ్చర్ల, జూన్ 4 (జనంసాక్షి) :** ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయ ఆర్థిక సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్.టి.యు.టి.ఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి తాహెర్ డిమాండ్ చేశారు. బుధవారం సిద్దిపేట పట్టణ కేంద్రంలో జరిగిన స్టేట్ టీచర్స్




యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పర్వత్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సదానందం గౌడ్ నేతృతంలో జరిగిన స్టేట్ ఎగ్జిక్యూటివ్ సమావేశంలో మహబూబ్ నగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి తాహేర్ పలు డిమాండ్లను పరిష్కరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 5 డిఏలు వెంటనే విడుదల చేయాలని, జడ్పీఎఫ్ పెండింగ్ మొత్తాలు, మెడికల్ రీంబర్స్‌మెంట్ బిల్లులు ఆమోదించి చెల్లింపులు చేయాలి. కొత్త పి.ఆర్.సి తక్షణం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలు పరిష్కరించని యెడల ఎస్.టి.యు.టి.ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో తదితర జిల్లాల నాయకులు తదితరులు ఉన్నారు.

# నూతన విత్తన చట్టం 2025 అమలులోకి వచ్చేలా చర్యలు చేపడతాం

- విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి

**గద్వాల నడిగడ్డ, జూన్ 4 (జనం సాక్షి) :** నూతన విత్తన చట్టం-2025 రూపకల్పనలో ప్రజల సూచనలు తీసుకొని,త్వరలో అమలులోకి వచ్చేలా చర్యలు చేపడతామని తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి తెలిపారు.బుధవారం ఐడీఓసీ మీటింగ్ హాల్ లో తెలంగాణ రాష్ట్ర ప్రభుతం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నూతన విత్తన చట్టం-2025 ముసాయిదా తయారికై ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులు, జోగులంబ గద్వాల జిల్లాకు చెందిన వ్యవసాయ శాఖ అధికారులు,సీడ్ ఆర్గనైజర్స్,విత్తన కంపని ప్రతినిధులు, డీలర్లు, రైతుల అభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న విత్తన చట్టం వల్ల విత్తనోత్పత్తి చేస్తున్న రైతులు,పంటలు సాగుచేస్తున్న రైతులు నష్టపోతున్న తీరును, దీన్ని నివారించాల్సిన అవసరాన్ని కమిటీ సభ్యులు సభ ముందు ఉంచారు. దీనిలో భాగంగా కంపెనీ ప్రతినిధులు,డీలర్లు, రైతులు తమ అభిప్రాయాలను తెలిపారు. విత్తనోత్పత్తి చేస్తున్న రైతులకు తగిన గిట్టుబాయి ధర చెల్లిస్తే ఈ



నాణ్యత ప్రమాణాలు పాటించవచ్చుని తెలిపారు. ఆర్గనైజర్ల వ్యవస్తను చట్ట బద్దం చేయాలని,రైతులతో పండిస్తున్న వారికి కనీస విద్యార్హతలను పెట్టాలని, వారికి లైసెన్సు ప్రభుత్వం ఇవ్వాలని అన్నారు. విత్తనోత్పత్తి చేస్తున్న ప్రతి రైతు వివరాలు ఆర్గనైజర్ల ద్వారా,కంపెనీల ద్వారా వ్యవసాయ శాఖ ద్వారా రీజిష్టరు చేసుకోవాలని, నష్టం జరిగినప్పుడు ఈ వివరాలను రైతులకు సాయపడేలా ఉపయోగించాలన్నారు. మన రాష్ట్రంలో ఎక్కువగా అమ్మబడుతున్న ట్రూత్ ఫుల్ విత్తనాలకు బదులు సర్టిఫైడ్ సీడ్ ను రైతులకు అందుబాటులోనికి తీసుకురావాలని అన్నారు. ఆడ,మగ పంటల ఉత్పత్తిలో ,సాగులో రైతులు నష్టపోకుండా ప్రతి సాగును వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అగ్రిమెంటు చేసుకోవాలని అన్నారు.ప్రస్తుతం ఉన్న చట్టంలోని శిక్షలను పెంచుతూ కఠినంగా ఉత్పత్తిదారులు,కంపెనీ,డీలర్లుకు అలాగే ఆర్గనైజర్లకు కూడా వర్తించేలా చేయాలన్నారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యొక్క చిత్తశుద్ధిని ఈ విత్తన చట్ట ముసాయిదా కమిటీని ఏర్పాటు చేయడంతో అర్థం చేసుకోవచ్చని తెలిపారు.అందరి సూచనలు, సలహాలు కమిటీ పరిగణలోనికి తీసుకొని విత్తన చట్టం ఏర్పాటుకావడంలో కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు డి.నర్సింహారెడ్డి, డి ఓ ఎ సంగారెడ్డి కె.శివప్రసాద్, యామ్.వి. నాగేశ్ కుమార్, రామంగానేయులు,జిల్లా వ్యవసాయ అధికారి సక్రియ నాయక్, వ్యవసాయ శాఖ ఏడిఏ లు,ఏఓలు,విత్తన కంపెనీ ప్రతినిధులు,డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

# వారసత్వం, వివిధ సమస్యల పరిష్కారం కోసమే భూ భారతి

- తహసీల్దార్ శ్రీనివాస్

**మొగుడంపల్లి, జూన్ 4 (జనం సాక్షి) :** రెవెన్యూ సమస్యల పరిష్కారానికై రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి రెవెన్యూ సదస్సును మొగుడంపల్లి మండలం ధనశ్రీ, ఖంజామల్పూర్ గ్రామంలో రెవెన్యూ అధికారులు బుధవారం నిర్వహించారు. ధనశ్రీ గ్రామంలో ఆర్డీవో రామిరెడ్డి, గిర్దవర్ సిద్ద రెడ్డి, నయాబ్ తహసిల్దార్ మహమ్మద్ జుబేర్ అమ్మద్, జూనియర్ అసిస్టెంట్ సత్యం, రికార్డ్ అసిస్టెంట్ వీరన్న, బుల్లా రాణి, రాజు అటెండర్, (ఎంఎల్‌హెచ్‌పి) అపర్ణ, ఆశ వర్కర్ వీరమణి ధనశ్రీ గ్రామంలో సమస్యల పరిష్కారానికి తమ గ్రామం వద్దకే రెవెన్యూ అధికారులు వచ్చారని గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఖంజమాల్పూర్ గ్రామంలో ఆర్డీఓ రామిరెడి, ఎమ్మార్వో శ్రీనివాస్,ఆర్ఐ సాయికిరణ్, జూనియర్ అసిస్టెంట్ లక్ష్మి, నవీన్, ఫెరోజ్, షబ్బీర్, పాల్గొన్నారు. తహసీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 100 రోజుల ప్రణాళికలో భాగంగా ధనశ్రీ, ఖంజామల్పూర్ గ్రామంలో ఉండే భూ సమస్యలు, వారసత్వం వివిధ సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం భూభారతి 2025 చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు. గ్రామంలోని ప్రజలు రైతులు భూ సమస్యల పరిష్కారానికి ఈ మంచి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



భూభారతి పోర్టల్ కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ భూముల నిర్వహణ కోసం వివాదాలు లేని తెలంగాణ లక్ష్యంగా భూ సమస్యలు శాశ్వత పరిష్కారం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతి పోర్టల్ ను మూడవ తారీకు నుంచి 20 తేది వరకు ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సును నిర్వహిస్తుంది. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకొని భూ సమస్యలు పరిష్కరించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీ నాయకులు, రైతులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

# రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

- అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జి. వెంకటేశ్వర్లు

**శ్రీరంగాపూర్, జూన్ 4 (జనంసాక్షి) :** పెబ్బేరు, శ్రీరంగాపూర్ మండలాల్లోని గ్రామాల్లో జరుగుతున్న రెవెన్యూ సదస్సులను ఆయన స్వయంగా సందర్శించి, వాటి పనితీరును పరిశీలించారు.ఈ సందర్భంగా జి. వెంకటేశ్వర్లు రెవెన్యూ సదస్సులో ప్రదర్శించిన భూ రికార్డులను, ప్రజల నుండి అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించారు. షెడ్యూల్ ప్రకారం జరగనున్న రెవెన్యూ సదస్సుల గురించి ప్రజలకు ముందుగానే సమాచారం చేరేలా చూడాలని ఆదేశించారు.అదనంగా, రెవెన్యూ సదస్సులో అందిన దరఖాస్తులను అక్కడికక్కడే పరిశీలించి, వీలైనంత వరకు అక్కడే పరిష్కరించాలని తహసిల్దార్లను జి. వెంకటేశ్వర్లు ఆదేశించారు. అన్ని దరఖాస్తులను త్వరగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కూడా ఆయన స్పష్టం చేశారు. నోటీసులు జారీ చేయాల్సిన కేసులకు వెంటనే నోటీసులు ఇచ్చి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. జి. వెంకటేశ్వర్లు స్వయంగా ప్రజలతో మాట్లాడి వారి సమస్యలనుఅడిగితెలుసుకున్నారు.భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు - ప్రజలకు పూర్తి సహాయం. ప్రజలకు దరఖాస్తు ఫారాలను అర్థమయ్యే రీతిలో వివరించి, ఎటువంటి తప్పులు లేకుండా



సరిగ్గా పూరించేలా వారికి పూర్తి సహాయం అందించాలని సూచించారు. ప్రతి ఫారంలోని ప్రతి విభాగాన్ని స్పష్టంగా వివరించి, అవసరమైన పత్రాలపై పూర్తి స్పష్టత ఇవ్వాలని ఆదేశించారు. ప్రజలకు ఏమైనా సందేహాలు ఉంటే ఓపికగా విని, వాటికి సరైన సమాధానాలు ఇవ్వాలని, మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని ఆయన స్పష్టం చేశారు.

# భూభారతి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ ప్రతినిధి, జూన్ 4(జనంసాక్షి):** భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టం అమలులో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. బుధవారం వరంగల్ మండలం ఏనుమాముల, ఖిలా వరంగల్ మండలం అల్లిపూర్ గ్రామాలలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులలో కలెక్టర్ పాల్గొన్నారు. రైతులతో ముఖాముఖి మాట్లాడి, వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. భూ భారతి చట్టంలోని అంశాలను వివరిస్తూ, రైతుల సందేహాలను నివృత్తి చేశారు. భూ సమస్యలు పరిష్కరించి, రైతులకు వారి భూములపై పూర్తి హక్కులు కల్పించేందుకే ప్రభుత్వం భూభారతి చట్టం అమలు చేస్తోందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇప్పటికే వర్ధన్నపేట మండలంలో పైలెట్ ప్రాతిపదికన రెవెన్యూ సదస్సులు జరిపి, క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేశామని అన్నారు. ప్రస్తుతం జిల్లాలోని 12 మండలాలోని రెవెన్యూ గ్రామాలలో ఈ నెల 20వ తేదీ వరకు సదస్సులు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించామని తెలిపారు. తహసీల్దార్, నాయబ్ తహసీల్దార్ల నేతృత్వంలో రెండు బృందాలను నెలకొల్పి, ప్రతి రోజు ప్రతి మండలంలో రెండు గ్రామాలలో రెవెన్యూ సదస్సులు జరిపేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ తెలిపారు. భూ రికార్డులలో పేరు తప్పులు, విస్తీర్ణం హెచ్చు తగ్గులు, వారసత్వ భూములు, భూ స్వభావం తప్పులు, నిషేధిత జాబితాలో ఉన్న భూ సమస్యలు, సర్వే నెంబర్ మిస్సింగ్, పట్టా పాస్ బుక్స్ లేకపోవడం, ప్రభుత్వ భూములను నవీకరించడం, సాదాబైనామా కేసులు, హద్దుల నిర్ధారణ, పార్ట్-బిలో చేర్చిన భూముల సమస్యలు, భూసేకరణ కేసులు తదితర భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు సదస్సులలో స్వీకరించి భూభారతి కొత్త చట్టం ప్రకారం అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, నిర్దేశిత గడువు లోపు సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. నిర్ణీత షెడ్యూల్ ను అనుసరిస్తూ ఆయా గ్రామాలలో అధికారులు ఉదయం నుండి సాయంత్రం వరకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. రెవెన్యూ సదస్సుల్లో ప్రభుత్వపరంగా నిర్ణీత ప్రొఫార్మాలో ప్రింట్ చేసిన దరఖాస్తులను అందజేయడం జరుగుతుందన్నారు. దరఖాస్తుల స్వీకరణ పూర్తయిన అనంతరం క్షేత్రస్థాయి పరిశీలన, విచారణ కోసం వచ్చే రెవెన్యూ బృందాలకు సహకరించాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ, హెల్ప్ డెస్క్, జనరల్ డెస్క్ ల వద్ద సదుపాయాలు, సిబ్బంది పనితీరును కలెక్టర్ పరిశీలన జరిపి, సమర్ధ నిర్వహణకు అధికారులకు పలు సూచనలు చేశారు. అర్జీలు సమర్పించేందుకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. భూ సంబంధిత సమస్యలు ఉన్న వారు నిర్ణీత ప్రొఫార్మా లో సరైన విధంగా దరఖాస్తు చేసుకునేలా సహకారం అందించాలని హెల్ప్ డెస్క్ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో తహశీల్దార్లు ఇక్బాల్, నాగేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లు రాలేదని మహిళల ఆందోళన



**మంగపేట జూన్ 04(జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు సొంత ఇంటి కల నెరవేర్చాలనే ఉద్దేశంతో పల్లెల్లో కేవలం అసలైన అర్హులకే ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని ఆదేశించగా మండలం చెరుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో అనర్హులకే ఇందిరమ్మ ఇళ్లను ఇచ్చారని మహిళలు ఆందోళన చేపట్టారు. గ్రామంలోని ఎస్టి కాలనీకి చెందిన కొందరు మహిళలు ఆందోళన చేస్తూ ఇందిరమ్మ ఇళ్లకు మీరు అర్హులైనారు అని సంతకాలు కూడా తీసుకోవడం జరిగిందని తీరా ఇండ్ల పత్రాల పంపిణీలో తమ పేర్లు లేకపోవడంతో అసలు ఏం జరిగిందని తెలియకుండా ఉందని ఆవేదన వ్యక్తపరిచారు. అలాగే అర్హులుగా ప్రకటించిన వారికి భూములు, వాహనాలు, బిల్డింగ్లు ఉన్నవారికే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయటం ఏంటి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే ఒకే ఇంట్లో ముగ్గురికి సైతం ఇళ్లు కేటాయించారని, గుడిసెల్లో నివసిస్తున్న తమకు ఇళ్లు ఇవ్వకపోవడం ఏంటని ప్రశ్నించారు. లిస్టులో పేరు వచ్చినప్పటికీ ఇళ్లు కేటాయించలేదని ఈ విషయంపై మంత్రి సీతక్కను నిలదీస్తామన్నారు.

# భూ సమస్యల దరఖాస్తుల కోసం రైతుల బారులు!

- రెవెన్యూ అధికారులు, సిబ్బంది పనితీరు పై రైతుల అసహనం



**చెన్నారావుపేట, జూన్ 4 (జనంసాక్షి) :** తమ భూ సమస్యలను పరిష్కరించుకోవడానికి రైతులు రెవెన్యూ సదస్సు వద్ద బారులు తీరి నిలబడ్డారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూభారతి చట్టాన్ని ప్రవేశపెట్టి భూ సమస్యలను పరిష్కరించడానికి గ్రామాలలో రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేసింది. బుధవారం చెన్నారావుపేట జిల్లా పరిషత్ పాఠశాలలో భూభారతి చట్టం ద్వారా భూ సమస్యల పరిష్కారం కోసం స్థానిక రెవెన్యూ అధికారులు రెవెన్యూ సదస్సును నిర్వహించింది. ఈ రెవెన్యూ సదస్సులో రైతులు తమ భూ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బారులు తీరి నిలబడ్డారు. రెవెన్యూ అధికారులు దరఖాస్తులను స్వీకరించి వెంటనే రసీదులు ఇవ్వాల్సి ఉందన్నారు. కాని దరఖాస్తులను స్వీకరించడంలో రసీదులు ఇవ్వడంలో ఆలస్యం చేస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దరఖాస్తులను రాసుకొని తీసుకెళితే వాటిని తీసుకోకుండా తిరస్కరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో పొద్దంతా రెవెన్యూ సదస్సు వద్దనే బారులు తీరి నిలబడాల్సి వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాక రెవెన్యూ అధికారులు, సిబ్బంది పనితీరు పట్ల వారితో వాగ్వివాదానికి దిగి నిలదీశారు.

# మాదకద్రవ్యాల నిర్మూలనపై విస్తృత ప్రచారం చేయాలి

- నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ రూరల్, జూన్4(జనం సాక్షి) :** మాదకద్రవ్యాల నిర్మూలన పై విస్తృతంగా ప్రచారం చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. బుధవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయ ఆవరణలో మాదకద్రవ్యాల నిర్మూలన,బాల కార్మిక నిర్మూలన,బాల్య వివాహాల నియంత్రణ,ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ చట్టం,సీనియర్ సిటిజన్స్ సంక్షేమ చట్టాలపై ప్రజలలో చైతన్యం కలిగించేందుకు ఏర్పాటు చేసిన ప్రగతి రథం-ప్రజా చైతన్యం,ప్రచార రథయాత్ర వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్మల్ జిల్లా మాదకద్రవ్యాల రహిత జిల్లాగా మారే దిశగా సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలోని తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందాలు మరింత ప్రభావవంతంగా ప్రచారం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. మాదకద్రవ్యాల కారణంగా యువత భవిష్యత్తు అంధకారంలో నిత్యం నాశనమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. జూన్ 2న మాదకద్రవ్యాల రహిత నిర్మల్ జిల్లా స్థాపన కార్యక్రమాన్ని చేపట్టిన నేపథ్యంలో నెల రోజుల పాటు జిల్లావ్యాప్తంగా పట్టణ,గ్రామీణ ప్రాంతాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. సీజనల్ వ్యాధుల నియంత్రణ,ప్రభుత్వ అభివృద్ధి,సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై ప్రజల్లో చైతన్యం కలిగించేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని కళాకారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారి ఇ.విష్ణువర్ధన్, కళాకారులు సుదర్శన్, నాగరాజు, రఘునాథ్,లక్ష్మణ్, సుదర్శన్,మాధవి, తదితరులు పాల్గొన్నారు.

## ములుగు జిల్లా లో పర్యటించిన కేంద్ర మంత్రిత్వ శాఖ, ఐ అండ్ బి జాయింట్ సెక్రటరీ ప్రీథుల్ కుమార్



**ములుగు బ్యూరో, జూన్04 (జనం సాక్షి):** బుదవారం ములుగు జిల్లా పర్యటనలో భాగంగా కలెక్టరేట్ కు వెచ్చేసిన కేంద్ర మంత్రిత్వ శాఖ,ఐ అండ్ బి,జాయింట్ సెక్రటరీ ప్రీథుల్ కుమార్ కి జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. మర్యాదపూర్వకంగా పూల మొక్కను అందించి సాదర స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ తన ఛాంబర్ లో జాయింట్ సెక్రటరీ తో కలసి జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కేంద్ర సంక్షేమ పథకాలు ప్రధానమంత్రి కృషి సించాయి యోజన (పీఎంకేఎస్వై.),జల్ జీవన్ మిషన్ (జేజేఎం) స్కీమ్ గ్రౌండ్ ఇన్స్పెక్షన్ లో భాగంగా జాయింట్ సెక్రటరీ రెండు రోజుల పర్యటన కు వచ్చారని తెలిపారు. జిల్లాలో అమలు అవుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి కలెక్టర్ జాయింట్ సెక్రటరీకి వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, ఆర్డబ్లు ఎస్ఎస్ఈ మల్లేశం,వ్యవసాయ శాఖ అధికారి సురేష్ కుమార్,ఉద్యానవ శాఖ అధికారి సంజీవ రావు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## నీటిలో బాతుల హాయ్.. హాయ్!

**చెన్నారావుపేట, జూన్ 4 (జనంసాక్షి) :** గత మూడు రోజులుగా ఒకవైపు మండుతున్న ఎండలు... మరోవైపు తీవ్రమైన ఉక్క పోత... వీటి నుండి మనుషులే ఎండ వేడిమిని తట్టుకోలేక బయటకి రాలేకపోతున్నారు. పశుపక్ష్యాదులు సైతం ఎండ వేడిమిని తట్టుకోలేక దాహంతో అలమటిస్తున్నాయి. చెన్నారావుపేట గ్రామ శివారులోని బతుకమ్మ మోరి వద్ద ఉన్న నీటిలో వేలాది బాతులు ఒకసారిగా గుంపులు గుంపులుగా చేరి తమ దాహాన్ని తీర్చుకొని ఎండ వేడిమి నుండి ఉపశమనం పొందడానికి ఇలా కొద్దిసేపు బుధవారం మధ్యాహ్నం సమయంలో నీటిలో హాయి హాయిగా గడిపాయి.

## వారితో బిఆర్ఎస్ పార్టీతో ఎలాంటి సంబంధం లేదు

- బిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి నమిండ్ల సురేష్

**చెన్నారావుపేట, జూన్ 4 (జనం సాక్షి):** కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి బిఆర్ఎస్ పార్టీతో ఎలాంటి సంబంధం లేదని బిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి, లింగాపురం గ్రామానికి చెందిన నమిండ్ల సురేష్ బుధవారం తెలిపారు. లింగాపురం గ్రామానికి చెందిన వేములపల్లి కుమార స్వామి, శివకృష్ణ, ముదిగొండ రాజులు బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరారని ప్రకటించుకున్నారని అసలు వారికి బిఆర్ఎస్ పార్టీతో ఎలాంటి సంబంధం లేదన్నారు.

## ఉద్యోగికి బదిలీలు సర్వసాధారణమే

- ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్ రెడ్డి



**భూపాలపల్లి, జూన్ 4 (జనం సాక్షి):** భూపాలపల్లి ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ కార్యాలయంలో బదిలీపై వెళ్తున్న కేటీకే 5 ఇంక్లైన్ మేనాజర్ జాకీర్ హుస్సేన్‌ను ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్ రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ జాకీర్ హుస్సేన్ చాలా సేవ చేశారని, ఉత్పత్తి ఉత్పాదకతలను చాలా వరకు మెరుగు పరిచారు, ఆయన లేని లోటు సింగరేణి భూపాలపల్లి ఏరియాకు లోటు కలుగుతుందని జిఎం పేర్కొన్నారు. భూగర్భ గనులలో భూపాలపల్లి ఏరియా లో నే కేటీకే 5 ఇంక్లైన్ ను నెంబర్ -1 వుంచడం లో జాకీర్ హుస్సేన్ వల్లనే సాధ్యమైనదని, సేఫ్టీ వీక్ లను గని ఆవరణలోఘనంగా నిర్వహించే వారని,ఉద్యోగులను ఉత్పత్తి ఉత్పాదకతల పై ఉత్తేజపరిచేవారని సీఎంఓఐ వైస్ ప్రెసిడెంట్ చాలా కార్యక్రమాలు విజయవంతం చేశారని తెలియజేశారు. ఉద్యోగికి బదిలీ అనేది సహజమని ఎక్కడికి వెళ్లినా సింగరేణి సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ ఎర్రన్న, ఎన్విరల్ న్మెంట్ అధికారి పోషమల్లు, పర్సనల్ మేనేజర్ కావూరి మారుతి, ఫైనాన్స్ మేనాజర్ సురేఖ, ఐటీ మేనాజర్ రజిని తదితరులు పాల్గొన్నారు.

# విత్తనాలు అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు

- ప్రభుత్వం గుర్తించిన నాణ్యమైన విత్తనాలను మాత్రమే రైతులకు అమ్మాలి
- కల్తీ, నాణ్యత లేని విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు
- ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



**ములుగు ప్రతినిధి, జూన్ 04(జనంసాక్షి) :** ప్రభుత్వం గుర్తించిన నాణ్యమైన విత్తనాలను మాత్రమే రైతులకు అమ్మాలని, విత్తనాలు అధిక ధరలకు, కల్తీ, నాణ్యత లేని విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సూచించారు. బుదవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన వ్యవసాయ శాఖ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ములుగు జిల్లాలోని సమస్త విత్తన ఎరువుల, పురుగు మందుల డీలర్ల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విత్తన డీలర్లు అందరూ కూడా ప్రభుత్వ ఆదేశానుసారము వ్యవసాయ శాఖ సూచనలు మేరకు విత్తన కొనుగోలు చేసిన ప్రతి రైతుకి బిల్ ఇవ్వవలసిందిగా అట్టి బిల్లు మీద లాట్ నెంబర్, ఎక్స్పైరీ డేట్ రైతు యొక్క పూర్తి వివరాలు రాయాలని దాని మీద తప్పకుండా విత్తన షాపు యజమాని, రైతు సంతకము తీసుకోవాలని ఆదేశించారు. ఇట్టి బిల్లును పంట కాలువ అయ్యే వరకు కూడా భద్రపరుచుకోవాలని ప్రభుత్వ అనుమతి పొందిన విత్తనాలను మాత్రమే అమ్మకాలు చేయాలని అదేవిధంగా వరి పంటకు సంబంధించి కేఎన్ఎం 1638, ఎంటుయు 1224 రకాలు అవుట్ టన్ను సరిగా రావడం లేదని, నూక శాతం ఎక్కువగా వస్తున్న వల్ల ఆ రకాలను తక్కువ విస్తీర్ణంలో సాగు చేసే విధంగా చూడవలసిందిగా కోరారు. పోలీస్, వ్యవసాయ శాఖలతో టాస్కోర్స్ ఏర్పాటు చేయడం జరిగిందని ఫోర్స్ బృందాలు ములుగు జిల్లాలోని ప్రతి విత్తన షాపులని విధిగా తనిఖీ చేయాలని ఆకస్మిక దాడులు నిర్వహించాలని ఏదైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలు వారి దృష్టికి వచ్చినచో కఠినమైన చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి సురేష్ కుమార్ మాట్లాడుతూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలు గాని చట్ట ఉల్లంఘన చేసినచో కఠిన చర్యలు తీసుకోబడతాయని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవిన్యూ సిహెచ్ మహేందర్ జి, ఎన్ రవీందర్ డిఎస్పీ, సహాయ వ్యవసాయ సంచాలకులు అవినాష్ వర్మ, ఏటూరునాగారం, టాస్కోర్స్ సిఐ రమేష్, సమస్త మండల వ్యవసాయ అధికారులు, ఫర్టిలైజర్ సీడ్, పెస్టిసైడ్ దుకాణ యజమానులు తదితరులు పాల్గొన్నారు.

# మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఏసీబీ దాడి, ఇద్దరు అరెస్ట్

- సర్వే కోసం లంచం డిమాండ్
- 10 వేల నగదు, 16,500 ఫోన్ పే ద్వారా చెల్లింపు
- మరో 30 వేల డిమాండ్






**మంచిర్యాల ప్రతినిధి, జూన్ 4 (జనంసాక్షి) :** మంచిర్యాల జిల్లా కేంద్రంలో మండల సర్వేయర్ , ఆమె అసిస్టెంట్ ఇద్దరు భూముల కొలతల కోసం టీ పన్ను(ఫీజ్) కట్టి మెజర్‌మెంట్ చేయాలని పలుమార్లు విన్నవించిన లంచం ఇవ్వందే భూములు మెజర్మెంట్ చేసేది లేదని తెగేసి చెప్పడంతో డబ్బులు చెల్లించిన మిగతా డబ్బులు చెల్లించే వరకు భూమి మెజర్మెంట్ చేసేది లేదని చెప్పడంతో బాధితులు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. కరీంనగర్ ఏసీబీ డిఎస్పి విజయకుమార్ కథనం ప్రకారం.. మంచిర్యాల మండల పరిధిలోని ఓ రైతు తనకున్న భూమిని కొలతలు చేసి హద్దులు నిర్ణయించాలని మండల సర్వేయర్ మంజులను సంప్రదించారని తెలిపారు. మండల సర్వేయర్ మంజుల ఆమె అసిస్టెంట్ చైన్ మాన్ ఉదయ్ ద్వారా లంచం 80 వేల రూపాయలు డబ్బులు డిమాండ్ చేయడంతో భాదితులు ఫోన్ పే ద్వారా ఆమె అసిస్టెంట్ కు 16 500 ఫోన్ పే ద్వారా చెల్లించారు. మరో పది వేల రూపాయలు నగదు ఇవ్వడంతో అయినా భూమి సర్వే కొలతలకు రాలేదు. చైన్ మాన్ ఉదయ్ మళ్ళీ 30 వేల ఇవ్వాలని చెప్పడంతో చెప్పడంతో బాధితులు చేసేదేమి లేక ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఏసీబీ అధికారులు తమ వాయిస్ రికార్డ్ ద్వారా చైర్మన్, బాధితుడు సంభాషణ రికార్డు చేసి బుధవారం సాయంత్రం పనిలో నిర్లక్ష్యం లంచం తీసుకుంటున్నారని ఈ మేరకు ప్రాపర్ విచారణ చేసి మంచిర్యాల రెవెన్యూ కార్యాలయం నుండి సర్వేయర్ మంజులను మండల సర్వేయర్ మంజులను, ఆమె అసిస్టెంట్ చైన్ మాన్ ఉదయ్ ఇద్దరినీ అరెస్ట్ చేశామని తెలిపారు. రేపు కోర్టులో హాజరు పరుస్తామని అన్నారు

# గురుకుల విద్యాలయాలకు ప్రభుత్వం పెద్దపీట

- సీఎం ప్రతిభా పురస్కారం అందుకున్న
- నందీష్ ను అభినందించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**పాలకుర్తి, జూన్ 04 (జనంసాక్షి) :** సంక్షేమ వసతి గృహాలకు, గురుకుల విద్యాలయాలకు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పెద్ద పీట వేస్తూ ప్రాధాన్యత కల్పిస్తుందని ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని బీసీ సంక్షేమ బాలుర వసతి గృహం విద్యార్థి ఈగ నందీష్ సిద్ధార్థ విద్యాలయంలో పదవ తరగతి చదివి పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో 557 మార్కులు సాధించి, ఈనెల 3న హైదరాబాదులో జరిగిన సీఎం ప్రతిభ పురస్కారానికి ఎంపికై ప్రతిభా పురస్కారాన్ని బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఈ శ్రీధర్. బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాల మాయాదేవి లు సీఎం ప్రతిభా పురస్కారాన్ని నందీష్ కు అందజేసిన విషయం తెలిసిందే. సీఎం ప్రతిభ పురస్కారంతోపాటు మెమొంటోను, 10000 నగదు ప్రోత్సాకాన్ని స్వీకరించిన నందీష్ ను బుధవారం మండల కేంద్రంలో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ పాలకుర్తి నియోజకవర్గం బీసీ సంక్షేమ బాలుర వసతి గృహానికి చెందిన సందీప్ జనగామ జిల్లా నుండి ఎంపికై సీఎం ప్రతిభా పురస్కారాన్ని పొందడం అభినందనీయమన్నారు. సంక్షేమ వసతి గృహాల్లో, గురుకుల విద్యాలయాల్లో విద్యార్థినీ, విద్యార్థులను ప్రోత్సహించేందుకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యతనిస్తూ విద్యార్థినీ విద్యార్థుల సంక్షేమం కోసం డైట్ చార్జీలు 40 శాతానికి పెంచి ప్రోత్సహిస్తుందని తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థిని, విద్యార్థులు సంక్షేమ వసతి గృహాలను సద్వినియోగం చేసుకొని, విద్యలో రాణించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. బీసీ బాలుర సంక్షేమ వసతి గృహంలో ఉంటూ సిద్ధార్థ విద్యాలయంలో చదువుతూ విద్యలో ప్రతిభను కనబరిచి 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో అధిక మార్కులు సాధించేందుకు కృషిచేసిన సిద్ధార్థ విద్యాలయం ప్రిన్సిపాల్ జక్కుల రవీందర్, కరస్పాండెంట్ జక్కుల ఊర్మిళ తో పాటు ఉపాధ్యాయులను అభినందించారు. వసతి గృహాల్లో ఉండే విద్యార్థులు విద్యలో రాణించాలని, వసతి గృహాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిద్ధార్థ విద్యాలయం ప్రిన్సిపాల్ జక్కుల రవీందర్ లతోపాటు విద్యార్థి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
05 జూన్ 2025

# రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

- వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్




**బొంరాస్‌పేట, జూన్ 4 (జనం సాక్షి) :** ప్రభుత్వం నిర్వహిస్తున్న భూ భారతి రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్ అన్నారు.బుధవారం మండల పరిధిలోని రేగడి మైలారం గ్రామంలో కొనసాగుతున్న భూభారతి రెవెన్యూ సదస్సులో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్‌తో కలిసి పాల్గొన్నారు.అనంతరం రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు.రేగడి మైలారం గ్రామంలో 32 దరఖాస్తులు రావడం జరిగిందని తహసిల్దార్ పద్మావతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శిరీష,రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# కేపీహెచ్‌బీలో అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలు

- అక్రమ షెడ్డు, హెూటల్‌ను ప్రారంభించిన కార్పొరేటర్
- భయం గుప్పిట్లో టౌన్ ప్లానింగ్ అధికారులు
- భరి తెగించి బజాట్లో నిల్చుని అంగరంగ వైభవంగా ప్రారంభమైన అక్రమ షెడ్డు

**కూకట్‌పల్లి, జూన్ 4 (జనంసాక్షి) :** కేపిహెచ్‌బి కాలనీ డివిజన్ లో అక్రమ షెడ్లు, అక్రమ నిర్మాణాలకు అడ్డు అదుపు లేకుండా పోతోంది. కామర్శియల్ ఏరియా హాస్టల్ లు ఆఫసుల తో రద్దీ గా ఉండే ప్రాంతం కావడం తో ఎలాంటి వ్యాపారాలు అయిన మూడు పువ్వులు ఆరు కాయలు గా కొనసాగుతాయి. దీన్నే అదునుగా చేసుకొని కొంతమంది వ్యాపారాలు నిబంధనలకు విరుద్ధంగా ఇనుము ను ఉపయోగించి అక్రమ షెడ్లు నిర్మించి హెూటల్లు నిర్మించి డ్రైనేజీ, ట్రాఫిక్ సమస్యలకు కారణం అవుతున్నారు. స్థానిక నాయకులను మచ్చిక చేసుకొని వారిని ముఖ్య అతిథులు గా పిలిచి సన్మానించి ప్రారంభోత్సవాలు చేపించుకుంటున్నారు. దానికి నిదర్శనమే కేపిహెచ్ బి డివిజన్ 5వ ఫేజ్ లో జగన్ గురూజీ ఆశ్రమం పక్కన బరితెగించి బజాట్లో నిల్చుని ఇటీవల ఓపెన్ అయిన అక్రమ షెడ్డు లోని హెూటల్ ను స్థానిక కార్పొరేటర్ పక్క డివిజన్ మాజీ కార్పొరేటర్



లు కలిసి ప్రారంభించి, అక్రమ షెడ్డును అక్రమార్కులను ప్రోత్సహిస్తున్నారు. ఇదంతా ఆడుకోవాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులు మాత్రం అట్టి అక్రమ నిర్మాణ దారుల వెనుక పెద్దమనుషులు ఉన్నారని భయపడి చర్యలు తీసుకోక పోగా అటు వైపు తిరిగి కూడా చూడక పోవడం ఆశ్చర్యానికి గురి చేస్తుంది. సామాన్య ప్రజలు ల పై కొరడాలు ఝులిపించే అధికారులు ఇలాంటి భారీ అక్రమ షెడ్డులు ల విషయం లో స్పందించక పోవటంపై పలు భయపడ్డారా లేక వారిచే ముడుపులకు ఆశపడ్డారా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. నిబంధనలను కాపాడవల్సిన ప్రజా ప్రతినిధులు, అధికారులు ఇలాంటి వారిని ప్రోత్సాహించడం సరికాదు అని స్థానికులు గుసగుస లాడు కుంటున్నారు. ఇప్పటికైనా అలాంటి అక్రమ షెడ్డు ను సీజ్ చేసి అక్రమ నిర్మాణదారుని పై చర్యలు తీసుకుంటే అధికారులపై జనాలకు ఇంతో అంతో నమ్మకం వస్తుంది.

### షెడ్ల వల్ల కలిగే నష్టాలు

రోడ్లపై ఉన్న షెడ్లు తాత్కాలిక నిర్మాణాలు, ఈ షెడ్లు వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగిస్తుంటాయి. రోడ్లపై లేదా పక్కన షెడ్లు పెట్టడం వలన వాహనాలు రాకపోకలు దెబ్బతింటాయి. దీనివల్ల ట్రాఫిక్ జామ్ రోడ్డు ప్రమాదాలు జరగవచ్చు. ఫుట్పాత్ను ఆక్రమించడం వలన పాదచారులు రోడ్డుపై నడవాల్సి వస్తుంది ఇద ప్రమాదానికి దారితీస్తుంది. అనుమతులు లేకుండా షెడ్డు నిర్మించడం అక్రమం. షెడ్లు వల్ల మురికి నిల్వ చేస్తే దోమలు కీటకాలు పెరుగుదల పెరుగుదల వల్ల వ్యాధులు వ్యాపిస్తాయి. వాతావరణాన్ని కలుషితం చేస్తాయి. ఐరన్ షెడ్లు వేడి ఎక్కువగా ప్రసరింప చేస్తాయి. తక్కువ నిర్మాణం నాణ్యత వలన ప్రమాదకరంగా మారవచ్చు. అనాధికారికంగా నిర్మించిన షెడ్యూల్ ట్రాఫిక్ అంతరాయం కలిగించడమే కాక ప్రజలకు నష్టాన్ని కలిగిస్తాయి.

# అర్హులందరికీ దశల వారీగా ఇందిరమ్మ ఇండ్లు

- ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీలో మంత్రి పొంగులేటి



**ఖమ్మం రూరల్, జూన్ 4 (జనం సాక్షి) :** అర్హులైన నిరుపేదలందరికీ దశల వారీగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని, ఇది నిరంతర ప్రక్రియ అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. బుధవారం టి.సి.వి. రెడ్డి ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో ఏదులాపురం మున్సిపాలిటీ ప్రాంత లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్ లతో కలిసి పంపిణీ చేసారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.... ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు అందుకున్న లబ్ధిదారుల ముఖాలలో ఆనందం చూస్తుంటే తాను భావోద్వేగానికి లోనయ్యానని అన్నారు. ప్రజలకు ఉపయోగపడే పని చేస్తే వారి నుంచి వచ్చే స్పందన అద్భుతంగా ఉంటుందని అన్నారు. గత పాలకులు ఎమ్మెల్యే నివాసాలు, ప్రభుత్వ భవనాల మీద పెట్టిన శ్రద్ధ పేద ప్రజల ఇండ్లపై పెట్ట లేదని, పేద ప్రజల సొంతింటి కలను విస్మరించిందని అన్నారు. రూ. 22 వేల 500 కోట్ల రూపాయలను పేద ప్రజల సొంతింటి కల కోసం ప్రజా ప్రభుత్వం ఈ సంవత్సరం కేటాయించిందని, ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నప్పటికీ పేదల సంక్షేమం అజెండాగా పాలన కొనసాగిస్తున్నామని అన్నారు. గుడిసెలో ఉంటున్న నిరుపేదలకు మొదటి విడతలో ప్రభుత్వం ఇండ్లు మంజూరు చేస్తుందని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం పారదర్శకంగా అమలు చేయాలని, ఎక్కడ లంచాలకు ఆస్కారం లేకుండా ప్రతి నియోజకవర్గానికి 3 వేల 500 ఇండ్లు మంజూరు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. రాజకీయాలకు అతీతంగా నిరుపేదలకు మొదటి విడతలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వం పెట్టె ప్రతి రూపాయి పేదలకు ఉపయోగపడాలని తాము ప్రయత్నిస్తున్నా మని అన్నారు. 20 లక్షల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. కార్యక్రమం లో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ రాష్ట్ర మహిళా నాయకురాలు మద్దినేని స్వర్ణకుమారి, ఆర్డిఓ నరసింహారావు, ఎదలోపురం మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి, మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ బైరు హరినాథ్ బాబు, తోట చిన్న వెంకటరెడ్డి, మద్ది మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఫెర్టిలైజర్ షాపులను తనిఖీ చేసిన కలెక్టర్



**చిన్నశంకరంపేట, జూన్ 4 (జనం సాక్షి) :** కొరివిపల్లి గ్రామంలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ గ్రామసభను మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పరిశీలించిన అనంతరం చిన్న శంకరంపేట మండల కేంద్రంలో రేషన్ షాపులను తనిఖీ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పేదవారికి కూడా సన్న బియ్యం పంపిణీ చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నదని, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. వినియోగదారులతో నేరుగా మాట్లాడుతూ రేషన్ సక్రమంగా అందుతున్నదా అని అడిగి తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు.బియ్యం నాణ్యతను పరిశీలించారు. గౌలపల్లి ఫర్టిలైజర్ ఫ్టిసైడ్ షాపులను తనిఖీ చేసి నాన్యమైన సీడ్ గాని మందులు గాని అమ్మాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ అబ్దుల్ మన్నన్ తదితరులు పాల్గొన్నారు.

# 'నజరీ నక్ష'పై సమీక్ష

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ క్రాంతి వల్లూరు



**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 4 (జనం సాక్షి) :** నజరీ నక్ష (పోలింగ్ కేంద్రాల భౌగోళిక మ్యాప్ ) పై అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు నేతృత్వంలో బుధవారం కలెక్టర్ నివాస సముదాయంలో "నజరీ నక్ష" (పోలింగ్ కేంద్రాల భౌగోళిక మ్యాప్)పై పటాన్చెరు నియోజకవర్గం పరిధిలోని (రెవిన్యూ అధికారులు) ఎన్నికల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో రెవిన్యూ అధికారులు, పోలింగ్ కేంద్రాల వివరాలను వివరించారు. ఈ సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ.... గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో బిఎల్ఒలు పోలింగ్ కేంద్రాల భౌగోళిక సమాచారం, సౌకర్యాలు, రవాణా మార్గాల నజరీ నక్ష రూపొందించాలని ఆదేశించారు. నజరీ నక్ష రూపాకల్పన లో కొత్త గా ఏర్పడే పోలింగ్ కేంద్రాలకు బిఎల్ఒలను నియమించాలని పేర్కొన్నారు.బి ఎల్ ఒ లు ఓటర్ల ఇంటింటి సర్వే నిర్వహణ, పోలింగ్ కేంద్రాల పెంపు వివరాలు, కుటుంబ సభ్యులు అందరూ ఒకే పోలింగ్ కేంద్రం లో ఓటు హక్కు వినియోగించు కోనేలా తీసుకున్న చర్యల వివరాలు అందించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలలో అవసరాలను అవసరాలకు అనుగుణంగా తగిన మార్గదర్శకాలు రూపొందించాలని తెలియజేశారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రజలుకు మరింత సౌకర్యవంతమైన పోలింగ్ కేంద్రాల ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి బూత్ యొక్క భౌగోళిక స్థితిని ఖచ్చితంగా గుర్తించాలని,వృద్ధులు , దివ్యాంగుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సమావేశం లో అదనపు కలెక్టర్ ( రెవిన్యూ) మాధురి, పటాన్చెరు నియోజకవర్గం ప్రత్యేక అధికారి దేవుజా, పటాన్చెరువు నియోజవర్గ పరిధిలోని తహసిల్దార్లు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అవినీతిలో బీఆర్ఎస్‌ను మించిపోయిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం

- బిజెపి తెలంగాణ ఇన్చార్జ్ అభయ్ పాటిల్

**శంషాబాద్, జూన్ 4 (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు రాజ్ భూపాల్ గౌడ్ ఆధ్వర్యంలో 11 సంవత్సరాల బిజెపి ప్రభుత్వం సాధించిన విజయాలతో పాటు పరిపాలన విధానాలు సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు చేరే విధంగా రంగారెడ్డి జిల్లాకు సంబంధించిన అసెంబ్లీ కన్వీనర్లు డివిజన్ అధ్యక్షులు ముఖ్య నాయకులతో జిల్లా కార్యశాల శిక్షణ తరగతులను శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రైవేటు హెూటల్లో బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కర్ణాటక రాష్ట్రానికి సంబంధించిన ఎమ్మెల్యే తెలంగాణ రాష్ట్ర బిజెపి ఇన్చార్జ్ అభయ్ పాటిల్ హాజరయ్యారు. ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ యావత్ ప్రపంచం భారతదేశం వైపు చూస్తుంది. టెక్నాలజీ రంగంలో ఇతర దేశాలను వెనక్కు నెట్టుతు భారతదేశం ముందుకెళు ంది. యుద్ధంలో స్వదేశీ టెక్నాలజీతో వాడిన ఆయుధాలు ఇతర దేశాలను అబ్రపరిచాయన్నారు. ఎవరు ఊహించని రీతిలో యుద్ధంలో స్వదేశీ టెక్నాలజీని వినియోగించాము విజయం సాధించాము. భారతదేశ స్వదేశీ ఆయుధాలకు నేడు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ పెరిగిందన్నారు. అది చూసి శత్రువు దేశాలు ఓర్వలేకపోతున్నాయి. భవిష్యత్తులో అన్ని రంగాల్లో భారతదేశం ముందు వరుసలో బిజెపి ప్రభుత్వం నిలబెడుతుందన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర బిజెపి ఇంచార్జ్ అభయ్ పాటిల్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పది సంవత్సరాల్లో జరిగిన అవినీతిని కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంవత్సరంలోనే వారిని మించిపోయారు. సంక్షేమ పథకాల పేరుతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ పెద్దలకు నాయకులకు తన పరివారానికి కావలసినంత ప్రజాధనాన్ని దోచుపెడుతున్నాడని అయిన ఆరోపించారు. గత ప్రభుత్వంలో ఉన్న మాజీ మంత్రులను బిఆర్ఎస్ పార్టీ నాయకులను అవినీతిపరులని ప్రచారం నిర్వహించారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన పది సంవత్సరాల అవినీతిని సంవత్సరంలోనే వారిని మించిపోయారని దుయ్యబట్టారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి ఈరోజు చింతిస్తున్నారు. ఉచిత హామీలకు ఆకర్షితులై తెలంగాణ ప్రజలు ఓటు వేశారు. ప్రభుత్వం ఉచితాలను గాలికి వదిలేసి అందిన కాడికి కాంగ్రెస్ కుటుంబంలోని సభ్యులు నాయకులు దోచుకుంటున్నారు. ఆపరేషన్ సింధూరపై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను




ఖండించారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో యుద్ధాలు జరిగాయి. పాకిస్తాన్ సైనికులు లొంగిపోయిన అప్పుడు ఎందుకు పిఓకే తీసుకోలేకపోయారని మండిపడ్డారు. గత 11 సంవత్సరాలుగా దేశ భద్రత విషయంలో బిజెపి ప్రభుత్వం అప్రమత్తంగా ఉందన్నారు. దేశ సరిహద్దులను కాపాడుకుంటూ ఆర్థికంగా ఎదుగుతూ రక్షణ విభాగాన్ని పటిష్ఠంగా చేస్తున్నమన్నారు. పాకిస్తాన్ చేపడుతున్న టెర్రిజాన్ని వ్యతిరేకిస్తూ ఇతర దేశాలకు అఖిలపక్ష ఎంపీలను పంపించడం జరిగిందన్నారు. టెర్రరిజని వదలకపోతే ప్రపంచంలోనే పాకిస్తాన్ ఒంటరి అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్ రెడ్డి, జిల్లా ఇన్చార్జి సునీల్, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు మహేందర్, మాజీ జిల్లా అధ్యక్షులు నరసింహారెడ్డి, బిజెపి రాష్ట్ర కార్యదర్శి ప్రేమ్ రాజ్, వై శ్రీధర్, పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు వినయ్ రెడ్డి, బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పొనుగోడు గ్రామపంచాయితీ భవనానికి మోక్షమెప్పుడు..?

- నిధుల కొరతతో స్లాబ్‌కే పరిమితం

**కనగల్లు, జూన్ 4 (జనం సాక్షి) :** అరకొర వసతులతో అద్దె భవనంలో పాలన చేయవలసిన పరిస్థితులు పో నుగోడు గ్రామపంచాయతీ ఉంది. సొంత భవనం లేక గ్రామంలోనే ఓ ఇంటిని అద్దెకు తీసుకొని రోజువారి ప్రభుత్వ కార్యకలాపాలు అధికారులు కొనసాగిస్తున్నప్పటికీని, అద్దెకు ఇచ్చిన యజమాని ఎప్పుడు వచ్చి ఖాళీ చేయమంటాడో, మరొక అద్దె భవనం ఎక్కడ దొరుకుతుందో అనే సందిగ్ధలో గ్రామ సచివాలయ అధికారికి తిప్పల్ తప్పడం లేదు. ప్రతిసారి భవనం మార్చడం వల్ల రికార్డులకు భద్రత కరువైంది. గ్రామంలో 40 సంవత్సరాల క్రితం అప్పుడున్న పరిస్థితులలో గ్రామం మధ్యలో స్థలం లేకపోవడంతో గ్రామానికి కొద్ది దూరంలో భవనం నిర్మించిన ఆ భవనములోఏ అధికారి కానీ, ఐదు సంవత్సరాలకు ఒకసారి ఎన్నికయ్యే గ్రామ మొదటి పౌరుడు (సర్పంచ్ మరియు పాలకవర్గం) వారు ఆ భవనాన్ని ఉపయోగించుకోలేకపోవడం అది కాస్త శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా ఉంది. గ్రామ ప్రజాప్రతినిధుల అభ్యర్థన మేరకు ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుండి 13 లక్షల రూపాయలతో భవనమును నిర్మించడానికి అనుమతులు రాగా అట్టి నిధులతో గ్రామంలో 2015-16 సంవత్సరములో పనులను ప్రారంభించడం, అటు తర్వాత పిల్లర్లను నిర్మించి చక చక స్లాబు వేసి నిధుల కొరతతో అసంపూర్తిగా వదిలి వేశారు. సిమెంటు, ఇటుక, సీకు, ధరలు పెరగడం, కూలీలకు కూలి వేతనాలు పెరగడంతోతిరిగి పనులు




ప్రారంభించడానికి గుత్తేదారులు ఎవరు ముందుకు రావడం లేదు. గ్రామపంచాయతీకి సొంత భవనం ఉంటే క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శి తో పాటు వ్యవసాయ విస్తరణ అధికారి, ఉపాధి హామీ సిబ్బంది, ఆశా వర్కర్లు, రెవెన్యూ , వెటర్నరీ, హార్టికల్చర్, ఇతర శాఖల అధికారులు ఒకే చోట ప్రజలకు అందుబాటులో ఉండటమే కాకుండా వారిపనులు మండల కేంద్రానికి వెళ్లకుండా గ్రామస్థాయిలోనే జరిగిపోవడం వీల్లుగా ఉంటుంది. ప్రజల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాల అమలు వాటి సారాంశాలను ప్రజలకు వివరించేందుకు ఇలాంటి భవనములు ఎంతో ఉపయోగపడతాయని గ్రామ ప్రజల విశ్వాసం. కానీ సొంత భవనం లేక ఇలాంటి కార్యక్రమాలు జరగకపోవడం బాధాకరం. పోనుగోడు గ్రామపంచాయతీని అమితంగా అభిమానించే మంచి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గ్రామంపై ప్రత్యేక దృష్టి సారించి నిధుల కొరతతో నిలిచిపోయిన భవనమునకు ఎక్కువ నిధులను కేటాయించి పనులు పూర్తి చేయించడంలో సహాయ సహకారాలు అందించాలని గ్రామ ప్రజలు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని అభ్యర్థిస్తున్నారు. ఇదిలా ఉంటే మండలం లోని31 గ్రామపంచాయతీలలో రేగట్టే, రామచంద్రాపురం, కనగల్లు, ధర్వేశిపురం, దోరేపల్లి, తేలకంటి గూడెము, జి ఎడవల్లి, చిన్న మాదారం, ఎం గౌరారం, బుడమర్లపల్లి, బోయన్ పల్లి, అన్ని వసతులతో కూడిన సొంత భవనాలు ఉండగా, కురంపల్లి, శాబ్దుల్లాపురం, బచ్చన్న గూడెం, తుర్క పల్లి, లచ్చగూడెం, పర్వతగిరి, చర్ల గౌరారం, చెట్ల చెన్నారం, పగిడిమర్రి, ఎస్ లింగోటం, గ్రామాలలో బిల్డింగులు ఉన్నప్పటికీ అవి శిథిలావస్థకు చేరుకొన్న భవనములు కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. అమ్మ గూడెం ,తిమ్మన్నగూడెం, బాబా సాహెబ్ గూడెం, ఏమి రెడ్డి గూడెం, లింగాలగూడెం, మార్తి నేని గ,డెం ఇస్లాం నగర్, జంగమయ్య గూడెం, ఇరుగంటిపల్లి గ్రామాలు కొత్త గ్రామపంచాయతీలుగా ఏర్పడగా ఆ గ్రామ పంచాయతీల కార్యకలాపాలు అంగన్వాడి, ప్రభుత్వ పాఠశాలలో కొనసాగుతున్నాయి..

### ముఖ్యమైన రికార్డులకు భద్రత కరువు

గ్రామ సచివాలయాలకు సొంత భవనములు లేక అద్దె భవనంలో ప్రభుత్వ కార్యకలపాలు కొనసాగుతున్నప్పటికీ అతి ముఖ్యమైన రికార్డులకు సరైన భద్రత లేకుండా పోతుందని ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు వాపోతున్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

- 18 మందికి గాయాలు



**చౌటుప్పల్, జూన్ 4 (జనం సాక్షి) :** చౌటుప్పల్ మండల పరిధిలోని ఖైతాపురం గ్రామ సమీపంలో బుధవారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతిచెందగా, మరో 18 మందికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కందుకూరు నుంచి హైదరాబాద్ వెళ్తున్న శివంజలి ట్రావెల్స్‌కు చెందిన ప్రైవేట్ బస్సు బుధవారం 4:30 గంటల సమయంలో విజయవాడ-హైదరాబాద్ రహదారిపై చౌటుప్పల్ మండల పరిధిలోని ఖైతా పురం గ్రామ సమీపంలో ఎటువంటి హెచ్చరిక లేకుండా అజాగ్రత్తగా నిలిపిన లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. తీరుపాలుకు చెందిన బస్సు డ్రైవర్ మేడపాలి కొండలరావు (41), బస్సులో ప్రయాణిస్తున్న పరుచూరివారిపాలెం గ్రామానికి చెందిన దండేబోయిన గోవిందమ్మ (47)లు అక్కడికక్కడే మృతి చెందారు. బస్సులో ప్రయాణిస్తున్న మరో 18 మందికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని స్థానిక ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనపై దండేబోయిన మహేందర్ పోలీసులకు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




# ఆదిత్య బిర్లా ఫ్యాషన్ నుంచి ఫ్లిప్‌కార్ట్ బయటకు..!


**జనంసాక్షి:**ఈ కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్‌కు చెందిన ఇన్వెస్ట్‌మెంట్ విభాగం ఆదిత్య బిర్లా ఫ్యాషన్ అండ్ రిటైల్ నుంచి నిష్క్రమించింది. బుధవారం ఫ్లిప్‌కార్ట్ ఇన్వెస్ట్‌మెంట్స్ ఆ సంస్థలోని మొత్తం 6 శాతం వాటాలను బ్లాక్ డీల్స్‌లో విక్రయించింది. దీంతో ఆ సంస్థ షేర్లు ఒక దశలో 11శాతం పతనం అయి రూ.76.94 వద్దకు చేరాయి. ఆ తర్వాత కోలుకొని మధ్యాహ్నం 1.34 గంటల సమయంలో 8.64శాతం నష్టంతో రూ.77.36 వద్ద కొనసాగుతున్నాయి.

అమెరికాకు చెందిన వాల్‌మార్ట్ గ్రూప్‌లో ఫ్లిప్‌కార్ట్ భాగం. దాని అనుబంధ సంస్థే ఫ్లిప్‌కార్ట్ ఇన్వెస్ట్‌మెంట్స్. ఈ సంస్థ తాజాగా జరిపిన బ్లాక్ డీల్స్‌లో 7.31 కోట్ల వాటాలను ఒక్కో దానిని రూ.79.50 ధర వద్ద విక్రయించింది. నిన్న ఏబీఎఫ్ఆర్ఎల్ షేర్లు ముగిసిన రూ.86 ధర కంటే ఇది 7.6శాతం తక్కువ. ఈ డీల్ బుక్ రన్నర్‌గా గోల్డ్‌మన్‌సాక్స్ వ్యవహరించింది. ఈ డీల్ కోసం ఎటువంటి కొత్త షేర్లు జారీ కాలేదు. అక్టోబర్ 2020న ఫ్లిప్‌కార్ట్ గ్రూప్ నుంచి రూ.1,500 కోట్లు సమీకరించింది. ఏబీఎఫ్ఆర్ఎల్ గత నెల రూ.23.55 కోట్ల నష్టాన్ని ప్రకటించింది. గతేడాది ఇదే సీజన్‌లోని రూ.266.36 కోట్ల నష్టంతో పోలిస్తే.. బాగా తగ్గినట్లే. కార్యకలాపాల నుంచి లభించే ఆదాయం కూడా బాగా పెరిగి.. రూ.1,719 కోట్లు లభించింది. ప్రస్తుతం ఏబీఎఫ్ఆర్ఎల్ వద్ద పాంటలూన్స్, వాన్ హ్యూసెన్, లూయిస్‌ఫిలిప్ వంటి బ్రాండ్లు ఉన్నాయి.

# ఎట్టకేలకు లాభాల్లోకి..

## ముగిసిన స్టాక్ మార్కెట్లు.. 24600ఎగువకు నిఫ్టీ

**జనంసాక్షి:**దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లలో సానుకూల సంకేతాల నడుమ ఉదయం ఫ్లాట్‌గా ప్రారంభమైన సూచీలు రోజంతా లాభాల్లోనే ట్రేడయ్యాయి. దీంతో వరుసగా మూడు రోజులు నష్టాల్లో ముగిసిన సూచీలకు నేడు బ్రేక్ పడింది. సెన్సెక్స్ ఉదయం 80,777.65 పాయింట్ల (క్రితం ముగింపు 80,737.51) వద్ద ఫ్లాట్‌గా ప్రారంభమైంది. ఓ మోస్తరు శ్రేణిలో కదలాడిన సూచీ ఇంట్రాడేలో 80,705.18- 81,087.29 మధ్య కదలాడింది. ప్రధాన షేర్లలో కొనుగోళ్లతో రాణించిన సూచీ చివరకు 260 పాయింట్ల లాభంతో 80,998 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 24,644.25 వద్ద గరిష్ఠాన్ని తాకిన నిఫ్టీ చివరకు 77 పాయింట్ల లాభంతో 24,620.20 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30 సూచీలో ఎటర్నల్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్,



టెక్ మహీంద్రా, రిలయన్స్ ఇండస్ట్రీస్, టాటా మోటార్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టాటా స్టీల్, హెచ్‌యూఎల్, ఇన్ఫోసిస్, మారుతీ సుజుకీ షేర్లు లాభపడ్డాయి. బజాజ్‌ఫిన్‌సర్వ్, యాక్సిస్ బ్యాంక్, టీసీఎస్, టైటాన్, ఎల్అండ్‌టీ, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఎస్‌బీఐ షేర్లు నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 65.93 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 3,387 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

**లిస్టింగ్‌లు ఇవే..**

ప్రధాన బోర్డు నుంచి వచ్చిన స్కోడా ట్యూబ్స్ ఐపీఓకు షేర్లు నేడు స్టాక్ మార్కెట్లో ఎంట్రీ ఇచ్చాయి. ఇష్యూ ధర 140 కాగా ఆ ధర వద్దే షేర్లు లిస్ట్ అయ్యాయి. ఇంట్రాడేలో 5 శాతం షేర్లు రాణించాయి. మార్కెట్ ముగిసే సమయానికి ఎన్ఎస్ఈలో కంపెనీ షేర్లు 5 శాతం లాభంతో రూ.147 వద్ద ముగిశాయి. ఎస్ఎంఈ విభాగం నుంచి వచ్చిన నెప్ట్యూన్ పెట్రోకెమికల్ షేర్లు నేడు దలాల్ స్ట్రీట్‌లో లిస్ట్ అయ్యాయి. ఎన్ఎస్ఈలో 9 శాతం ప్రీమియంతో స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో ఎంట్రీ ఇచ్చాయి. ఇష్యూ ధర రూ.122 కాగా ఎన్ఎస్ఈలో రూ.132.75 వద్ద ట్రేడింగ్ మొదలు పెట్టాయి. ఇంట్రాడేలో రాణించిన షేర్లు మార్కెట్ ముగిసే సమయానికి ఎన్ఎస్ఈలో 14 శాతం లాభంతో రూ.139 వద్ద ముగిశాయి.

## పెరగనున్న స్టెయిన్‌లెస్ స్టీల్ డిమాండ్

**జనంసాక్షి:**దేశంలో స్టెయిన్‌లెస్ స్టీల్ డిమాండ్ రాబోయే 2-3 సంవత్సరాల్లో 7-8 శాతం పెరుగుతుందని ఇండియన్ స్టెయిన్‌లెస్ స్టీల్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ బుధవారం తెలిపింది. 2025 ఆర్థిక సంవత్సరంలో దీని వినియోగం 40.80 లక్షల టన్నులకు చేరుకుంది. ఇది సంవత్సరానికి దాదాపు 8 శాతం వృద్ధిని నమోదు చేసిందని అధ్యక్షులు రాజమణి కృష్ణమూర్తి..గ్లోబల్ స్టెయిన్‌లెస్-స్టీల్ ఎక్స్‌పో లో తెలిపారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలలో భారతదేశం అత్యధిక %+ఞ% వృద్ధిని నిలుపుకునే అవకాశం ఉండడంతో స్టెయిన్‌లెస్ స్టీల్ డిమాండ్ 7-8 పెరుగుతుందని అంచనా వేస్తున్నట్లు రాజమణి కృష్ణమూర్తి పేర్కొన్నారు. ప్రపంచ ఉక్కు వినియోగం 6 కిలోలుంటే, భారత్‌లో అది 3.4 కిలోలు మాత్రమే ఉందని..ఇది ప్రపంచ సగటుతో పోలిస్తే తక్కువని అన్నారు.

# విద్యా రుణాలపై వడ్డీ రేటు తగ్గింపు

**జనంసాక్షి:**విద్యాలక్ష్మి స్కీము కింద విద్యా రుణాలపై వడ్డీ రేటును 20 బేసిస్ పాయింట్లు (0.2%) తగ్గించినట్లు పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) వెల్లడించింది.

సంస్థను బట్టి విద్యా రుణాలపై వడ్డీ రేటు 7.5% నుంచి ప్రారంభం అవుతుందని వివరించింది. ఉన్నత విద్యను అభ్యసించడంలో విద్యార్థులకు ఆర్థిక తోడ్పాటునందించే లక్ష్యంతో ఈ స్కీమును రూపొందించారు. దేశవ్యాప్తంగా నాణ్యమైన ఉన్నత విద్యా సంస్థలుగా (క్యూహెచ్ఈఐ) గుర్తింపు పొందిన 860 సంస్థల్లో అడ్మిషన్ పొందిన విద్యార్థులకు ఇది ఉపయోగకరంగా ఉంటోంది. విద్యాలక్ష్మి పథకం కింద ఎడ్యుకేషన్ లోన్ కోసం దరఖాస్తు చేయాలంటే కింది డాక్యుమెంట్లు అవసరం అవుతాయని నిపుణులు చెబుతున్నారు.

**కేవైసీ వివరాల కోసం:** ఆధార్, పాన్ ఐడీ, అడ్రస్ ప్రూఫ్. అకడమిక్ రికార్డులు: మునుపటి అకడమిక్ ఏడాదిలోని మార్కు షీట్‌లను సెల్ఫ్ అటెస్టెడ్ చేయాలి. ప్రవేశ పరీక్ష ఫలితాలు: ఇప్పటికే ఏదైనా యూనివర్సిటీలో ప్రవేశం కోసం చూస్తూ, దాని ప్రవేశ పరీక్ష రాసి ఉంటే అందుకు సంబంధించిన ర్యాంక్ కార్డును జోడించాలి. అడ్మిషన్ ప్రూఫ్: ఇప్పటికే సంస్థ నుంచి అడ్మిషన్ వస్తే ఫీజు స్ట్రక్చర్‌తో పాటు సంస్థ నుంచి అడ్మిషన్ లెటర్. ఫొటోలు: పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలు. లోన్ హిస్టరీ: ఇప్పటికే బ్యాంకులు/ రుణదాతల నుంచి గతంలో లేదా ప్రస్తుతం ఉన్న రుణాల వివరాలు. ఆదాయ ధ్రువీకరణ పత్రం: రాష్ట్రంలోని నిర్దేశిత పబ్లిక్ అథారిటీ నుంచి ఆదాయ ధ్రువీకరణ పత్రం.


# 'ఆర్టిఫిషియల్' మూవీ..



**జనంసాక్షి:**ఓపెన్‌ఏఐ సీఈఓ సామ్ ఆల్ట్‌మన్‌ను నాటకీయంగా తొలగించి 2023 చివరిలో తిరిగి కంపెనీ సీఈఓగా నియమించుకున్న ఘట్టాన్ని ఫీచర్ ఫిల్మ్ 'ఆర్టిఫిషియల్'ను తెరకెక్కించేందుకు ఫిల్మ్ మేకర్ లూకా గ్వాడాగ్నినో చర్చలు జరుపుతున్నారు. అమెజాన్ ఎంజీఎం స్టూడియోస్‌లో ఈ చిత్రాన్ని హేడే ఫిల్మ్స్ పతాకంపై డేవిడ్ హేమన్, జెఫ్రీ క్లిఫోర్డ్ నిర్మించాలని చూస్తున్నారు. నిర్మాతగా వ్యవహరిస్తున్న సైమన్ రిచ్ స్క్రీన్ ప్లే కూడా అందించాలనుకుంటున్నారు. జెన్నిఫర్ ఫాక్స్ సంస్థ నిర్మాణ బృందంలో చేరడానికి చర్చలు జరుపుతోంది. ది హాలీవుడ్ రిపోర్టర్ ప్రకారం శాన్‌ఫ్రాన్సిస్కో, ఇటలీని కీలక షూటింగ్ ప్రాంతాలుగా గుర్తించారు. సమ్మర్ షూట్ కోసం చర్చలను వేగవంతం చేస్తున్నారు. కాస్టింగ్ ఒప్పందాలు ఏవీ ఇప్పటివరకు ఖరారు కానప్పటికీ, ప్రారంభ చర్చల ప్రకారం ఆల్టమన్ పాత్రను ఆండ్రూ గార్ఫీల్డ్ పోషించవచ్చని, మోనికా బార్బరో కంపెనీ సీటీఓ మీరా మురాటి పాత్రను పోషించవచ్చని అంచనా వేస్తున్నారు. ఆల్ట్‌మన్‌ను తొలగించే ప్రయత్నానికి నాయకత్వం వహించిన సహవ్యవస్థాపకురాలు ఇలియా సుట్స్కేవర్ పాత్రలో యురా బోరిసోవ్ నటించవచ్చని చెబుతున్నారు. ఓపెన్ ఏఐ సంస్థ సామ్ ఆల్ట్‌మన్‌ను సీఈవో బాధ్యతల నుంచి తొలగిస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. మైక్రోసాఫ్ట్ ఆర్థిక సహకారం ఉన్న కంపెనీ ఆయనను విశ్వసించకపోవడమే సీఈఓగా తొలగించడానికి ప్రధాన కారణమని ఒక ప్రకటనలో పేర్కొంది. అంతే కాకుండా.. ఆల్ట్‌మన్ బోర్డుతో జరుగుతున్న అంతర్గత చర్చల్లో నిజాయతీ పాటించడం లేదని సరైన సమాచారం పంచుకోవడం లేదని బోర్డు తీసుకునే నిర్ణయాలకు అతడు అడ్డుపడుతున్నాడని.. ఓపెన్ ఏఐకి నాయకత్వం వహించే అతడి సామర్థ్యంపై బోర్డుకు ఇక ఏమాత్రం నమ్మకం లేదని కంపెనీ వెల్లడించింది. దాంతో సీఈవో బాధ్యతల నుంచి తప్పుకున్న సామ్ ఆల్ట్‌మన్‌ను తిరిగి అదే పదవిలోకి తీసుకుంటున్నట్లు ఓపెన్‌ఏఐ మళ్లీ ప్రకటించింది. తనను తొలగించిన కంపెనీ బోర్డును పునర్వ్యవస్థీకరించాలని సామ్ పెట్టిన షరతుకు ఓపెన్‌ఏఐ ఒప్పుకున్నట్లు అప్పట్లో వార్తలొచ్చాయి.

# భారత్ పొరుగుదేశాలకు ఎఫ్‌డీఐ విషయంలో ఎలాంటి మార్పుల్లేవ్!

**జనంసాక్షి:**భారత్‌తో సరిహద్దులు పంచుకుంటున్న దేశాలకు సంబంధించి విదేశీ ప్రత్యేక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) కేంద్ర ప్రభుత్వం మరోసారి స్పష్టతనిచ్చింది. ఈ పెట్టుబడులకు సంబంధించి ప్రస్తుతం అనుసరిస్తున్న విధానంలో ఎలాంటి మార్పులు చేయడం లేదని సంబంధిత అధికారిక వర్గాలు వెల్లడించాయి. చైనా నుంచి ఎఫ్‌డీఐ దరఖాస్తులను ఎలాంటి పరిశీలన లేకుండానే అనుమతిస్తున్నారంటూ వార్తలు వస్తోన్న వేళ కేంద్ర ప్రభుత్వ వర్గాలు ఈ మేరకు స్పందించాయి. భారత్‌తో భూ సరిహద్దు పంచుకుంటున్న దేశాల నుంచి పెట్టుబడులకు సంబంధించి 2020లో కేంద్రం ఓ నోట్‌ను విడుదల చేసింది. దీని ప్రకారం.. ఆయా దేశాల పెట్టుబడిదారులు ప్రభుత్వం నుంచి ముందస్తు అనుమతి తీసుకున్న తర్వాతే పెట్టుబడులు పెట్టేలా షరతు విధించింది. భారత్‌తో భూ సరిహద్దు పంచుకుంటున్న చైనా, బంగ్లాదేశ్, పాకిస్థాన్, భూటాన్, నేపాల్, మయన్మార్, ఆఫ్ఘనిస్థాన్‌లకు సమానంగా వర్తిస్తుందని నోట్‌లో పేర్కొంది. ఈ దేశాల నుంచి వచ్చే అన్ని ఎఫ్‌డీఐ ప్రతిపాదనల పరిశీలన, అనుమతుల మంజూరు అంతా ఒకే ప్రక్రియలో జరుగుతుందని తెలిపింది. వివాదాల పరిష్కారానికి డబ్ల్యూటీఓలో బలమైన యంత్రాంగం: పీయూష్ గోయల్ ఈ నోట్ విడుదల చేసినప్పటి నుంచి ఇప్పటివరకు ఎఫ్‌డీఐలో ఎలాంటి సవరణలు చేయలేదు. ప్రస్తుతం పెట్టుబడుల విషయంలో ఎలాంటి మార్పుల్లేవని సమాచారం.







# ఎలాన్ మస్క్ అంతరిక్ష ప్రయోగాలు ఆచరణ సాధ్యం కాదు

**- వ్యతిరేకించిన ఆయన తండ్రి**

**జనంసాక్షి:**అంతరిక్ష సర్వీసులు అందిస్తున్న ప్రైవేట్ కంపెనీల్లో కీలకంగా ఉన్న స్పేస్‌ఎక్స్ సీఈఓ ఎలాన్‌మస్క్ ఆలోచనలను ఆయన తండ్రి ఎర్రోల్ మస్క్ వ్యతిరేకించారు. ఎలాన్ మస్క్ ప్రస్తుతం చేస్తున్న గ్రహాంతర ప్రయాణాల ప్రయోగాలపై ఎర్రోల్ మస్క్ విమర్శలు గుప్పించారు. రాకెట్లు మానవులు, ఇతర గ్రహాలను కాలనీలుగా మారుస్తాయని మస్క్ అభిప్రాయాలను ఇటీవల ఒక ఇంటర్వ్యూలో ఎర్రోల్ మస్క్ తోసిపుచ్చారు. ఇది ఆచరణ సాధ్యం కాదని చెప్పారు. శాస్త్రీయంగా లోపభూయిష్టమైనదిగా పేర్కొన్నారు. ఎలాన్ మస్క్ దీనికి బదులుగా గురుత్వాకర్షణ, అంతరిక్షంలోకి ప్రయాణించేందుకు పట్టే సమయాన్ని కుదించేలా అధ్యయనం చేయడం మేలని ఎర్రోల్ మస్క్ చెప్పారు. అంతరిక్ష అన్వేషణలో ఈమేరకు చేసే అధ్యయనాలు భవిష్యత్తు పురోగతికి కీలకంగా మారుతాయని అభిప్రాయపడ్డారు. ఆయన ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ కృషిని ప్రస్తావిస్తూ మానవాళి కేవలం రాకెట్లపై ఆధారపడకుండా లోతైన శాస్త్రీయ పరిశోధనలపై దృష్టి పెట్టాలని సూచించారు. స్పేస్‌ఎక్స్ ద్వారా అంగారక గ్రహంలో మానవుల నివాసానికి అనువుగా ఉండే ప్రదేశాలను, అక్కడి వాతావరణాన్ని తెలుసుకునేందుకు ఎలాన్ మస్క్ ప్రతిష్టాత్మక ప్రణాళికలు వేస్తున్నారు. ఈ సమయంలో ఆయన తండ్రి వ్యాఖ్యలు అందుకు పూర్తి విరుద్ధంగా ఉన్నాయి.

## 'ఎక్స్ చాట్' ప్రారంభించిన మస్క్



**జనంసాక్షి:**ప్రముఖ ఆన్‌లైన్ మెసేజింగ్ టూల్స్ అయిన వాట్సాప్, టెలిగ్రామ్, ఇన్‌స్టాగ్రామ్.. వంటి వాటికి పోటీగా ఎక్స్(గతంలో ట్విటర్) కొత్తగా 'ఎక్స్ చాట్'ను ప్రవేశపెడుతున్నట్లు తెలిపింది. ఇది తన వినియోగదారులకు అంతరాయం లేని, సురక్షితమైన మెసేజింగ్ అనుభవాన్ని అందిస్తుందని కంపెనీ సీఈఓ ఎలాన్‌మస్క్ తెలిపారు. ఎండ్-టు-ఎండ్ ఎన్‌క్రిప్షన్, డిసప్పియరింగ్ మెసేజెస్, ఆడియో/ వీడియో కాల్స్ వంటి అధునాతన సామర్థ్యాలను హైలైట్ చేస్తూ మస్క్ ఎక్స్ పోస్ట్‌లో ఈమేరకు ఎక్స్ చాట్ వివరాలు ప్రకటించారు. ఇన్‌స్టంట్ మెసేజింగ్ స్పేస్‌లో ఇప్పటికే దూసుకుపోతున్న కంపెనీలకు ఎక్స్ చాట్ పోటీదారుగా మారే అవకాశం ఉందని టెక్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం బీటా టెస్టింగ్‌లో ఉన్న ఈ అప్‌డేటెడ్ మెసేజింగ్ ఇంటర్ ఫేస్‌ను పరిమిత సంఖ్యలో యూజర్లకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు కంపెనీ తెలిపింది. ఎక్స్ చాట్‌లో ఎన్‌క్రిప్టెడ్ మెసేజింగ్, ఫైల్ షేరింగ్, వాయిస్, వీడియో కాల్స్ వంటి అధునాతన మెసేజింగ్ ఫీచర్లు ఉన్నాయని పేర్కొంది. ఈ అప్‌గ్రేడ్ మైక్రోబ్లాగింగ్ ప్లాట్‌ఫామ్ మల్టీపర్పస్ కమ్యూనికేషన్ హబ్‌గా ఎక్స్‌ను అభివృద్ధి చేయాలనే మస్క్ అంచనాలకు అనుగుణంగా ఉన్నట్లు కంపెనీ ప్రతినిధులు చెప్పారు.



## బంగారం కొనడం ఇక కష్టమే!

**జనంసాక్షి:**స్థిర ఆదాయం సమకూర్చే కమోడిటీ మార్కెట్లపైపు పెట్టుబడి దారులు మొగ్గు చూపుతున్నారు. అందులో భాగంగా బంగారం ధరల్లో మార్పులు వస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఇటీవల తీవ్ర ఒడిదొడుకులకు లోనవుతున్న బంగారం ధరల్లో మార్పులొస్తున్నాయి. అయితే నిన్నటి మార్కెట్ ధరలతో పోలిస్తే ఈ రోజు రేట్లు స్వల్పంగా పెరిగాయి. వివిధ ప్రాంతాల్లో బుధవారం రోజున గోల్డ్ రేట్లు ఎలా ఉన్నాయో ఈ కథనంలో తెలుసుకుందాం. హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, ప్రొద్దుటూరు, బెంగళూరు, ముంబై ప్రాంతాల్లో ఒక తులం బంగారం ధరలు రూ.90,900 (22 క్యారెట్స్), రూ.99,170 (24 క్యారెట్స్) వద్ద ఉన్నాయి. నిన్నటి ధరలతో పోలిస్తే ఈ రోజు 10 గ్రాముల బంగారం ధర వరుసగా ఏకంగా రూ.100, రూ.110 పెరిగింది. చెన్నైలో బుధవారం 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధరలు రూ.100, 24 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ.110 పెరిగింది. దీంతో గోల్డ్ రేటు రూ.90,900 (22 క్యారెట్స్ 10 గ్రామ్స్ గోల్డ్), రూ.99,170 (24 క్యారెట్స్ 10 గ్రామ్ గోల్డ్)కు చేరింది. దేశ రాజధాని నగరం దిల్లీలో బంగారం ధర నిన్నటితో పోలిస్తే పెరిగింది. ఈ రోజు 10 గ్రాముల 22 క్యారెట్స్ పసిడి ధర రూ.100 పెరిగి రూ.91,050కు చేరుకోగా.. 24 క్యారెట్ల ధర రూ.260 పెరిగి రూ.99,320 వద్దకు చేరింది. బంగారం ధరల మాదిరిగానే బుధవారం వెండి ధర ల్లో మార్పులు వచ్చాయి. కేజీ వెండిపై ఏకంగా రూ.1,900 పెరిగింది. దాంతో కేజీ వెండి ధర రూ.1,13,000 వద్దకు చేరింది.



# రష్యా చమురు దిగుమతులు జూమ్

## 'మే'లో 10 నెలల గరిష్టానికి

**జనంసాక్షి:**దేశీయంగా రష్యా నుంచి ముడిచమురు దిగుమతులు గత నెలలో భారీగా పెరిగాయి. వెరసి మే నెలలో రోజుకి 1.96 మిలియన్ బ్యారళ్ల(బీపీడీ)ను తాకాయి. ఇది 10 నెలల గరిష్టంకాగా.. ప్రపంచ ప్రామాణిక ధరలకంటే తక్కువలో చమురు లభించడం ఇందుకు సహకరించినట్లు గణాంకాల సంస్థ కెప్లర్ పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా చమురు వినియోగం, దిగుమతులకు మూడో ర్యాంకులో నిలిచే భారత్ విదేశాల నుంచి 5.1 మిలియన్ బ్యారళ్ల చమురును కొనుగోలు చేసింది. ముడిచమురును శుద్ధి చేయడం ద్వారా రిఫైనరీలు పెట్రోల్, డీజిల్ తదితర ఇంధనాల తయారీని చేపట్టే సంగతి తెలిసిందే. భారత్ కొనుగోలు చేసిన చమురులో రష్యా 38 శాతం వాటా ఆక్రమిస్తోంది. రోజుకి 1.2 మిలియన్ బ్యారళ్ల సరఫరా ద్వారా ఇరాక్ రెండో పెద్ద సరఫరాదారుగా నిలిచింది. ఈ బాటలో భారత్‌కు 6,15,000 బీపీడీ చమురును సౌదీ అరేబియా ఎగుమతి చేయగా.. యూఏఈ 14,90,000 బీపీడీ అందించింది.

# దేశంలోని తొలితరం సంపన్న మహిళలు

**జనంసాక్షి:**దేశంలో తొలితరం మహిళా పారిశ్రామికవేత్తల సంపద పెరుగుతోంది. 2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి '2025 కాండేర్ హురున్ ఇండియా ఉమెన్ లీడర్స్' లిస్ట్ ప్రకారం పది మంది తొలితరం మహిళా పారిశ్రామికవేత్తల సంపద దాదాపు రూ.2 లక్షల కోట్లకు చేరింది. ప్రధానంగా సాఫ్ట్‌వేర్, హెల్త్‌కేర్, రిటైల్, ఫైనాన్షియల్ సర్వీసెస్ రంగాల్లో మొదటి నుంచి బిలియన్ డాలర్ల వ్యాపారాలను నిర్మించిన మహిళలు ఈ జాబితాలో చోటు సంపాదించారు. లిస్ట్‌లో జోహో కార్పొరేషన్ సహ వ్యవస్థాపకురాలు రాధా వెంబు రూ.55,300 కోట్ల సంపదతో మొదటి స్థానంలో నిలిచారు. తర్వాతి స్థానంలో అమెరికాకు చెందిన అరిస్టా నెట్‌వర్క్స్ సీఈఓ జయశ్రీ ఉల్లాల్ రూ.48,900 కోట్ల సంపదతో ఉన్నారు. టాప్ 10 మహిళల్లో ఏడుగురు భారత్‌లో ఉండగా, మిగిలిన ముగ్గురు అమెరికాలో నివసిస్తున్నారు. మొత్తం సంపదలో రూ.1.11 లక్షల కోట్లతో సాఫ్ట్‌వేర్, సేవల రంగం ఆధిపత్యం సాగిస్తోంది. హెల్త్ కేర్, రిటైల్, ఫైనాన్స్, టెక్స్ టైల్స్, మీడియా తదితర రంగాలకు చెందినవారున్నారు.



# రేట్ల కోత 0.25 శాతమా? 0.50శాతమా?

## ఉత్కంఠగా ఆర్‌బీఐ సమీక్ష



**జనంసాక్షి:**రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్రవ్య పరపతి విధాన కమిటీ సమావేశం బుధవారం ప్రారంభమైంది. ఇందులో తీసుకున్న నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా శుక్రవారం (జూన్ 6వ తేదీన) ప్రకటించనున్నారు. ఈ సమీక్షలో ముచ్చటగా మూడోసారి కీలక వడ్డీ రేట్లను తగ్గించే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ద్రవ్యోల్బణం 4 శాతం దిగువనే కొనసాగుతుండటం, అమెరికా టారిఫ్‌ల కారణంగా నెలకొన్న వాణిజ్య అనిశ్చితుల నేపథ్యంలో వృద్ధికి ఊతమిచ్చేందుకు ఆర్‌బీఐ రేట్లను తగ్గించొచ్చని అంటున్నారు. గత రెండు సందర్భాల మాదిరిగానే ఈ సారి కూడా 25 బేసిస్ పాయింట్ల మేర వడ్డీరేట్లను తగ్గించొచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. కానీ, ఎస్‌బీఐ రీసెర్చ్ అధ్యయనం మాత్రం.. ఈ కోత 50 బేసిస్ పాయింట్ల వరకు ఉండొచ్చని అంచనా వేస్తోంది. జూన్‌లోనే 'జంబో కట్'కు ఆర్‌బీఐ మొగ్గుచూపే అవకాశాలున్నట్లు చెబుతోంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో 0.25%, ఏప్రిల్‌లో 0.25% చొప్పున మొత్తంగా కీలక రెపో రేటును అరశాతం మేర ఆర్‌బీఐ తగ్గించిన సంగతి తెలిసిందే. దీంతో రెపో రేటు 6శాతానికి దిగొచ్చింది. ఇప్పుడు మరో 50 బేసిస్ పాయింట్లు తగ్గిస్తే.. ఈ క్యాలెండర్ సంవత్సరంలోనే రెపో రేటు ఒక శాతం మేర తగ్గినట్లు అవుతుంది. ఇప్పటికే ఆర్‌బీఐ నిర్ణయాలకు అనుగుణంగా రెపో అనుసంధానిత రుణ రేట్లను, ఎంసీఎల్ఆర్‌ను చాలా బ్యాంకులు తగ్గించాయి. మూడోసారి తగ్గింపు కొనసాగితే.. రుణ గ్రహీతలకు మరింత ఉపశమనం లభించినట్లు అవుతుంది. అంతేగాక, వినిమయం, పెట్టుబడులు కూడా పెరిగి.. ఆర్థిక వృద్ధికి దోహదపడుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# మోదీ రాత్రంతా మెలకువతోనే ఉన్నారు

సింగ్ తాజాగా వెల్లడించారు. ఇండియన్ ఆర్మీ మే 7వ తేదీ రాత్రి పాకిస్థాన్‌తోపాటు పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని తొమ్మిది ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేసి లష్కరే తోయిబా, జైషే మహమ్మద్ సంస్థలను ధ్వంసం చేసిందని తెలిపారు. ఆ సమయంలో ప్రధాని మోదీ ప్రతి నిమిషం.. ఎక్కడ ఏం జరిగింది. ఎలా జరిగిందనే విషయాలను పర్యవేక్షించారని చెప్పారు. ఈ ఆపరేషన్ సమయంలో ప్రధాని ఎటువంటి ఒత్తిడికి లోను కాలేదని మంత్రి స్పష్టం చేశారు. సాధారణంగానే ప్రధాని మోదీ.. ఎక్కువగా రాత్రి సమయాల్లోనే పని చేస్తుంటారని చెప్పుకొచ్చారు. అలాగే ఈ ఆపరేషన్ సిందూర్‌ను సైతం ఆయన రాత్రి సమయంలో పర్యవేక్షించారని తెలిపారు. బుధవారం న్యూఢిల్లీలో మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రధాన మంత్రి కార్యాలయం సహాయ మంత్రి జితేంద్ర సింగ్ మాట్లాడుతూ.. రక్షణ బలగాలకు ప్రధాని మోదీ పూర్తి స్వేచ్ఛను ఇచ్చారని గుర్తు చేశారు. దీంతో ఆయా బలగాలకు ఎలాంటి నిర్ణయం తీసుకోవాలనే దానిపై ఒక స్పష్టత ఏర్పడిందన్నారు. అయితే ఈ తరహా నిర్ణయం గతంలో ఎన్నడూ తీసుకోలేదని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ గుర్తు చేశారు. పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాదులు, ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేయడంలో.. ప్రధాని మోదీ పక్కా స్పష్టతతో ఉన్నారన్నారు.

# రైతులకు ఇబ్బందులు కలిగించవద్దు

**నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**



నిర్మల్ రూరల్,జూన్ 4 (జనం సాక్షి) : గ్రామ రెవెన్యూ సదస్సులకు హాజరయ్యే రైతులకు ఇబ్బందులు కలిగించవద్దని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక మాధ్యమాలలో వైరల్ గా మారిన గ్రామ రెవెన్యూ సదస్సులకు సంబంధించిన వీడియో జిల్లా యంత్రాంగం సీరియస్ గా తీసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు.రెవెన్యూ సదస్సులో రైతుపై దురుసుగా ప్రవర్తించిన ఏఎస్సైను పోలీస్ శాఖ తరఫున సస్పెండ్ జరిగింది. తదుపరి విచారణ కొనసాగుతుందని తెలిపారు. రెవెన్యూ సదస్సులకు హాజరయ్యే ప్రజలకు అధికారులంతా సహకారం అందించాలని సూచించారు.భూ సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూభారతి నూతన చట్టాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు.భూభారతి గ్రామ రెవెన్యూ సదస్సులు రెండో దశలో భాగంగా ఈ నెల 03 నుంచి 20 వ తేదీ వరకు అన్ని మండలాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు.ఇప్పటికే 36 రెవెన్యూ గ్రామాలలో 1000కి పైగా సమస్యలకు సంబంధించి దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ తెలిపారు. ప్రజలంతా రెవెన్యూ సదస్సులలో తమ భూ సమస్యల దరఖాస్తులను సమర్పించి, పరిష్కరించుకోవాలని కలెక్టర్ కోరారు.

# ఆర్అండ్‌బి పంచాయతీ రోడ్ల అభివృద్ధికి మహర్దశ

- పాట్‌హోల్స్ లేని నాణ్యమైన రహదారులు అవసరం
- రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



హైదరాబాద్, జూన్ 04 (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నేతృత్వంలో సచివాలయంలో హైబ్రిడ్ అన్యుటీ మోడల్ (హెచ్ఏఎం) కింద రూపొందించిన రహదారుల ప్రాజెక్టులపై సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్రెడ్డి రాంరెడ్డి, ప్రభుత్వ స్పెషల్ సెక్రటరీ హరిచందన దాసరి పాల్గొన్నారు. రోడ్లు, భవనాల శాఖకు చెందిన ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొని ప్రాజెక్టుల పురోగతిపై వివరాలు వెల్లడించారు. హెచ్ఏఎం మోడల్ కింద చేపట్టాల్సిన రహదారుల ప్రాజెక్టులపై క్యాబినెట్ ఆమోదం కోసం తీసుకోవలసిన చర్యలపై చర్చ జరిగింది. హెచ్ఏఎం ఫేస్ 1లో మొత్తం 5,190 కిలోమీటర్ల రహదారులను గుర్తించామని, వీటికి సంబంధించిన డిటైల్డ్ ఎస్టిమేట్లు, అమలు విధానాలు, ఫండింగ్ పద్ధతులు తదితర అంశాలపై అధికారులతో మంత్రి గారు సమీక్ష నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాలు మరియు పట్టణ ప్రాంతాల మధ్య అనుసంధానాన్ని మెరుగుపరచడమే లక్ష్యంగా, తక్కువ కాలపరిమితిలో నాణ్యమైన రహదారులు నిర్మించాలన్నదే ఈ హెచ్ఏఎం మోడల్ లక్ష్యం. మంత్రి మాట్లాడుతూ.. "హెచ్ఏఎం ద్వారా రాష్ట్రంలోని ఆర్అండ్ బి పంచాయతీ రోడ్ల అభివృద్ధికి మహర్దశ రానుంది. ప్రజల ప్రయాణం సురక్షితంగా, వేగంగా, సౌకర్యవంతంగా ఉండాలంటే పాట్‌హోల్స్ లేని నాణ్యమైన రహదారులు అవసరం. అదే దిశగా ఈ ప్రాజెక్టులు రూపొందించబడ్డాయి" అని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో ప్రజా ప్రయోజనాలకు అనుగుణంగా, పట్టణ - గ్రామీణ ప్రాంతాల మధ్య బలమైన అనుసంధానాన్ని కల్పిస్తూ రాష్ట్ర వృద్ధికి దోహదపడేలా రోడ్ల నిర్మాణం జరుగుతుందని తెలిపారు.

## నిరుపేదకు అండగా ప్రభుత్వం

శామీర్ పేట్ : కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇళ్లు లేని ప్రతి నిరుపేదకు ఇళ్లు కట్టిస్తామని మేడ్చల్ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వజ్రేష్ యాదవ్ అన్నారు. బుధవారం తుంకుంట మున్సిపాలిటీ లోని మొగుళ్ళ వెంకట్ రెడ్డి ఫంక్షన్ హాలులో మున్సిపల్ కమీషనర్ వెంకట్ గోపాల్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారు లకు పత్రాలను వజ్రేష్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఒక్క నిరుపేదకు ఇళ్లు కట్టించలేదని ఎద్దేవ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన యేదాదిన్నర లోపే ప్రతి నిరుపేదకు ఇండ్లుమంజూరు అయ్యాయని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను నెర వేరుస్తుందన్నారు. ఎన్నికల మానిఫెస్టోలో ఇచ్చిన విధంగా ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేస్తుందన్నారు. సిఎం రేవంత్ రెడ్డి ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని చెప్పారు.

## మానవతా దృక్పథంతో
# రోగులకు సేవలందించాలి


- ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలి
- టీఫా స్కాన్ మిషన్ కొనుగోలు అంశాన్ని పరిశీలించాలి
- హుజురాబాద్ ఆసుపత్రిలో ఆరోగ్య మహిళ వెంటనే ప్రారంభించాలి
- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



**హుజురాబాద్, జూన్ 4 (జనంసాక్షి):** ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మానవతా దృక్పథంతో సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. హుజురాబాద్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ బుధవారం సందర్శించారు. డయాలసిస్ కేంద్రం, ఐసీయూ, వార్డులు, ఓపి విభాగం సందర్శించారు. నవజాత శిశువుల వార్డు సందర్శించి పిల్లలకి వచ్చిన సమస్యల గురించి తెలుసుకున్నారు. లేబర్ రూమ్, వార్డులు పరిశీలించి గర్భిణీ బాలింతలతో మాట్లాడారు. ఆస్పత్రి సిబ్బంది వారికి అందిస్తున్న సేవలను గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తల్లిపాల ప్రాముఖ్యతను, సాధారణ ప్రసవం ప్రాధాన్యతను అక్కడి మహిళలకు వివరించారు. ఇతర వార్డులను సందర్శించి రోగులతో మాట్లాడారు. అనంతరం ఆస్పత్రిలోని కాన్ఫరెన్స్ హాల్లో వైద్యాధికారులు, మెడికల్ ఆఫీసర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ ఆస్పత్రిలో అన్ని రకాల సేవలందించేందుకు అవసరమైన సిబ్బంది ఖాళీల వివరాలు సమర్పించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలని, సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ఆసుపత్రికి వచ్చే గర్భిణీలకు ముందస్తు జాగ్రత్తలు సూచించాలని, వైద్య సహాయం అవసరం అనుకుంటే గర్భిణీలను ప్రసవ గడువు కంటే ముందే ఆస్పత్రిలో చేర్చుకోవాలని అన్నారు. ఆప్తమాలజిస్ట్, రేడియాలజిస్ట్, డెంటిస్ట్ వంటి విభాగాల వారీగా ఓపి సంఖ్యను పరిశీలించారు. నెలవారి నివేదికలను సమీక్షించారు. రోగుల పట్ల మానవీయకోణంలో వ్యవహరించి వారికి సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు ప్రైవేట్ దుకాణాల్లో వేల రూపాయలు ఖర్చుతో కొనుగోలు చేస్తున్నారని అన్నారు. ముఖ్యంగా బీపీ, షుగర్ సంబంధిత మందులు ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నప్పటికీ ప్రైవేటులో కొనుగోలు చేయడం దురదృష్టకరమని అన్నారు. ఈ విషయంపై ప్రజల్లో అవగాహన కల్పించి ప్రభుత్వ ఆసుపత్రి నుండి ఉచితంగా మందులు తీసుకునేలా చూడాలని సూచించారు. నవజాత శిశువులు, పిల్లల సేవల పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఆరోగ్య మహిళ క్యాంపును వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. మెప్మా, ఐకెపి సిబ్బంది ద్వారా ఆరోగ్య మహిళ ఉచిత వైద్య పరీక్షల పట్ల మహిళలకు అవగాహన కల్పించి క్యాంపును సద్వినియోగం చేసుకునేలా చూడాలని తెలిపారు. ఈ క్యాంప్ ద్వారా సుమారు 50 వేల రూపాయల ఖరీదు చేసే 47 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేస్తున్న విషయం మహిళల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. ముఖ్యంగా 40 సంవత్సరాలు దాటిన మహిళలకు అన్ని రకాల పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి బీపీ షుగర్ థైరాయిడ్ వంటి మందులను అందించాలని అన్నారు. 108 సేవలకు ఎటువంటి అంతరాయం లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. అవసరమైన సౌకర్యాలు సమకూర్చుకోవాలని ఆదేశించారు. అంతకుముందు ఆసుపత్రి ఆవరణలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మొక్కలు నాటారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డి సి హెచ్ చంద్రశేఖర్, ఆస్పత్రి సూపరింటెండెంట్ నారాయణరెడ్డి, ఆర్ఎంవో రమేష్, సూపరింటెండెంట్ శ్రీకాంత్ రెడ్డి, డిప్యూటీ డిఎంహెచ్వో చందు, ఆర్డీవో రమేష్ బాబు, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య పాల్గొన్నారు.

## నిరుపేద వారి చిరకాల స్వప్నం
# ఇందిరమ్మ ఇండ్లు
## పేదవారికీ అండగా ప్రజా ప్రభుత్వం

**శరవేగంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు..**
**లబ్దిదారుల బ్యాంకు ఖాతాల్లో రూ కోటి 36 లక్షలు..**
**ఇండ్ల మంజూరు పత్రాల జారీలో రాష్ట్రంలో రాజన్న సిరిసిల్ల జిల్లా మొదటి స్థానం**



**11 మండలాల్లో మోడల్ ఇండ్లు..**

రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు ఇండ్ల నిర్మాణం, గదులు తదితర అంశాలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ముందుగా జిల్లాలోని ఆయా చోట్ల మోడల్ ఇండ్లు నిర్మించాలని ఆదేశాలు జారీ చేసింది.జిల్లాలోని 11 మండలాల్లో మోడల్ నిర్మాణాలను మొదలు పెట్టారు. గృహ నిర్మాణ శాఖ అధికారులు. ఆయా ఇండ్లు తుది దశకు చేరుకున్నాయి.

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జూన్ 4 (జనంసాక్షి):** పేదవారి ఆత్మగౌరవానికి ప్రతీక సొంత ఇల్లు ఈ చిరకాల స్వప్నం సాకారం దిశగా ప్రజా ప్రభుత్వం సహకారంతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు శరవేగంగా ముందుకు సాగుతున్నాయి. లబ్దిదారులకు ప్రభుత్వం ఇసుక ఉచితంగా అందిస్తోంది. మొదటి దఫాలో ఇండ్లు పూర్తి చేసుకుంటున్న వారి బ్యాంకు ఖాతాల్లో రూ కోటికి పైగా మంజూరు చేసి రాష్ట్ర ప్రభుత్వం భరోసాగా నిలిచింది.ఇండ్ల మంజూరు పత్రాల జారీలో రాష్ట్రంలో జిల్లా మొదటి స్థానంలో ఉంది. సొంత ఇల్లు నిర్మించుకోవాలని ప్రతి ఒక్కరి చిరకాల స్వప్నం. ఈ కల సాకారానికి రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకానికి రూపకల్పన చేసింది. మొదటి విడుతలో ఇంటి స్థలాలు ఉన్న వారికి రూ ఐదు లక్షల ఆర్థిక సహాయాన్ని నాలుగు దశల్లో అంద చేస్తున్నారు.400 చదరపు అడుగుల నుంచి 600 చదరపు అడుగుల లోపు ఇంటి నిర్మాణం చేసుకోవాల్సి ఉంటుంది.4 దశల్లో గ్రీన్ చానల్ ద్వారా వారికి ఆర్థిక సహాయం అందుతుంది. బేస్మెంట్ నిర్మాణం పూర్తైన తర్వాత లక్ష రూపాయల, గోడలు నిర్మిస్తే లక్ష,స్లాబ్ నిర్మించిన తరువాత 2 లక్షలు, ఇంటి నిర్మాణం పూర్తయిన తర్వాత మరో లక్ష నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ అవుతాయి.

**నిర్మాణాలకు ఇసుక ఉచితం.**

ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుంది. నిర్మాణానికి అవసరమైన ఇసుక అందుబాటులో పెట్టి ఉచితంగా అందిస్తుంది.ఇంటి నిర్మాణానికి ఒక్కో దశలో అవసరమైన ఇసుక కోసం సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శి, మున్సిపాలిటీల పరిధిలో వార్డ్ ఆఫీసరు తహసీల్దార్ దృష్టికి ముందస్తుగా తీసుకెళ్లాలి. ఇసుక ఉచితంగా యిస్తున్న రవాణా ఛార్జీలు నిర్మాణదారులు చెల్లించాల్సి ఉంటుంది. అలాగే సిమెంటు, స్టీల్ ధరలు తగ్గించాలని ఆయా కంపెనీల యాజమాన్యాలతో రాష్ట్ర ప్రభుత్వం చర్చిస్తోంది. దీంతో లబ్దిదారుల నిర్మాణ ఖర్చు మరింత తగ్గనుంది. నిరుపేదలకు పెట్టుబడి లేని పక్షంలో స్వయం సహాయక మహిళా సంఘాలు, మెప్మా ద్వారా రూ లక్ష రుణం అందించే ఏర్పాట్లు చేసింది.

**రూ కోటి 36 లక్షలకు మంజూరు.**

జిల్లాకు మొదటి విడుత కింద 1061 ఇండ్లు గ్రౌండింగ్ పూర్తి అయింది. వీటిలో బేస్మెట్ లెవెల్ లో 105, రూఫ్ లెవెల్ లో 31లో ఉన్నాయి. ఇందిరమ్మ ఇండ్లు నిర్మించు కుంటున్న లబ్దిదారుల బ్యాంక్ ఖాతాల్లో ప్రభుత్వం ఆర్థిక సాయాన్ని ఎవరి ప్రమేయం లేకుండా జమ చేసింది.

**ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాల జారీలో రాష్ట్రంలో జిల్లా మొదటి స్థానం.**

ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాల జారీలో రాజన్న సిరిసిల్ల జిల్లాను ప్రథమ స్థానంలో నిలిచింది.జిల్లాకు మంజూరు అయిన 7862 ఇండ్లకు గాను 7828 అలాట్మెంట్ ఆర్డర్లు లబ్దిదారులకు అందజేశారు. వేములవాడ నియోజకవర్గంలో ఫేజ్-1,2 లో కలిపి 2575 ఇండ్లు, సిరిసిల్ల నియోజకవర్గంలో ఫేజ్-1,2 లో కలిపి 3608 ఇండ్లు, చొప్పదండి నియోజకవర్గం లోని బోయినపల్లి మండలంలో ఫేజ్-1,2 లో కలిపి 820 ఇండ్లు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మేడిపల్లి సత్యంతో కలిసి,మానకొండూర్ నియోజకవర్గంలోని ఇల్లంతకుంట మండలంలో ఫేజ్-1,2లో 805 ఇండ్ల మంజూరు పత్రాలు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి కలెక్టర్ పంపిణీ చేశారు. ఇటీవల కరీంనగర్ ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశాన్ని కరీంనగర్ లో నిర్వహించగా, జిల్లా ఇంచార్జ్ మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు హాజరై ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాల జారీలో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిపేలా విశిష్ట సేవలు అందించిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝూను అభినందించారు.



### రాష్ట్ర ప్రభుత్వ సాయంతో ఇంటి నిర్మాణం

**కత్తెర లక్ష్మి సిరిసిల్ల**

మాకు రేకుల ఇల్లు ఉండేది. ఇల్లు కట్టుకునే పరిస్థితి లేక ఆగినం. రాష్ట్ర ప్రభుత్వం అందించే సాయంతో నేను ఇల్లు కట్టుకుంటున్న. బేస్మెంట్ కట్టిన రూ లక్ష రూపా యలు నా బ్యాంక్ ఖాతాలో పడ్డయి. సీఎం రేవంత్ రెడ్డి, కలెక్టర్ సందీప్ కుమార్ ఝూకు కృతజ్ఞతలు.



### రెండు లక్షలు నా ఖాతలో పడ్డయి

**ద్యావ సూర్యమ్మ**

నా గూనల ఇల్లు కూలింది. మస్తు ఇబ్బంది పడ్డం. శీనన్నను కలిసి ఇల్లు అడిగినం. ఇందిరమ్మ ఇల్లు ఇప్పించిండు. ముగ్గు పోసి.. కట్టుకుంటున్న. బేస్ మీట్ అయి, గోడలు లేసినయి.నా బ్యాంక్ అకౌంట్ల రెండు లక్షలు పడ్డయి. నా ఇల్లు కట్టుకునేందుకు సాయం చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

### ప్రభుత్వ సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణదారులకు రాష్ట్ర ప్రభుత్వం అందించే ఈ ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలనీ సొంత ఇంటి కలను సాకారం చేసుకోవాలన్నారు. గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇటీవల పర్యటనలో జిల్లాకు అదనంగా 1750 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశారు. దీంతో మరింత మందికి ఇందిరమ్మ ఇండ్లు కట్టుకునే అవకాశం వచ్చిందన్నారు.

### పైరవీలు అవసరం లేదు..

**జిల్లా కలెక్టరూ సందీప్ కుమార్ ఝు**

జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల కోసం ఎవరి పైరవీ అవసరం లేదు. నాలుగు దశల్లో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా ఆర్థిక సహాయం జమవుతుంది. వీటి కోసం ఎవరినీ సంప్రదించవద్దు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణదారులకు పూర్తి సహకారం అందిస్తాము. ఇంటి నిర్మాణాలు త్వరగా పూర్తిచేసుకుని రానున్న దసరా దీపావళి పండుగలను నూతన గృహాలలో జరుపుకోవాలని లబ్ధిదారులను కోరుతున్నానన్నారు.

# రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు వెనువెంటనే పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**



**కరీంనగర్ బ్యూరో, జూన్ 04 (జనంసాక్షి) :** జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామాలలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులపై విచారణ జరిపి వెనువెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. బుధవారం హుజురాబాద్ మండలం కనుకులగిద్దె గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన భూభారతి నూతన రెవెన్యూ చట్టం గ్రామ రెవెన్యూ సదస్సుకు జిల్లా కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన భూభారతి నూతన రెవెన్యూ చట్టం ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుందని అన్నారు. భూ సమస్యలు ఉన్న ప్రజలు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను రెవిన్యూ అధికారులు పక్కాగా రికార్డు నమోదు చేయాలని అన్నారు. తహసీల్దార్ స్థాయిలో పరిష్కరించదగిన దరఖాస్తులను వెనువెంటనే పరిష్కరించాలని అన్నారు. జూన్ 20వ తేదీ వరకు అన్ని గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నామని, భూ సమస్యలున్న ప్రజలు ఈ రెవెన్యూ సదస్సుల కు హాజరై దరఖాస్తు సమర్పించాలని సూచించారు. కనుకుల గిద్దె గ్రామానికి చెందిన అర్జీదారుల సమస్యలను కలెక్టర్ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు, అధికారులకు కొన్ని సూచనలు సలహాలు ఇచ్చారు. స్వీకరించిన దరఖాస్తులకు రసీదులు ఇవ్వాలని ఆదేశించారు. రెవెన్యూ సదస్సులో హెల్ప్‌డెస్క్, రిజిస్టర్లను కలెక్టర్ పరిశీలించారు. సమస్యల వారీగా అర్జీలను విభజించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి రమేష్ బాబు, తహసిల్దార్ కనకయ్య, రెవెన్యూ సిబ్బంది, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

# రైతుల నుండి దరఖాస్తులు స్వీకరణ

నూగూర్ వెంకటాపురం జూన్ 4(జనం సాక్షి ):- ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రంలోని బర్ల గూడెం గ్రామ పంచాయతీ లో భూ భారతి చట్టం, రెవిన్యూ సదస్సు డిప్యూటీ తహసీల్దార్ మహేందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పంచాయతీ పరిధిలో ఉన్న వివిధ గ్రామాల ప్రజలు వచ్చి భూ సమస్యలపై దరఖాస్తులను అధికారులకి అందజేశారు.డిప్యూటీ తహసీల్దార్ మహేందర్ మాట్లాడుతూ భూ భారతి, రెవిన్యూ సదస్సు రైతులు అందరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ రెవిన్యూ సదస్సు లో ప్రతి రైతు సాగులో ఉండి పట్టా లేకుండా ఉంటే పట్టా కొరకు దరఖాస్తు చేసుకోవచ్చు అని అన్నారు. భూమి కి సంబందించిన ప్రతి సమస్య భూ భారతి చట్టం ద్వారా పరిష్కరించబడతాయని అన్నారు. ఈకార్యక్రమంలో భూ భారతి ఆపరేటర్, పంచాయతీ కార్యదర్శి మౌనిక, రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## బ్యాంకు అధికారులు వివిధ రకాల
# రుణాలు త్వరగా మంజూరు చేయాలి

**కామారెడ్డి జిల్లా ప్రతినిది జూన్ 4 (జనం సాక్షి) :** బుధవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధ్యక్షతన డిసిసి డిఎల్ ఆర్ సి సమావేశం జరిగింది.ఈ సందర్భంగా బ్యాంకుల వారీగా, వివిధ సంక్షేమ శాఖల వారీగా స్వయం ఉపాధి, ఎస్ హెచ్ జి , వ్యవసాయ తదితర రుణాల లక్ష్యాలు, వాటి ప్రగతిపై సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పంట రుణాలు, విద్య, బ్యాంకు లింకేజీ మహిళా రుణాలు, శ్రీనిధి, స్వయం ఉపాధి రుణాలను సకాలంలో మంజూరు చేసి జిల్లా ఆర్థిక అభివృద్ధిలో బ్యాంకర్లు ప్రముఖ పాత్ర పోషించాలని అన్నారు. డిఆర్డిఏ వారు మహిళా స్వయం సహాయక సంఘాల రుణాల లక్ష్యాలను సకాలంలో సాధిస్తూ, స్వయం సహాయక సంఘాల నుండి రుణ బకాయిలను త్వరగా వసూలు చేయాలని ఆదేశించారు. యువకులకు, లబ్ధిదారులకు, నిరుద్యోగులకు జిల్లా పారిశ్రామిక కేంద్రం ద్వారా అందజేసే రుణాల వివరాలపై అవగాహన కల్పిస్తూ వివిధ బ్యాంకులలో పెండింగ్ లో ఉన్న రుణాల మంజూరు త్వరగా అయ్యేలా చర్యలు తీసుకోవాలని జిఎం డిఐసి లాలు నాయక్ ను ఆదేశించారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అందిస్తున్న రుణాల మంజూరు త్వరగా అయ్యేలా బ్యాంకర్లతో సమన్వయం చేసుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్ ను ఆదేశించారు. ఈ సందర్భంగా 8204.51 కోట్ల రూపాయల వార్షిక ప్రణాళికను విడుదల చేశారు. వాటిలో ప్రాధాన్యత రంగానికి 6993.58 కోట్లు, ప్రాధాన్యతర రంగాలకు 1210.93 కోట్ల రూపాయల కేటాయించారు. 5666.20 కోట్ల రూపాయలతో వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేశారు.ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ చందర్, ఎల్డియం చంద్రశేఖర్, డిడిఎం నాబార్డ్ ప్రవీణ్, ఆర్.బి.ఐ ఏజీఎం రెహమాన్, డిఆర్డిఎ ఏపిడి మురళీకృష్ణ, బ్యాంకర్లు తదితరులు పాల్గొన్నారు.

# రావి నారాయణ రెడ్డి జీవితం అందరికి స్ఫూర్తిదాయకం

- ఎల్‌బీనగర్‌లో నిర్మిస్తున్న టిమ్స్ ఆసుపత్రికి రావి నారాయణ రెడ్డి పేరు పెట్టాలి
- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్

**హైదరాబాద్, జూన్ 04 (జనంసాక్షి) :** తెలంగాణ సాయుధ పోరాట రథ సారథి, పద్మవిభూషణ్ స్వర్గీయ రావి నారాయణ రెడ్డి జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ, ముఖ్యంగా యువత ముందుకు సాగాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని మాజీ ఎం.పీ. బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. హైదరాబాద్ బంజారా హిల్స్ లోటస్ పాండ్ లోని రావి నారాయణ రెడ్డి ఆడిటోరియంలో జరిగిన స్వర్గీయ రావి నారాయణ రెడ్డి 118వ జయంతి కార్యక్రమంలో వినోద్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వినోద్ కుమార్ మాట్లాడుతూ ఎల్. బీ. నగర్ కొత్తపేట వద్ద నిర్మిస్తున్న ప్రభుత్వ టిమ్స్ ఆసుపత్రికి రావి నారాయణ రెడ్డి పేరు పెట్టాలని, విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేయాలని అన్నారు. నిజాం ప్రభుత్వ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా, ప్రజల విముక్తి కోసం రావి నారాయణ రెడ్డి సాయుధ పోరాటానికి నాయకత్వం వహించారని అన్నారు. అప్పటి కేంద్ర హోం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆధ్వర్యంలో పోలీస్ యాక్షన్ జరగడం వల్ల సాయుధ పోరాటానికి ఆటంకం ఏర్పడిందని పేర్కొన్నారు. పోలీస్ యాక్షన్ జరగక పోయినా నిజాం ప్రభుత్వ సంగతి చూసేవాళ్ళం అని రావి నారాయణ రెడ్డి చెప్పేవారని వినోద్ కుమార్ తెలిపారు. ప్రస్తుతం పేద, ధనికుల మధ్య ఆర్థిక పరమైన వ్యత్యాసం వేయి రెట్లు పెరిగిపోయిందని, కొన్ని దశాబ్దాల క్రితం 65% మంది వద్ద డబ్బులు ఉండేవని, ఇప్పుడు సంపద కొంత మంది వద్దే కేంద్రీకృతమైందని వినోద్ కుమార్ అభిప్రాయపడ్డారు. రావి నారాయణ రెడ్డి చూపిన మార్గంలో యువత పయనిస్తే ఏమైనా సాధించవచ్చని వినోద్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి, సిపిఐ రాష్ట్ర నాయకులు తదితరులు పాల్గొన్నారు.




# పాటల పల్లకిలో.. పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి శ్రీధర్‌బాబు

**మంథని, (జనంసాక్షి) :** జూన్ 15 న కరీంనగర్ కళాభారతిలో జరగబోయే పాటల పల్లకిలో 12 గంటలు కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ను రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చేతుల మీదుగా బుధవారం ఆవిష్కరించారు. ఈ పాటల పల్లకి కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున కవులు, కళాకారులు పాల్గొననున్నారు. కరీంనగర్ కలెక్టరేట్ నుండి కళాభారతి వరకు తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలు ఉట్టిపడేలా బతుకమ్మలు కోలాటం ఒగ్గుడోలు,బోనాలు, డప్పులు అనేక కళారూపాలతో భారీ ఎత్తున ర్యాలీ ఉంటుందని ప్రముఖ కవి గాయకులు నేర్నాల కిషోర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి సాంస్కృతిక సేన రాష్ట్ర అధ్యక్షులు చక్రాల రఘు, వరంగల్ రవి,గ్యార యాకన్న, గడ్డమీది సంపత్ పొన్నాల విష్ణు, పెద్దపల్లి జిల్లా మాజీ గ్రంథాలయ డైరెక్టర్ ఇజ్జగిరీ రాజు లడ్డు, బాలు, నమిండ్ల అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

*బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) ఐపీఎల్-2025 విజయోత్సవ సంబరాల సందర్భంగా జరిగిన తొక్కిసలాట ఘటన విషాదానికి దారితీసింది. 18 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ఐపీఎల్ టైటిల్ సాధించిన ఆర్సీబీ జట్టు కోసం ఏర్పాటు చేసిన సంబరాలకు అభిమానులు భారీగా తరలివచ్చారు. అయితే, స్టేడియం గేట్ల వద్ద గుంపులు నియంత్రణ తప్పడంతో తొక్కిసలాట జరిగి, 10 మంది మరణించగా, 50 మందికి పైగా గాయపడ్డారు. ఈ ఘటనపై కర్ణాటక ప్రభుత్వం క్షమాపణ చెప్పింది. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, "అప్రమత్తమైన యువ గుండెలు ఈ విషాదంలో చిక్కుకున్నాయి. తగిన ఏర్పాట్లు చేసే సమయం లభించలేదు," అని విచారం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య గాయపడిన వారిని సందర్శించనున్నారు. బీజేపీ నేతలు ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని దుయ్యబట్టారు. గాయపడిన వారికి బోరింగ్, వైదేహి ఆస్పత్రుల్లో చికిత్స జరుగుతోంది.*



# అభిమానం చంపేసింది

## ఆర్సీబీ విజయోత్సవ తొక్కిసలాట

### విషాదంగా మారిన ఆర్సీబీ విజయోత్సవం సంబరాలు
### చిన్నస్వామి స్టేడియంలో తొక్కిసలాట, 10 మంది మృతి

**బెంగళూరు విమానాశ్రయంలో ఘనస్వాగతం..**

ఎన్నో పరాభవాల తర్వాత ఆర్సీబీ కల నెరవెరడంతో దేశవ్యాప్తంగా బెంగళూరు టీమ్ అభిమానులు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకుంటున్నారు. ఆర్సీబీ టీమ్ ట్రోఫీతో తొలిసారి బెంగళూరుకు రాగా.. ఫ్యాన్స్ ఘన స్వాగతం పలికారు. కర్ణాటక ఉప ముఖ్య మంత్రి డీకే శివకుమార్ విమానాశ్రయానికి వెళ్లి ఆర్సీబీ జట్టుకు స్వాగతం పలికారు. విరాట్ కోహ్లి, కృనాల్ పాండ్య, టిమ్ డేవిడ్, దినేశ్ కార్తిక్లకు ఆయన పుష్పగుచ్ఛం అందించి వెల్కమ్ చెప్పారు. అనంతరం బెంగళూరు జట్టు ప్రత్యేక బస్సులో విధాన సౌధకు చేరుకుంది. ఈ క్రమంలో వేలాది అభిమానులు ఆర్సీబీ జెండాలు చేతబూని విధాన సౌధ వద్దకు చేరుకున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా 'ఎర్రసముద్రాన్ని' తలపించింది. ఆర్సీబీ ఆటగాళ్లు బస్సులో వస్తున్న మార్గంలోనూ అభిమానులు సందడి చేశారు.

ఐపీఎల్-2025 విజేత రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) జట్టు విజయోత్సవ సంబరాలు బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద విషాదంగా మారాయి. అభిమానుల భారీ సంఖ్యలో తరలిరావడంతో జరిగిన తొక్కిసలాటలో 10 మంది దుర్మరణం చెందారు. మరో 37 మంది తీవ్రంగా గాయపడ్డారు, వీరిలో 10 మంది విషమ పరిస్థితిలో ఉండటంతో ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. 18 సంవత్సరాల సుదీర్ఘ వేచిన తర్వాత ఆర్సీబీ ఐపీఎల్ ట్రోఫీని సాధించింది. అహ్మదాబాద్ నుంచి బెంగళూరుకు చేరుకున్న జట్టు కోసం చిన్నస్వామి స్టేడియంలో ఘనంగా సంబరాలు ఏర్పాటు చేశారు. ఈ వేడుకల్లో పాల్గొనేందుకు అభిమానులు భారీగా తరలివచ్చారు. కొందరు అభిమానులు బారికేడ్లను, పోలీసులను తోసుకుంటూ స్టేడియం వైపు పరుగులు తీశారు. ఈ గందరగోళం లో పోలీసులు గుంపును అదుపు చేయలేకపోయారు. ఫలితంగా, అభిమానులు గుండెలు గుండెలుగా స్టేడియంలోకి దూసుకెళ్లడంతో తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో 10 మంది ప్రాణాలు కోల్పోగా, 37 మంది గాయపడ్డారు. గాయపడిన వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉండటంతో మరణాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

**కర్ణాటక ప్రభుత్వం క్షమాపణ**

బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) ఐపీఎల్-2025 విజయోత్సవాల సందర్భంగా జరిగిన తొక్కిసలాట ఘటనపై కర్ణాటక ప్రభుత్వం క్షమాపణ చెప్పింది. కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, "అప్రమత్తమైన యువ గుండెలతో వచ్చిన జనం ఈ సంఘటనలో చిక్కుకు న్నారు. ఈ గుండెలు ఆగిపోయాయి. బెంగళూరు, కర్ణాటక ప్రజలకు నేను క్షమాపణ చెప్తున్నాను. జనం నియంత్రణలో లేని పరిస్థితి ఏర్పడింది. దీనిని నియంత్రించడానికి తగిన ఏర్పాట్లు చేసే సమయం మాకు లభించలేదు," అని విచారం వ్యక్తం చేశారు. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఈ ఘటనపై స్పందిస్తూ, గాయపడిన వారిని సందర్శించేందుకు ఆస్పత్రులకు వెళ్లనున్నట్లు తెలిపారు. అయితే, ఈ ఘటనకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని బీజే పీ నేతలు ఆరోపించారు. బీజేపీ ఐటీ సెల్ చీఫ్ అమిత్ మాలవియా, "ఈ దుర్ఘటన నిర్లక్ష్యం వల్ల సంభవించింది, కేవలం అవకాశం వల్ల కాదు. ప్రభుత్వం బాధ్యత వహించాలి," అని విమర్శించారు. ఆర్సీబీ జట్టు 18 ఏళ్ల తర్వాత ఐపీఎల్ టైటిల్ సాధించిన సందర్భంగా విధానసౌధలో సిద్ధరామయ్య, డీకే శివకుమార్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అయితే, ట్రాఫిక్, భద్రతా కారణాలతో ఓపెన్ బస్ పరేడ్ను రద్దు చేసినట్లు బెంగళూరు పోలీసులు ప్రకటించారు. అయినప్పటికీ, అభిమానులు స్టేడియం వద్ద భారీగా గుమిగూడడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. స్టేడియం గేట్లు సకాలంలో తెరవకపోవడం, జనం ఒక్కసారిగా దూసుకెళ్లడంతో ఈ విషాదం సంభవించినట్లు నివేదికలు తెలిపాయి.
ఈ ఘటనలో మరణించిన వారి కుటుంబాలకు ప్రభుత్వం సానుభూతి తెలియజేసింది. గాయపడిన వారికి బోరింగ్, వైదేహి ఆస్పత్రుల్లో చికిత్స అందిస్తున్నారు. ఈ సంఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది.

# కోహ్లీ 'సిక్సర్'!

## ఐసీసీ ట్రోఫీల వీరుడి ఐపీఎల్ కల సాకారం



భారత మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ ఐపీఎల్ ట్రోఫీతో తన కలను సాకారం చేసుకున్నాడు. టీమిండియా తరఫున బహుళ ఐసీసీ టైటిళ్లు సాధించిన కోహ్లీ, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) తరఫున ఐపీఎల్లో 'ఛాంపియన్'గా నిలిచాడు. 17 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత, అహ్మదాబాద్ స్టేడియంలో ఐపీఎల్ ట్రోఫీని ముద్దాడిన కోహ్లీ ఆనందం అంతులేనిది. తన కెరియర్లో ఎన్నో రికార్డులు, మైలురాళ్లు సాధించిన ఈ భారత క్రికెట్ స్టార్, వన్డే వరల్డ్ కప్ (2011), ఛాంపియన్స్ ట్రోఫీ (2013), టీ20 వరల్డ్ కప్ (2024), మరోసారి ఛాంపియన్స్ ట్రోఫీ (2025) గెలిచిన జట్టులో సభ్యుడిగా ఉన్నాడు. ఇప్పుడు ఐపీఎల్ టైటిల్తో అతని ఖాతాలో ఆరు ట్రోఫీలు చేరాయి.
అండర్-19 వరల్డ్ కప్ (2008) హీరోగా సీనియర్ జట్టులోకి అడుగుపెట్టిన కోహ్లీ, త్వరలోనే కీలక ఆటగాడిగా ఎదిగాడు. 2011లో స్వదేశంలో జరిగిన వన్డే వరల్డ్ కప్తో తొలి ఐసీసీ టైటిల్ సాధించాడు. ఆ తర్వాత 2013లో ఛాంపియన్స్ ట్రోఫీ, 2024లో టీ20 వరల్డ్ కప్, 2025లో మరో ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచిన జట్టులో భాగమైన కోహ్లీ, ఇప్పుడు ఐపీఎల్ ట్రోఫీతో 'సిక్సర్' కొట్టాడు. 17వ సీజన్లో ప్లే ఆఫ్స్కు చేరలేని ఆర్సీబీ, 18వ ఎడిషన్లో కప్ గెలవాలనే పట్టుదలతో బరిలోకి దిగింది. లీగ్ దశలో 8 విజయాలతో ప్లే ఆఫ్స్కు చేరిన బెంగళూరు, క్వాలిఫయర్ 1లో పంజాబ్ కింగ్స్ను 101 పరుగులకే కుప్పకూల్చి ఫైనల్కు దూసుకెళ్లింది. టైటిల్ పోరులో కోహ్లీ 43 పరుగుల తో జట్టు భారీ స్కోర్ సాధించడంలో కీలక పాత్ర పోషించాడు.
కృనాల్ పాండ్యా (2-17), భువనేశ్వర్ (2-38)ల విజృంభణతో పంజాబ్ ఓటమి అంచున నిలిచింది. శశాంక్ సింగ్ (61 నాటౌట్) చివర్లో పోరాడినా, ఆర్సీబీ విజయాన్ని అడ్డుకోలేకపోయాడు. హేజిల్వుడ్ 20వ ఓవర్ చివరి బంతి వేసిన వెంటనే, కన్నీళ్లను ఆపుకున్న కోహ్లీ భావోద్వేగానికి లోనయ్యాడు. మైదానంలో ముఖాన్ని చేతుల్లో దాచుకుని, ఇన్నేళ్ల బరువు దిగిపోయినట్లు కూలబడ్డాడు.
"18 ఏళ్లు అయింది. ఆర్సీబీ కోసం నా శక్తినంతా ధారపోశాను. ఇలాంటి రోజు వస్తుందని అనుకోలేదు. ఈ రోజు చిన్నపిల్లాడిలా ప్రశాంతంగా నిద్రపోతాను," అని మ్యాచ్ అనంతరం కోహ్లీ భావోద్వేగంతో చెప్పాడు. అతని మాటల్లో ఇన్నేళ్ల మానసిక వేదన స్పష్టమైంది. 2008 నుంచి 'ఈ సాలా కప్ నమదే' అనే నినాదంతో బరిలోకి దిగిన ఆర్సీబీ, 18వ ఎడిషన్లో ఆ కలను నిజం చేసుకుని అభిమానులతో పాటు కోహ్లీ నిరీక్షణకు తెరదించింది.

# ఇంగ్లండ్ను వెంటాడుతున్న బౌలింగ్ సమస్యలు




ఇంగ్లండ్ జట్టు వరుసగా గాయాల షాక్లతో సతమతమవుతోంది. టీమిండియాతో ఐదు టెస్టుల సిరీస్ను విజయంతో ప్రారంభించాలనే లక్ష్యంతో ఉన్న ఆతిథ్య జట్టుకు బౌలింగ్ విభాగంలో కష్టాలు తప్పడం లేదు. ప్రధాన పేసర్లు మార్క్వుడ్, జోఫ్రా ఆర్చర్ ఇప్పటికే గాయాలతో బాధపడుతుండగా, క్రిస్ వోక్స్ ఫిట్నెస్ కోసం పడరాని పాట్లు పడుతున్నాడు. ఈ నేపథ్యంలో యువ పేసర్ గస్ అట్కిన్సన్ కూడా కండరాల గాయం (హామ్స్ట్రింగ్ ఇంజరీ)తో ఇబ్బంది పడుతున్నాడు, దీంతో అతను భారత్తో సిరీస్లో ఆడటం సందేహంగా మారింది.
ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు ఒక ప్రకటనలో, "యువ పేసర్ గస్ అట్కిన్సన్ కుడి తొడ కండరాల గాయంతో బాధపడుతున్నాడు. జూన్ 20న భారత్తో జరిగే తొలి టెస్టుకు అతను దాదాపు దూరమయ్యే అవకాశం ఉంది," అని తెలిపింది. జింబాబ్వేతో స్వదేశంలో జరిగిన ఏకైక టెస్టులో అట్కిన్సన్ గాయపడ్డాడు, దీంతో వెస్టిండీస్తో వన్డే సిరీస్కు దూరమయ్యాడు. ఇప్పుడు ప్రపంచ టెస్టు ఛాంపియన్షిప్ (%బెజ%) 2025-27 సీజన్లో భాగంగా భారత్తో జరిగే సిరీస్కు కూడా అతను అందుబాటులో ఉండకపోవచ్చు. గత వేసవిలో అరంగేట్రం చేసిన అట్కిన్సన్, 12 మ్యాచ్లలో 55 వికెట్లు సాధించి ఆకట్టుకున్నాడు. అతను తొలి టెస్టుకు కోలుకోకపోతే, ఇంగ్లండ్ జట్టుకు వైవిధ్యమైన పేస్ బౌలర్ కొరత తప్పదు.
గిల్ నాయకత్వంలో భారత జట్టు
శుభ్మన్ గిల్ సారథ్యంలో భారత జట్టు జూన్లో ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లనుంది. లీడ్స్లోని హెడింగ్లే మైదానంలో జూన్ 20న తొలి టెస్టుతో సిరీస్ ప్రారంభమవుతుంది. జూలై 2న రెండో టెస్టు, జూలై 10న మూడో టెస్టు, జూలై 23న నాలుగో టెస్టు, జూలై 31న ఐదో టెస్టు జరగనున్నాయి. ఈ సిరీస్ 2025-27 సైకిల్లో ఇరు జట్లకు తొలి సిరీస్ కావడంతో, రెండు జట్లూ విజయం కోసం పూర్తి శక్తిని ఒడ్డనున్నాయి. కోహ్లీ, రోహిత్, అశ్విన్ వంటి సీనియర్లు వీడ్కోలు పలికిన నేపథ్యంలో, యువ ఆటగాళ్లతో నిండిన జట్టును గిల్ ఎలా నడిపిస్తాడనేది ఆసక్తికరంగా ఉంది.

# ట్రోఫీ విజేతకు వరల్డ్ కప్ బెర్తు

### చైనాలో మహిళల ఆసియా కప్ హాకీ




మహిళల ఆసియా కప్ హాకీ టోర్నమెంట్ షెడ్యూల్ విడుదలైంది. చైనాలోని హాంగ్జౌలో సెప్టెంబర్ 5, 2025 నుంచి ఈ భారీ టోర్నీ ప్రారంభం కానుంది. 10 రోజుల పాటు జరిగే ఈ ఆసియా కప్లో 8 జట్లు టైటిల్ కోసం పోటీపడనున్నాయి. గ్రూప్ బీలో స్థానం సంపాదించిన భారత జట్టు, తొలి మ్యాచ్లో థాయ్లాండ్తో తలపడనుందని హాకీ ఇండియా బుధవారం ప్రకటించింది.
గత ఎడిషన్లో కాంస్య పతకం సాధించిన టీమిండియా ఈసారి స్వర్ణం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ టోర్నీ విజేత 2026 మహిళల ఎఫ్ఐహెచ్ వరల్డ్ కప్కు నేరుగా అర్హత పొందనుంది. కాబట్టి, భారత జట్టు ఈ ఈవెంట్లో అత్యుత్తమ ప్రదర్శన చేయాలనే పట్టుదలతో ఉంది.

**సెప్టెంబర్ 6న జపాన్తో ఢీ**

టోర్నీకి అర్హత సాధించిన జట్లను గ్రూప్ ఏ, గ్రూప్ బీగా విభజించారు. గ్రూప్ ఏలో చైనా, కొరియా, మలేషియా, చైనీస్ తైపీ జట్లు ఉన్నాయి. గ్రూప్ బీలో భారత్, జపాన్, సింగపూర్, థాయ్లాండ్ జట్లు చోటు దక్కించుకున్నాయి. భారత జట్టు తొలి మ్యాచ్లో థాయ్లాండ్తో, సెప్టెంబర్ 6న డిఫెండింగ్ ఛాంపియన్ జపాన్తో, సెప్టెంబర్ 8న సింగపూర్తో పోటీపడనుంది. "గ్రూప్ బీలో డిఫెండింగ్ ఛాంపియన్ జపాన్తో మ్యాచ్ మాకు పెద్ద సవాలు. అయినప్పటికీ, టోర్నీ ఆరంభంలోనే బలమైన ప్రత్యర్థిని ఎదుర్కోవడం మా ఆటగాళ్ల నైపుణ్యాలను మెరుగుపరుస్తుంది. ప్రస్తుతం మేము గొప్పగా ఆడటంపై, క్రమశిక్షణతో ఉండటంపైనే దృష్టి సారించాం. ప్రతి మ్యాచ్ను గెలుస్తూ ఫైనల్కు చేరి, ట్రోఫీ సాధించి, 2026 ఎఫ్ఐహెచ్ వరల్డ్ కప్కు అర్హత పొందాలనేది మా లక్ష్యం," అని భారత సారథి సలీమా టెటే తెలిపింది. భారత జట్టు చివరిసారిగా 2017లో ఆసియా కప్ విజేతగా నిలిచింది.

# కరుణాకరన్-ఆద్యా జోరు

### ఇండోనేషియా ఓపెన్లో భారత షట్లర్ల హవా



ఇండోనేషియా ఓపెన్ సూపర్ 1000 బ్యాడ్మింటన్ టోర్నమెంట్లో భారత ఆటగాళ్లు తమ సత్తా చాటుతున్నారు. సింగిల్స్లో పీవీ సింధు, డబుల్స్లో సాత్విక్ జోడీ ముందంజ వేస్తుండగా, మిక్స్డ్ డబుల్స్లో సతీశ్ కుమార్ కరుణాకరన్-ఆద్యా వరియత్ జంట అద్భుత ప్రదర్శనతో రెండో రౌండ్కు దూసుకెళ్లింది. అయితే, ఇదే విభాగంలో పోటీపడిన కొందరు భారత క్రీడాకారులు తొలి రౌండ్లోనే ఓటమితో ఇంటిదారి పట్టారు. తొలి రౌండ్లో కరుణాకరన్-ఆద్యా జోడీకి చైనీస్ తైపీకి చెందిన యె హాంగ్ వీ-నికొలె గొంజలెస్ చాన్ జంట గట్టి సవాల్ విసిరింది. అయినప్పటికీ, భారత జోడీ పట్టుదలతో ఆడి, ఉత్కంఠభరిత మ్యాచ్లో విజయం సాధించింది. తొలి సెట్ను 15-21తో కోల్పోయినా, ఒత్తిడికి లొంగకుండా 45 నిమిషాల పాటు నడిచిన ఈ పోరులో కరుణాకరన్-ఆద్యా 21-16, 21-17తో చివరి రెండు సెట్లలో ప్రత్యర్థిని చిత్తుచేసింది.

**స్టార్ జోడీలకు నిరాశ**

మిక్స్డ్ డబుల్స్లో రోహన్ కపూర్-రుత్విక శివానీ గద్దే జోడీ మాత్రం నిరాశపరిచింది. జపాన్కు చెందిన యుచీ షిమొగమీ-సయక హొబర జంట చేతిలో 14-21, 9-21తో ఘోరంగా ఓడిపోయింది. అలాగే, అశిత్ సూర్య-అమృత ప్రముతేశ్ జోడీ కూడా తొలి రౌండ్లోనే చతికిలపడింది. ఫేవరెట్గా బరిలోకి దిగిన ధ్రువ్ కపిల-తనీషా క్రాస్టో జంట కూడా మలేషియాకు చెందిన సెకండ్ సీడ్ టాంగ్ జీ చెన్-ఈ వీ తోహ్ జోడీతో కనీస పోటీ ఇవ్వలేక, మ్యాచ్ను చేజార్చుకుంది.

## సీసీ కెమెరాల కోసం పత్తిపాక గ్రామస్తులు 40 వేల ఆర్థిక సాయం

**శాయంపేట, జూన్ 4 (జనం సాక్షి) :**
శాయంపేట పోలీసులు ప్రజల భద్రత విషయాన్ని దృష్టిలో ఉంచుకొని శాయంపేట సీఐ పి. రంజిత్ రావు మరియు ఎస్సై జె. పరమేశ్వర్ పత్తిపాక గ్రామంలో సిసి కెమెరాల పై అవగాహనా సదస్సును ఏర్పాటు చేసి, సీసీ కెమెరాల ఉపయోగం గురించి గ్రామస్థులకు వివరించి, సీసీ కెమెరాల అవసరాన్ని గురించి పత్తిపాక గ్రామస్థులతో మాట్లాడగ గ్రామస్థులు అవగాహన సదస్సును అర్థం చేసుకొని, గ్రామ భద్రత గురించి వారి గ్రామంలో 8 సీసీ కెమెరాలను పెట్టడానికి 40,000/- ఇచ్చి పోలీసులకి సహకరించినారని




సిఐ రంజిత్ రావు, ఎస్సై పరమేశ్వర్ తెలిపారు.



## సిపిఐ రాష్ట్ర మహాసభను విజయవంతం చేయండి

### కూనంనేని సాంబశివరావు

**కుత్బుల్లాపూర్ జూన్ 4 (జనం సాక్షి) :** భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర నాలుగో మహాసభలకు కుత్బుల్లాపూర్ సిపిఐ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించుకోవాలనుకోవడం అభినందనీయమని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే, కూనంనేని సాంబశివరావు అన్నారు. బుధవారం షాపూర్ నగర్లోని ఏఐటీయూసీ కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బిఎస్ బోస్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ రాష్ట్ర మహాసభ లకు జాతీయ నాయకులు, రాష్ట్ర నాయకులు, జిల్లాల నాయకులు హాజరు కానున్నట్లు తెలిపారు. ఆగస్టు నెల 19వ నుండి 22వ తారీకు వరకు ఈ సమావేశాలను నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మహాసభలలో ప్రజా సమస్యలపై, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై, రాజ్యాంగం కల్పించిన పౌరుల ప్రాథమిక హక్కులపై ముఖ్యంగా చర్చలు జరిపి తీర్మానం చేనున్నట్టు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరపాలని, సీజ్ ఫైర్ ప్రకటించాలని సిపిఐ డిమాండ్ చేస్తున్నదన్నారు. పహిల్గములో ఉగ్రవాదులు దాడిని ఎదుర్కోవడంలో బిజెపి ప్రభుత్వం విఫలమైందని విమర్శిం చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ, సిపిఐ సీనియర్ నేత పిజె చంద్రశేఖర్, సిపిఐ జాతీయ సమితి సభ్యులు ఎండి యూసుఫ్, ఏఐటిసి రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎం నరసింహ, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డిజి సాయిలు గౌడ్, సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి స్టాలిన్, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, యేసు రత్నం, దామోదర్ రెడ్డి, జె లక్ష్మి, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కే ధర్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ షాప్ తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ ప్రతినిధి, జూన్ 4 (జనంసాక్షి):**
రేషన్ షాపుల ద్వారా సకాలంలో వినియోగదారులకు రేషన్ బియ్యం ఇతర వస్తువులు పంపిణీ చేయాలని ఎప్పటికప్పుడు సంబంధిత రికార్డులను నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. బుధవారం వరంగల్ మండలంలోని ఏనుమాముల భూభారతి గ్రామసభలో పాల్గొని తిరిగి వెళుతున్న క్రమంలో వరంగల్ మండలంలోని బాలాజీ నగర్లో చౌక ధరల దుకాణం వద్ద ఎక్కువ మంది గుమ్మిగూడి ఉనట్లు గమనించిన కలెక్టర్ వెంటనే తన వాహనాన్ని ఆపి బాలాజీనగర్ రేషన్షాపును తనిఖీ చేశారు. ఎండాకాలం దృష్ట్యా వినియోగదారులకు ఇబ్బందులు కలుగకుండా వారి సౌకర్యార్థం ప్రతిరోజు 15 చొప్పున టోకెన్లు ముందుగానే అందజేసి క్రమ పద్ధతిలో బియ్యం, ఇతర వస్తువులు పంపిణీ చేయాలని డీలర్ను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వినియోగదారులతో నేరుగా మాట్లాడుతూ రేషన్ సక్రమంగా అందుతున్నదా అని అడిగి తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సన్న బియ్యం నాణ్యతను పరిశీలించారు. పేదవారికి కూడా సన్న బియ్యం పంపిణీ చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం సన్న బియ్యం కార్యక్రమం పంపిణీ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నదని, పంపిణీలో ఎలాంటి అవకతవకలు జరిగితే కఠిన చర్యలు తప్పవని రేషన్ డీలర్ను హెచ్చరించారు. షాప్కు సంబంధించిన స్టాక్ వివరాలు బోర్డులు, ఫ్లెక్సీల ద్వారా ప్రజలకు కనిపించే విధంగా ప్రదర్శించాలని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు.

# ఎల్లుండి నుంచి బడిబాట

- ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం
- పాఠశాల ప్రారంభం రోజు పాఠ్యపుస్తకాల పంపిణీ
- వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**వికారాబాద్ జిల్లా బ్యూరో జూన్ 4 (జనం సాక్షి):**
రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తునందున ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు ప్రత్యేక చొరవ తీసుకొని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగేలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. బుధవారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం విద్యా సంవత్సరం 2025 26 బడిబాట కార్యక్రమాన్ని పురస్కరించుకొని జిల్లాలోని అన్ని శాఖల అధికారులు మరియు మండల స్థాయి అధికారులు వారితో పాటుగా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బడిబాట కార్యక్రమం ఈనెల 6 నుండి 19 వరకు నిర్వహించాలని సూచించారు. ఇందులో భాగంగా ప్రతిరోజు బడిబాట కార్యక్రమంలో చేపట్టాల్సిన అంశాల్ని వివరించారు. ప్రతి గ్రామంలో ఉన్నటువంటి ప్రతి బాల బాలికల ను పాఠశాలలో చేర్పించేటట్లు చర్యలు తీసుకుని బాల కార్మికులు బడిబయట పిల్లలు లేకుండా ఉండేటట్లు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు ప్రతి పాఠశాలలో విద్యార్థులు యొక్క నమోదును పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలో మెరుగైన సదుపాయాలు కల్పించడం జరిగిందని, పాఠశాల విద్యార్థులతో కళకళలాడేలా చుట్టుపక్కల ఉండే పిల్లలు ఎక్కువగా పాఠశాలకు వచ్చే విధంగా అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాఠశాలల్లోని సౌకర్యాల గురించివిస్తృత ప్రచారం, పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి వారి పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. బడిబాట కార్యక్రమంలో కూడా విద్యార్థుల సంఖ్య పెరిగే విధంగా సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. పాఠశాలల్లో ఉన్నటువంటి పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సంవత్సరం ప్రతి పాఠశాలకు యూనిఫార్మ్ పాఠ్యపుస్తకాలు నోట్ పుస్తకాలు వర్క్ బుక్స్ ఇప్పటికే మండలాల నుండి పాఠశాలకు చేరి ఉన్నాయి, వీటన్నిటిని పాఠశాల ప్రారంభం నాడు అనగా ఈనెల 12 నాడు ప్రతి విద్యార్థికి అందించాలని సూచించారు. పాఠశాలలో మిగిలిపోయినటువంటి బియ్యం క్వాలిటీని పరిశీలించి వాటిని తిరిగి వాడటానికి అనువుగా ఉన్నాయో లేదో పరిశీలించాలని సూచించారు. పిల్లల విద్యా ప్రమాణాలు పెరగాలంటే గుణాత్మకమైన విద్యతోపాటు పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులలో ఎలాంటి సమస్యలు రాకుండా ప్రోగ్రెస్ ఉండాలని ఈ సందర్భంగా అధికారులకు ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు పొందిన లబ్ధిదారు ఇండ్ల నిర్మాణాలు చేపట్టుకోవాలని కలెక్టర్ సూచించారు. జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద రైతు ఆత్మహత్య కుటుంబాలను అన్ని సర్టిఫికెట్ లు ఆదార్, కుటుంబ సబ్యుల సర్టిఫికెట్, మరణ ధృవీకరణ సర్టిఫికెట్, కులం, ఆదాయ సర్టిఫికెట్ లను జత చేస్తూ ప్రపోసే చేయగలిగితే జాతీయ కుటుంబ ప్రయోజన పథకానికి అర్హత కలిగి ఉంటారని, ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు, వృద్ధాప్య పెన్షన్లకు సంబంధించి ఆర్థిక సహాయం పొందే విధంగా దరఖాస్తుల స్వీకరించి ప్రతిపాదన రూపొందించాలన్నారు. అర్హులైన వారికి ప్రభుత్వం నుండి పెన్షన్లు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. సమావేశం లో అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, డి ఆర్డిఓ శ్రీనివాస్, డిఇఓ రేణుక దేవి, ఎంపీడీవో ఎమ్మార్వో ఏపీఎంస్ మున్సిపల్ కమిషనర్లు, ప్రిన్సిపల్స్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ,జిల్లా అధికారులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భగ్గుమన్న పెద్దధన్వాడ



## ఇథనాల్ ఫ్యాక్టరీ పనులపై పెల్లుబికిన ప్రజాగ్రహం

- సుమారు 2వేల మంది తరలిరావడంతో తీవ్ర ఉద్రిక్తత
- మహిళలపై ఫ్యాక్టరీ ప్రైవేటు సైన్యం దాడితో అదుపుతప్పిన పరిస్థితి
- ఓ కంటైనర్, కారు, హిటాచీ వాహనం, గుడిసెలకు నిప్పు
- ముప్పై మందికిపైగా అరెస్ట్.. పోలీస్ స్టేషన్‌లో నిర్బంధం
- గ్రామాల నుంచి ప్రజలు తరలిరాకుండా ఉదయం నుంచే అడ్డుకున్న పోలీసులు
- అరెస్ట్ చేసినవారిని విడుదల చేయకపోతే పోలీస్‌స్టేషన్‌లను ముట్టడిస్తామని గ్రామస్తుల హెచ్చరిక

*పెద్దధన్వాడలో ప్రజాగ్రహం కట్టలు తెంచుకుంది. ఇచ్చిన మాటకు కట్టుబడలేదని నిలదీసేందుకు వస్తున్న ప్రజలపై ఫ్యాక్టరీ ప్రైవేటు సైన్యం దాడి చేయడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. ఈ క్రమంలో ఓ మహిళ తలకు తీవ్రంగా గాయం కావడంతో ఆగ్రహంతో రగిలిపోయిన ఆయా గ్రామాల ప్రజలు ఫ్యాక్టరీ నిర్మాణ స్థలంలో పెద్దఎత్తున మోహరించారు. అక్కడ ఏర్పాటు చేసిన కంటైనర్‌కు నిప్పపెట్టారు. హిటాచీ, కారును ధ్వంసం చేశారు. పోలీసులు చెదరగొట్టే ప్రయత్నం చేసినా అప్పటికే దాదాపు రెండువేల మంది చేరుకోవడంతో ఫ్యాక్టరీ వ్యతిరేక నినాదాలతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. ప్రజాప్రతినిధులు, పోలీసులు, అధికారులు హామీలిచ్చి మాట తప్పారని భగ్గుమన్నారు. అయితే బుధవారం ఉదయం నుంచే పలు గ్రామాల్లో మోహరించిన పోలీసులు పరిశ్రమ నిర్మాణ స్థలానికి రాకుండా అడ్డుకున్నారు. కొందరు గ్రామ నాయకులను నిర్బంధించారు.*

*- రాజోలి/గద్వాల రూరల్, జూన్ 04 (జనంసాక్షి)*





జోగులాంబ గద్వాల జిల్లా రాజోలి మండలం పెద్దధన్వాడలో ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకిస్తూ మొదట్నుంచి ఆందోళనలు కొనసాగుతున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో రిలే దీక్షలు కూడా చేపట్టగా.. కాంగ్రెస్ నేతలు, ప్రభుత్వ అధికారుల హామీతో దీక్షలను విరమించారు. అయితే మంగళవారం అర్ధరాత్రి సమయంలో గుట్టుచప్పుడు కాకుండా ప్రజలంతా గాఢనిద్రలో ఉన్న సమయంలో పెద్దధన్వాడలో కంటైనర్, కొన్ని యంత్రాలతో పాటు ప్రైవేటు సైన్యాన్ని యాజమాన్యం మోహరించింది. ఈ విషయం తెలుసుకున్న ప్రజలు అదేరోజు ఆందోళనకు దిగారు. మరుసటి రోజు బుధవారం ఉదయాన్నే పెద్దధన్వాడ, మాన్‌దొడ్డి, చిన్న తాండ్రపాటు, నసనూరుతో పాటు పలు గ్రామాలకు చెందిన మహిళలు, రైతులు పెద్దఎత్తున ఫ్యాక్టరీ పనుల వద్దకు బయల్దేరారు. ఉదయం నుంచే పోలీసులు, అధికారులు పదుల సంఖ్యల్లో మోహరించినప్పటికీ గ్రామస్తులు వెనక్కి తగ్గలేదు. పురుగుల మందు డబ్బాలతో నిరసనలు చేపడుతున్న గ్రామస్తులను పోలీసులు అడ్డుకున్నారు.
ప్రజాప్రతినిధులు పట్టించుకోవట్లేదని ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇథనాల్ పరిశ్రమను రద్దు చేయాలని, ఈ అంశంపై ప్రభుత్వం దిగిరాకుంటే ఆందోళనను మరింత ఉద్ధృతం చేస్తామని గ్రామస్తులు హెచ్చరించారు. గ్రామంలో భారీగా మోహరించిన పోలీసులను నిరసనకారులు ఎదురించడం.. ఇథనాల్ ఫ్యాక్టరీనా.. మేమా? ఏదో ఒకటే ఉండాలన్నట్లుగా భీష్మించడంతో వారికి సర్ధిచెప్పలేక పోలీసులు వారిని చదరగొట్టే ప్రయత్నం చేశారు.

### ప్రజలపై ప్రైవేటుసైన్యం దాడితో...

ఎలాగైనా ఫ్యాక్టరీ నిర్మించాలని యత్నిస్తున్న యాజమాన్యం ఒకరోజు ముందే ప్రైవేటు సైన్యాన్ని తీసుకొచ్చింది. కొందరు మహిళలు, మరికొందరు యువకులను అక్కడ మోహరించింది. దీంతో పరిశ్రమను వ్యతిరేకిస్తున్న ప్రజలు బుధవారం నిరసన చేపట్టేందుకు అక్కడికి చేరుకున్నారు. ఈ క్రమంలో ఇథనాల్ కంపెనీ రౌడీ షీటర్లు కర్రలతో కొట్టడంతో మరియమ్మ అనే మహిళ గాయపడింది. ఆమెను అయిజ హాస్పిటల్‌కు తరలించగా తలకు 6 కుట్లు వేసి చికిత్స చేశారు. మెరుగైన వైద్యం కోసం గద్వాలకు తీసుకెళ్లారు. కంపెనీ వద్దు అని శాంతియుత నిరసన తెలపడానికి వెళ్లిన మహిళలపై, రైతులపై కంపెనీ రౌడీలు దాడి చేయడంతోనే పరిస్థితి అదుపుతప్పింది. ప్రైవేటు రౌడీల దాడితో ఆగ్రహానికి గురై కంపెనీకి చెందిన కార్లు, టెంట్లు, సామాగ్రికి నిప్పు పెట్టారు. టిప్పర్లు, జేసీబీలను అడ్డుకుని అద్దాలను ధ్వంసం చేశారు. కంపెనీలో పని చేయడానికి వచ్చిన ప్రైవేట్ కూలీలను దాడి చేసి తరిమికొట్టారు. దీంతో ఆ ప్రాంతమంతా రణరంగాన్ని తలపించింది. ఘటనా స్థలంలో పోలీసులను భారీగా మోహరించి నిరసనలకు దిగిన రైతులను అడ్డుకున్నారు. దీంతో గ్రామస్తులు, పోలీసులకు మధ్య ఘర్షణ తలెత్తింది. ఇథనాల్ ఫ్యాక్టరీ యాజమాన్యం దొంగతనంగా కంటైనర్లు, టిప్పర్లు, జేసీబీలను తీసుకురావడం ఏంటని ప్రశ్నించారు. చివరకు పోలీసు అధికారులు సముదాయించడంతో గ్రామస్తులు శాంతించారు.

### గ్రామస్తులపై కేసులు, అరెస్టులు..

ఇథనాల్ కంపెనీ రద్దు కోసం పోరాటం చేస్తున్న వారిని పోలీసులు స్టేషన్‌కి తరలించారని చిన్న ధన్వాడ, పెద్ద ధన్వాడ గ్రామస్తులు తెలిపారు. కొంకల నర్సింహులుతో పాటు పలువురిని అరెస్ట్ చేసినట్టు పేర్కొన్నారు. మానపాడు, రాజోలి పోలీస్ స్టేషన్లలో వారిని నిర్బంధించినట్టు చెప్పారు. ఈ విషయమై రాజోలి ఎస్‌ఐ వివరణ కోరగా మాకేం తెలీదని చెప్పడం గమనార్హం. అయితే అరెస్ట్ చేసినవారిని బేషరతుగా విడుదల చేయాలని, లేకపోతే నేడు పెద్దఎత్తున పోలీస్ స్టేషన్లను ముట్టడిస్తామని పలు గ్రామస్తులు హెచ్చరించారు. నేడు పోలీస్ స్టేషన్ల ఎదుట నిరసనలకు కూడా దిగుతామని చెప్పారు.

### దాడిని ఖండించిన అఖిలపక్ష నేతలు

రైతులు, మహిళలపైన జరిగిన అమానుష సంఘటనను అఖిలపక్ష ప్రజా సంఘాలు తీవ్రంగా ఖండించాయి. ఈ మేరకు గద్వాల పట్టణంలోని శృతి వనం పార్కులో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎక్కడో పట్టణాల్లో ప్రముఖుల దగ్గర ఉండే బౌన్సర్లని మారుమూల ప్రాంతమైన ఇతనాల్ ఫ్యాక్టరీ దగ్గరకు యాజమాన్యం ఎందుకు తీసుకువచ్చిందని ప్రశ్నించారు. మహిళతో పాటు పలువురికి గాయాలయ్యాయని ఘర్షణ వాతావరణాన్ని నెలకొల్పే విధంగా చేస్తున్న యాజమాన్యాన్ని ప్రైవేట్ సైన్యాన్ని వెంటనే అదుపులోకి తీసుకోవాలని అఖిలపక్ష కమిటీ కోరుతున్నట్టు తెలిపారు. ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణం రద్దు చేయకపోతే పెద్దఎత్తున ఉద్యమం ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో పాల్గొని మాట్లాడిన నాయకులు ప్రభాకర్ తెలంగాణ ప్రజా ఫ్రంట్,ఆంజనేయులు సిపిఐ కార్యదర్శి,వెంకటస్వామి సిపిఎం కార్యదర్శి సిఎల్సి సుభాన్,వాల్మీకి భాహుజన రాజ్యసమితి,టీవీ నాగన్న, సిపిఎంఎల్ దానయ్య,ముస్లిం ఫ్రంట్ రహమతుల్లా,టవర్ మబ్బు,రైతాంగ సమితి సమితి నాయకులు ఖాజా హుస్సేన్,నరసింహులు,శివరాజు తదితరులు పాల్గొన్నారు.








### ఇథనాల్ పాలసీని సమీక్షించాలి

**- ప్రొఫెసర్ జి హరగోపాల్**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇథనాల్ పాలసీని సమీక్షించి, రాష్ట్రంలో కంపనీల నిర్మాణాలకు ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీపీజేఏసీ) రాష్ట్ర కన్వీనర్ ప్రొఫెసర్ జి హరగోపాల్, కో కన్వీనర్ కన్నెగంటి రవి, రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ కలపాల బాబురావు డిమాండ్ చేశారు. ఆందోళన చేస్తున్న ప్రజలపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలన్నారు. రాజోలి మండలం పెద్ద ధన్వాడలో అర్ధరాత్రి యంత్రాలు, జేసీబీలను తీసుకురావడంతో ప్రజలు ప్రతిఘటించారు. దిలావర్‌పూర్‌లో ఆందోళన ఫలితంగా పనులు నిలిపేసిన సర్కారు.. పెద్దధన్వాడ ప్రజలకు ఇచ్చిన హామీలను ఉల్లంఘించి ఫ్యాక్టరీ నిర్మాణ పనులకు అనుమతి ఇవ్వడం శోచనీయం. ప్రభుత్వ ఈ వైఖరిని ఖండిస్తున్నాం. ఇకన్నైనా కంపెనీ పనులు ఆపేసేలా ఆదేశాలివ్వాలి. స్థానిక ప్రజలతో చర్చించడం ద్వారా సమస్యల పరిష్కారానికి పూనుకోవాలని కోరుతున్నాం. స్థానిక ప్రజలపై పెట్టిన కేసులను ఎత్తేయాలని, అరెస్టు చేసిన వారిని వదిలేయాలని డిమాండ్ చేస్తున్నాం.




### చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటాం

ప్రభుత్వం నుంచి ఫ్యాక్టరికి అనుమతులు రావడంతో..ఇక్కడ ప్రజలు శాంతియుతంగా చర్చలు జరుపుకోవాలి కానీ, అల్లర్లు సృష్టించకూడదు. నిరసనకారులు ఎవరైనా చట్టాన్ని వారి చేతుల్లోకి తీసుకుంటే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. అల్లర్లు సృష్టించకుండా శాంతియుతంగా చర్చలు జరుపుకోవాలి. రాళ్లతో, కట్టెలతో దాడులు చేస్తే చట్టరీత్యా నేరం.

**- డిఎస్పి, మొగులయ్య**

### అధికార పార్టీ నేతల అండతోనే ఫ్యాక్టరీ యాజమాన్యం అరాచకం



రాజోలి మండలంలోని రైతాంగం మొత్తం పోరాడుతున్నా యాజమాన్యం యధేచ్ఛగా పనులను మొదలుపెట్టడం వెనక అధికార పార్టీ పెద్దల అండదండలే కారణమని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ మాజీ ఛైర్మన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్ ఆరోపించారు. రైతుల ఆవేదనను ఇప్పటికైనా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకొని, తక్షణమే ఇథనాల్ ఫ్యాక్టరీ రద్దుపై స్పష్టమైన అధికారిక ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. రైతులతో చెలగాటమాడి లగచర్లలో చేతులు కాల్చుకున్నా రేవంత్ సర్కార్‌లో మార్పు రాకపోవడం దారుణమన్నారు. రాజోలి మండల రైతులకు నడిగడ్డలోని అన్ని వర్గాలు అండగా నిలవాలని ఆంజనేయ గౌడ్ విజ్ఞప్తి చేశారు.

**- డాక్టర్ ఆంజనేయ గౌడ్, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ మాజీ ఛైర్మన్**

### ప్రయివేటు సైన్యం చేసిన దాడులను ఖండించండి

స్థానిక కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ హామీ మేరకు ప్రజలు రిలే దీక్షలు విరమించారు. పోరాట కమిటీ ప్రతినిధులతో పాటు మంత్రి శ్రీధర్ బాబుని కలిసి సమస్యను వివరించారు. అయినప్పటికీ కంపెనీ రద్దుకై ఎలాంటి చర్యలు తీసుకోకపోగా గత వారం రోజులుగా కంపెనీ నిర్మాణానికి సంబంధించిన పనులు ప్రారంభించడంతో ప్రజలు మర్లవడ్డరు. ఇథనాల్ వల్ల దుష్పరిణామాలు ఇప్పటికే చిత్తనూరులో చూశాం. పూర్తిగా ప్రకృతి వనరులన్నీ కలుషిత మవుతాయి. ఇట్లాంటి కంపెనీని శాంతియుతంగా వ్యతిరేకిస్తున్న రైతులపై కేసులు పెట్టడం సరికాదు. మహిళలపై కర్రలతో ప్రైవేటు సైన్యం దాడిచేస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేస్తున్నట్టు? తెలంగాణలో ఇథనాల్ పరిశ్రమలను ఆపకపోతే గత బిఆర్‌ఎస్ ప్రభుత్వానికి పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుంది.

**- జే చక్రవర్తి, కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి**

### ప్రశ్నించే గొంతులు నొక్కడం సరికాదు



ఇథనాల్ ఫ్యాక్టరీ రద్దు అడ్డుకునేందుకు వెళ్తున్న సమాచారంతో అయిజ పోలీసులు బిఆర్ఎస్ సీనియర్ నాయకులు నాగర్ దొడ్డి వెంకట్రాములు, నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ గొంగళ్ల రంజిత్ కుమార్ ఇంటి వద్దే గద్వాల్ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మహమ్మారి ఫ్యాక్టరీ నిర్మిస్తే గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. కంపెనీ నుంచి వచ్చే కాలుష్యంతో వ్యవసాయం, పశుపక్షాదులతోపాటు మనుషులకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. ప్రశ్నించే గొంతులను నొక్కడం పరిష్కారం ఎలా అవుతుందని ఖండించారు.

**-రంజిత్ కుమార్, నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్**

### ప్రజాపాలనంటే రైతులను అరెస్టులు చేయడమా?

తుంగభద్ర నది తీరంలో పెద్దధన్వాడ గ్రామంలో సారవంతమైన భూములను విషతుల్యం చేసే ఇథనల్ కంపెనీ ఏర్పాటు పై కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉందో తెలపాలని,గ్రామ రైతులు ఇథనల్ కంపెనీ రద్దు చేయాలని కోరితే రైతులను అరెస్టులు చేసి నిర్బందించడం సరైన చర్య కాదని బీఆర్ఎస్వీ పాలమూరు యూనివర్సిటీ కన్వీనర్ తనగల గడ్డం భరత్ బాబు డిమాండ్ చేసారు. అన్నంపెట్టే రైతన్నలను పోలీసులు ఎక్కడికి అక్కడే నిర్బంధించి స్టేషన్లకు తరలించడం సిగ్గుమాలిన చర్య అని తెలిపారు. ఇథనాల్ కంపెని రద్దు కోసం ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామి రెడ్డి, ఎమ్మెల్యే విజేయుడు ప్రభుత్వానికి వినతిపత్రం సమర్పించారని, అసెంబ్లీలో కూడా వారు ఈ విషయంపై మాట్లాడారని అయినా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమైన విషయం అని అన్నారు. ఇథనాల్ కంపెని రద్దు చేసే వరకు పాలమూరు యూనివర్సిటీ విద్యార్థుల మద్దతు ఉంటుందని తెలిపారు.

**- తనగల గడ్డం భరత్ బాబు, బీఆర్ఎస్వీ పాలమూరు యూనివర్సిటీ కన్వీనర్**

### రైతులను పరామర్శించిన ఎమ్మెల్యే

ఇథనాల్ ఫ్యాక్టరీని రద్దు చేయాలని బుధవారం రైతులు ఆందోళన చేశారు. ఈ నేపథ్యంలో పలువురు రైతులను పోలీసులు అరెస్టు చేసి మానవపాడు పోలీస్ స్టేషన్ కు తరలించారు. విషయం తెలుసుకున్న అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అక్కడికి చేరుకున్నారు. పోలీసులు తమను అకారణంగా తీసుకు వచ్చి నిర్బంధించారని రైతులు ఎమ్మెల్యేతో మొరపెట్టుకున్నారు. దీంతో ఎమ్మెల్యే పోలీసులతో వాగ్వాదం చేశారు.



Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077,
Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370